# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

సంపుటి : 09 సంచిక : 124 పేజిలు : 08, వెల రూ. 5రూ/ శనివారం- 10 - మే - 2025


## 23 ఏళ్లకే యుద్ధ విమానాన్ని నడిపా..



- ఆపరేషన్ సిందూర్‌పై పాకిస్థాన్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు.
- భారత్‌కు వ్యతిరేకంగా పాక్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు.
- యుద్ధం చేయడం మన ఉద్దేశ్యం కాదని ఆయన స్పష్టం చేశారు.

హైదరాబాద్, మే 09: భారత్‌కు చెందిన రఫెల్ విమానాన్ని కూల్చేశామంటూ పాకిస్థాన్ చెప్పడం అబద్ధమని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రఫెల్ యుద్ధ విమానం భారత సరిహద్దులు కూడా దాట లేదన్నారు. మన విమానాలు సరిహద్దు కూడా దాటకుండా ఉంటే..

## భారత్–పాక్ యుద్ధం..
# తెలంగాణ కాంగ్రెస్ కీలక నిర్ణయం
### దేశ భద్రత విషయంలో అందరినీ కలుపుకుపోవాలని..

- భారత్ - పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో ఇండియన్ ఆర్మీకి అండగా నిలబడాలని తెలంగాణ కాంగ్రెస్ కీలక నిర్ణయం తీసుకుంది.
- మన భారత గడ్డ మీద పర్యాటకులను చంపిన తీవ్రవాదులను ఏరివేతే లక్ష్యంగా దేశ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్
- నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు ఒక నెల వేతనం విరాళంగా ఇవ్వాలని నిర్ణయించారు.




వివరాలు 2లో..

హైదరాబాద్, మే 9: పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సైనిక దాడి నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ కీలక నిర్ణయం తీసుకుంది. నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు ఒక నెల వేతనం విరాళంగా ఇవ్వాలని నిర్ణయించారు. విరాళం ఇచ్చే విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చర్చించారు. సీఎం సూచన మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీ

## ఇండియన్ ఆర్మీకి
# అండగా ఉందాం



- పాకిస్థాన్‌తో భారతదేశం పోరాడుతోంది..
- ఇండియన్ ఆర్మీకి అండగా నిలుద్దామని అన్నారు మాజీ మంత్రి కేటీఆర్.
- ఖమ్మం జిల్లాలోని తల్లాడ మండలం మిట్టపల్లిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.
- భారత సైన్యానికి మద్దతుగా అండగా నిలుద్దామని మాజీ మంత్రి పిలుపునిచ్చారు.

## భానుడి భగభగ...




- ప్రకాశం దరిమడుగులో 42టీ, తిరుపతి గంగుడుపల్లెలో 41.3
- కోనసీమ ఆత్రేయపురంలో 63.7మిమీ, చొప్పెల్లలో 55మిమీ వర్షపాతం
- రేపు 3 మండలాల్లో తీవ్ర వడగాలులు, 23 మండలాల్లో వడగాలులు.
- అల్లూరి, చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో పిడుగులతో వర్షాలు.

ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎస్డీఎంఏ సూచన

అమరావతి : ఏపీలో కొన్ని జిల్లాల్లో భానుడు ప్రతాపం చూపిస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వర్షాలు కురుస్తున్నాయి. నేడు రాష్ట్రంలోని పలుచోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదవగా, కొన్ని ప్రాంతాల్లో వర్షం పాతం నమోదైంది. రేపు శనివారం కూడా ఇదే తరహా

# భారత్ టెర్రరిజానికి వ్యతిరేకం
## భారత్ మాతాకు జై అంటూ చంద్రబాబు నినాదాలు

- టెర్రరిస్టులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.
- భారత్ మీద దాడులు చేస్తూ పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు.
- టెర్రరిస్టులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని అన్నారు.
- ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.
- భారత్ - పాక్ యుద్ధ భూమిలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీనాయక్ వీరమరణం పొందారు.




వివరాలు 2లో..

అనంతపురం, మే 9: భారతదేశం టెర్రరిజానికి వ్యతిరేకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు(శుక్రవారం) ఛాయాపురం ప్రజావేదికలో సీఎం మాట్లాడుతూ.. కాశ్మీర్‌లో అతికిరాతకంగా ఆడబిడ్డల ఎదురుగా మగవాళ్లను ఇష్టానుసారం చంపేశారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సిందూర్ అనే కార్యక్రమం పెట్టిందని.. టెర్రరిస్టులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని అన్నారు. భారత్ మీద దాడులు చేస్తూ పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. దేశభక్తితో వీర జవాన్ మురళీ నాయక్ అనంతపురం జిల్లా వాసి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఆ కుటుంబానికి అని విధాలా అండగా ఉంటామని..ఆ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. దేశం కోసం మురళీనాయక్ వీర మరణం పొందారని..

## ఐదుగురు చొరబాటుదారులను హతమార్చి
### కశ్మీర్ బోర్డర్‌లో ఏపీ జవాన్ వీరమరణం




- సరిహద్దుల్లో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన అగ్నివీర్ జవాన్ వీరమరణం
- గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన మురళీనాయక్ వీరమరణం

అమరావతి : శ్రీ సత్య సాయి జిల్లా గోరంట్ల మండలంలోని కల్లితండాకు చెందిన అగ్నివీర్ జవాన్ మురళీ నాయక్ (24) వీరమరణం చెందారు. శ్రీరామ్ నాయక్, జ్యోతిబాయిలకు మురళీ నాయక్ ఒక్కరే సంతానం. జవాన్ మురళీ నాయక్ మృతితో, కల్లితండాలో అతని ఇంటి వద్ద కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో విషాదఛాయలు అలుముకున్నాయి. ఐదుగురు చొరబాటుదారులను హతమార్చి: మురళీ నాయక్ 2022 అక్టోబర్?లో మొదటిసారి అగ్నివీర్?కు సెలెక్ట్ అయ్యారు.

## బాంబులతో పేల్చేస్తాం...
# ఢిల్లీ క్రికెట్ స్టేడియానికి బెదిరింపు

- అరుణ్ జైట్లీ స్టేడియం పేల్చివేస్తామని డీడీసీఏకు బెదిరింపు ఈ-మెయిల్
- పాక్ స్లీపర్ సెల్స్ ద్వారా దాడులు చేస్తామని హెచ్చరిక
- ఢిల్లీ పోలీసులకు డీడీసీఏ ఫిర్యాదు... స్టేడియంలో తనిఖీలు




2లో

# ఎకరాకు 65 బస్తాలు వరి పండించిన మంత్రి నిమ్మల..



మనం ఎంత ఉన్నత స్థానంకి చేరుకున్నా మన మూలాలను మరిచిపోకూడదంటారు పెద్దలు. ఈ విషయాన్ని బలంగా నమ్మే వ్యక్తి ఏపి రాష్ట్ర నీటి పారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు.రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు

## 400 డ్రోన్‌లతో
# పాకిస్థాన్ దాడి...



### భారత్‌లోని 36 సరిహద్దు ప్రాంతాలపై పాకిస్థాన్ డ్రోన్ల దాడి
### 300-400 డ్రోన్లతో గురువారం రాత్రి దాడులకు పాల్పడిన పాక్
### భారత సైనిక స్థావరాలు, ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా దాడులు

పౌర విమానాలను రక్షణ కవచంగా పాక్ వాడుతోందని భారత్ ఆరోపణ

ఢిల్లీ : భారత్‌లోని కీలక సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ గురువారం రాత్రి భారీ స్థాయిలో డ్రోన్ల దాడికి పాల్పడిందని భారత ప్రభుత్వం వెల్లడించింది. జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లోని సుమారు 36 ప్రాంతాలపై 300 నుంచి 400 డ్రోన్లను ప్రయోగించిందని భారత సైన్యం తెలిపింది. ఈ దాడుల వెనుక భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా సమాచారాన్ని సేకరించడమే పాక్ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొంది. 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు ఈ సంచలన విషయాలను తెలిపారు. గురువారం రాత్రి పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు దిగి, నియంత్రణ రేఖ వెంబడి ఉల్లంఘనలకు పాల్పడుతూ భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు ప్రారంభించిందని వారు వివరించారు. పాక్ వైపు నుంచి వచ్చిన అనేక డ్రోన్లను భారత బలగాలు కూల్చివేశాయని, ఈ ఘటనల్లో పలువురు గాయపడ్డారని వారు పేర్కొన్నారు. పంజాబ్ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తత కొనసాగుతోందని, మిగతా..2లో

# భారత్ – పాక్ వార్..
### తెలుగు రాష్ట్రాల్లోని ఆ ప్రాంతాల్లో హైఅలర్ట్




- భారత్- పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో హైఅలర్ట్ ప్రకటించారు.
- రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 14 ప్రాంతాల్లో హైఅలర్ట్ జారీ అయ్యింది.
- హైదరాబాద్‌లోని ఆరు హైఅలర్ట్ జోన్లలో అక్టోపస్, లా అండ్ అండ్ పోలీసులు,
- భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో రాష్ట్రాలను కేంద్ర హోంమంత్రిత్వ శాఖ అప్రమత్తం

హైదరాబాద్, మే 9: భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ తెలుగు రాష్ట్రాల్లోని 14 ప్రాంతాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. తెలంగాణలోని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు, కూకట్‌పల్లి, నాంపల్లి, హైదరాబాద్ సెంట్రల్ బస్‌స్టేషన్, ట్యాంక్‌బండ్‌తో పాటు ఏపీలోని తిరుమల, విశాఖ ఆర్కే బీచ్,

# భారత్ టెర్రరిజానికి వ్యతిరేకం

మొదటి పేజి తరువాయి

అతడి తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నానన్నారు. బార్డర్‌లో ఉండి నిద్రాహారాలు మాని జవాన్లు దేశ రక్షణ చేస్తుండటం వల్లే ఇక్కడ మనం హాయిగా నిద్ర పోతున్నామన్నారు. పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడటం మంచిది కాదన్నారు. దేశం చేసే పోరాటానికి ప్రతి ఒక్కరూ సంఘీభావం తెలపాలన్నారు. భారత్ మాతాకు జై అంటూ చంద్రబాబు నినాదాలు చేశారు. అలాగే వీరమరణం పొందిన మురళీనాయక్ ఆత్మకు శాంతి కలగాలని సీఎం చంద్రబాబు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కాగా.. భారత్ - పాక్ యుద్ధ భూమిలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీనాయక్ వీరమరణం పొందారు. మురళీ నాయక్ మృతిపట్ల సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహా రాజకీయ నేతలు నివాళులర్పించారు. మృతుడు మురళీ నాయక్ కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించారు సీఎం. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రేపు(శనివారం) మురళీ నాయక్ మృతదేహం స్వస్థలానికి చేరుకోనున్నారు.

సీఎం పర్యటన..

అనంతపురం జిల్లా జిల్లాలో పర్యటించిన సీఎం చంద్రబాబు.. ఉరవకొండ నియోజకవర్గం చాయాపురంలో హంద్రీనీవా సుజల స్రవంతి పనులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. హంద్రీనీవా పనులపై అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కి.మీ మేర సాగుతున్న పనులను డ్రోన్ ద్వారా పరిశీలించారు. ప్రోగ్రామింగ్ ద్వారా రోజూ ఎంతమేర పనులు చేశారో డ్రోన్ ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. నాలుగు ఏజన్సీల ద్వారా పనులు జరుగుతున్నాయని ఈ సందర్భంగా అధికారులు సీఎంకు వివరించారు. ఇటీవల నాలుగుసార్లు వర్షాలు కురవడంతో పనులకు కొంతమేర ఆటంకం ఏర్పడిందని తెలుపగా... ఇకపై వేగంగా పనులు సాగించాలని సీఎం సూచించారు. నిర్దేశిత కాలానికి ఎట్టిపరిస్థితుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# భానుడి భగభగ...

వాతావరణం కొనసాగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) కీలక సూచనలు జారీ చేసింది. ఇవాళ ప్రకాశం జిల్లా దరిమడుగులో అత్యధికంగా 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, తిరుపతి జిల్లా గంగుడుపల్లెలో 41.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు ఏపీఎస్డీఎంఏ తెలిపింది. మరోవైపు, కొన్ని జిల్లాల్లో వాతావరణం చల్లబడింది. కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో అత్యధికంగా 63.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అదే జిల్లా చొప్పెలలో 55 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఆకస్మిక వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.

వాతావరణ సూచన

రేపు శనివారం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల నుంచి 43.5 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ అంచనా వేసింది. మూడు మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 23 మండలాల్లో వడగాలుల ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకపోవడం మంచిదని సూచించింది. అదే సమయంలో, రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ పేర్కొంది. అల్లూరి సీతారామరాజు, చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇతర జిల్లాల్లో కూడా చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది.

## ఎకరాకు 65 బస్తాలు వరి పండించిన మంత్రి నిమ్మల..

చేపట్టినప్పటి నుంచి ఊపిరి సలపకుండా ఎంతో బిజీగా ఉంటూ కూడా.. నిమ్మల రామానాయుడు తనకు చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టమైన వ్యవసాయాన్ని మాత్రం వదలలేదు. స్వగ్రామమైన పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం అగర్తిపాలెంలో తనకున్న ఆరు ఎకరాల వ్యవసాయ భూమిలో సొంతంగా వ్యవసాయం చేస్తూ మంచి దిగుబడిని సాధిస్తారు. రబీ సీజన్లో ఆయన ఆరు ఎకరాల్లో సన్నరకం వరిని సాగు చేసి మంచి దిగుబడిని సాధించారు. మొత్తం ఆరు ఎకరాల్లో 390 బస్తాలను పండించారు. అంటే ఎకరాకు 65 బస్తాలు చొప్పున పండించారు. సాధారణంగా ఎకరాకు 50 బస్తాలు పండిస్తే గొప్పగా చెప్పుకుంటారు. కానీ మంత్రి నిమ్మల రామానాయుడు వరి నాట్లు వేసినప్పుడు నుంచి ఎప్పటికప్పుడు వాటి సంరక్షణను చూసుకుంటూ.. వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు స్వయంగా ఎరువులు జల్లడం పురుగుమందులు పిచికారి వంటివిచేసేవారు. అందుకే ఆయన పొలంలో మంచి దిగుబడి వచ్చింది. మంత్రి నిమ్మల తన వ్యవసాయ పొలంలో ఎకరాకు 65 బస్తాలు పండించడంతో నియోజకవర్గంలోని రైతులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు తాము కూడా మంత్రి బాటలో అధికారుల సూచనలతో వ్యవసాయం చేస్తామని అంటున్నారు. మొత్తానికి రామానాయుడు మంత్రిగా ముఖ్యమంత్రి చంద్రబాబు మన్ననలు, ప్రజల మన్ననలను పొందడమే కాకుండా రైతుగా కూడా మేటిగా పేరు తెచ్చుకుంటున్నారు.

# 23 ఏళ్లకే యుద్ధ విమానాన్ని నడిపా..

వాటిని ఎలా పాకిస్థాన్ కూలుస్తుందని ఆయన సందేహం వ్యక్తం చేశారు. యుద్ధం చేయడం మన ఉద్దేశ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా కేవలం టెర్రరిస్ట్ క్యాంపులను మాత్రమే భారత సైన్యం కొట్టేసిందని చెప్పారు. పాకిస్తాన్ తీవ్ర ఇబ్బందుల్లో ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పేరుకు ప్రజాస్వామ్య దేశమైనప్పటికీ పాకిస్థాన్‌ను మాత్రం ఆర్మీ నడిపిస్తుందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తాను మిలిటరీ పర్సన్‌గా చెబుతున్నానని.. భారత సైన్యం అద్భుతంగా పాకిస్థాన్‌పై దాడి చేసిందన్నారు. డ్రోన్స్, రఫేల్ యుద్ధ విమానాలతో సైన్యం దాడి చేసిందని చెప్పారు. డ్రోన్లు పాకిస్థాన్ భూభాగంలోకి వెళ్ళాయని.. అయితే రఫేల్ యుద్ధ విమానాలు మాత్రం భారత సరిహద్దును దాట లేదని తెలిపారు. అయితే తాను లోక్ సభ సభ్యుడిగా ఉన్నప్పుడు పార్లమెంట్ డిఫెన్స్ కమిటీలో సభ్యుడినని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఏప్రిల్ 22వ తేదీ పహల్గాంలో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని అభివర్ణించారు. కుటుంబాలని కళ్ళ ముందు విడదీసి మతం అడిగి మరి కాల్చి చంపారంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. కాశ్మీర్‌లో హిందూ, ముస్లింల మధ్య విభేధాలు సృష్టించాలని ఉగ్రవాదులు ప్రయత్నం చేశారని విమర్శించారు. పహేల్గాం దాడి చేసింది ది రెసిస్టెన్స్ ఫ్రంట్ అనేది లష్కర్ ఏ తోయిబాకి ఫ్రంటల్ ఆర్గనైజేషన్ అని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. పాకిస్థాన్ గురువారం దాడి చేసిన అనేక ప్రాంతాల్లో తాను సంవత్సరాల పాటు పని చేశానని ఆయన తెలిపారు. భారత దేశ రక్షణలో చాలా చిన్న వయసులోనే తాను మిగ్ 23 విమానాన్ని నడిపానని పేర్కొన్నారు. ఇరవై సంవత్సరాల వయస్సుకే తాను యుద్ధ విమానాన్ని నడిపానన్నారు. మిగ్ 21 యుద్ధ విమానానికి తాను పైలెట్‌గా సైతం పని చేశానని చెప్పారు. మిగ్ 23 యుద్ధ విమానానికి సెలెక్ట్ అయ్యానని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. శబ్ద వేగం కంటే 2.5 శాతం వేగంగా మిగ్ 23 పని చేస్తుందని ఆయన వివరించారు.

# 400 డ్రోన్‌లతో పాకిస్థాన్ దాడి...

పాక్ దాడులను భారత వాయుసేన సమర్థంగా అడ్డుకుందని తెలిపారు. దాడుల కోసం టర్కీకి చెందిన 'ఆసిస్‌గార్డ్ సోంగర్' రకం డ్రోన్లను పాకిస్థాన్ ఉపయోగించినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలిసిందన్నారు.

పౌర విమానాలను రక్షణ కవచాలుగా వాడుకుంది

ఈ దాడుల సందర్భంగా పాకిస్థాన్ తన పౌర విమానాలను రక్షణ కవచాలుగా వాడుకుందని భారత రక్షణ శాఖ ప్రతినిధులు తీవ్ర ఆరోపణలు చేశారు. పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులు ప్రారంభించినప్పటికీ, కరాచీ, లాహోర్ మధ్య పౌర విమాన సర్వీసులను నిలిపివేయలేదని వారు తెలిపారు. తమ దాడులకు భారత్ నుంచి ప్రతిస్పందన వస్తుందని తెలిసి కూడా, పౌర విమానాలను అడ్డుపెట్టుకోవడం ద్వారా పాకిస్థాన్ అత్యంత బాధ్యతారహితంగా వ్యవహరించిందని అన్నారు. ఇది భారత్-పాక్ అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో ప్రయాణించే విమానాలతో పాటు, పాకిస్థాన్‌లోని పౌర విమానాలకు కూడా సురక్షితం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, పాకిస్థాన్ ప్రార్థనా మందిరాలను కూడా లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోందని, ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోందని వారు ఆరోపించారు. అంతర్జాతీయ విమానయాన నిబంధనలను, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని భారత వాయుసేన పూర్తి సంయమనంతో వ్యవహరించిందని కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు స్పష్టం చేశారు. పాకిస్థాన్ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి కవ్వింపు చర్యలను భారత్ ఉపేక్షించబోదని వారు హెచ్చరించారు.

## 96 ఏళ్ల వృద్ధురాలితో కలిసి భోజనం చేసిన పవన్..



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మరోసారి తన మంచి మనసు చాటుకున్నారు. తన వీరాభిమాని అయిన 96 ఏళ్ల వృద్ధురాలు పోతుల పేరంటాలుతో కలిసి భోజనం చేశారు. పేరంటాలు కోరిక మేరకు ఈరోజు జనసేన క్యాంప్ కార్యాలయానికి ఆహ్వానించి.. ఆవిడతో కలిసి పవన్ భోజనం చేశారు. అంతేకాదు చీర, లక్ష రూపాయల నగదును కూడా అందించారు. డిప్యూటీ సీఎంను కలవడమే కాకుండా.. భోజనం చేయడంతో పేరంటాలు సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. పవన్ కల్యాణ్‌తో పేరంటాలు భోజనం వీడియోస్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొత్త ఇసుకపల్లికి చెందిన పోతుల పేరంటాలు.. పవన్ కల్యాణ్, జనసేన పార్టీకి వీరాభిమాని. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ పిఠాపురం నుంచి పోటీ తెలిసిందే. పవన్ మీది అభిమానంతో ఆయన విజయం సాధించాలని గ్రామంలోని వేగులమ్మ తల్లికి పేరంటాలు పొర్లు దండాలు పెట్టారు. పవన్ గెలిస్తే అమ్మవారికి గరగ చేయించి సమర్పిస్తానని మొక్కుకున్నారు. పవన్ భారీ మెజారితో గెలవడంతో.. తనకు వచ్చే పింఛను సొమ్ములో రూ.2,500 చొప్పున పోగు చేసింది. 2025 మే నెలతో రూ.27 వేలు కాగా.. ఆ సొమ్ముతో అమ్మవారికి గరగ చేయించి సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా పవన్‌తో కలిసి భోజనం చేయాలనుందని చెప్పారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం ఈరోజు పేరంటాలును క్యాంప్ కార్యాలయానికి ఆహ్వానించారు.

# ఐదుగురు చొరబాటుదారులను హతమార్చి

మొదటి పేజి తరువాయి

మహారాష్ట్రలోని నాసిక్?లో విధులు నిర్వహించేవాడు. ప్రస్తుతం జమ్మూ కశ్మీర్ బార్డర్?లో విధులు నిర్వహిస్తుండగా, గురువారం రాత్రి చొరబాటుదారులను అడ్డుకునే క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో మురళీ నాయక్ ఐదుగురు చొరబాటుదారులను హతమార్చారు. అక్కడ జరిగిన ఎదురు కాల్పుల్లో మురళీ నాయక్ వీరమరణం పొందారు. "అగ్నివీర్?గా సెలక్ట్ అయ్యాడు. మొదట మహారాష్ట్రలోని నాసిక్?లో ఆరు నెలలు ట్రైనింగ్ ఇచ్చారు. తరువాత ఒక సంవత్సరం అస్సాంకి మార్చారు. అక్కడ నుంచి జమ్మూ కశ్మీర్?కి మార్చారు. అక్కడ రాత్రి జరిగిన కాల్పుల్లో మా కొడుకు మరణించాడు. బంధువులు, మేము మా కొడుకు ముఖం చూడాలి అని కోరుకుంటున్నాము". - రామ్ నాయక్, మురళి నాయక్ తండ్రి దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు: దేశ రక్షణలో శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ శాసనసభ నియోజకవర్గం గోరంట్ల మండలానికి చెందిన మురళీ నాయక్ అనే సైనికుడు ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళీ నాయక్?కు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సీఎం ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మురళీనాయక్ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి సీఎం వారిని పరామర్శించారు. మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన మురళీ త్యాగాన్ని దేశమంతా గుర్తుపెట్టుకుంటుందని ముఖ్యమంత్రి అన్నారు. 25 ఏళ్ల వయసులోనే దేశం కోసం అమరుడైన మురళీ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం తెలిపారు. వీరజవాన్ మురళీ తల్లిదండ్రుల ఆవేదన తీర్చలేనిది అయినా, ధైర్యంగా ఉండాలని ముఖ్యమంత్రి వారిని






కోరారు. జవాను మురళీనాయక్ వీరమరణాన్ని జాతి మరచిపోదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానన్నారు. మురళీనాయక్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జవాన్ మృతికి ఘననివాళులు: మురళీ నాయక్ మరణించడంతో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంత్రి సవిత సొంత నిధులతో జవాన్ తల్లిదండ్రులకు రూ.5 లక్షల చెక్కు అందజేశారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జవాను తల్లిదండ్రులను ఫోన్లో ఓదార్చారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, శనివారం మధ్యాహ్నానికి జవాన్ మురళీ నాయక్ పార్థివ దేహం గ్రామానికి చేరుతుందన్నారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామన్నారు. యువతలో స్ఫూర్తిని నింపే విధంగా జవాన్ విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. అన్నివిధాలా అండగా ఉంటాం: ఆపరేషన్ సిందూర్?లో భాగంగా జమ్మూ కశ్మీర్ యుద్ధభూమిలో పోరాడుతూ మురళీ నాయక్ వీరమరణం పొందడం తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. మురళీ నాయక్ చూపిన ధైర్య, సాహసాలు రాష్ట్రానికే గర్వకారణమని తెలిపారు. మురళీ నాయక్ కుటుంబానికి అన్నివిధాలా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. మురళీ నాయక్ వీర మరణం పొందడం తీవ్ర వేదనను కలిగించిందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు విడిచిన మురళీ నాయక్ వీర మరణం తెలుగు ప్రజలకే కాక దేశ ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. మురళీ నాయక్ ప్రదర్శించిన ధైర్యసాహసాలకు బిగ్ సెల్యూట్ చేశారు. మురళీ నాయక్ కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. దేశం కోసం తన ప్రాణాలను అర్పించి అమరవీరుడైన మురళీ నాయక్?కి అశ్రు నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మురళి నాయక్ వీర మరణం పొందటం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మురళీ నాయక్?కు జోహార్లు అన్నారు.

# బాంబులతో పేల్చేస్తాం... ఢిల్లీ క్రికెట్ స్టేడియానికి బెదిరింపు

మొదటి పేజి తరువాయి

దేశ రాజధాని ఢిల్లీలోని ప్రఖ్యాత అరుణ్ జైట్లీ స్టేడియంకు బాంబు బెదిరింపు రావడం తీవ్ర కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి శుక్రవారం ఉదయం ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ)కు ఈ మేరకు ఒక ఈ-మెయిల్ అందింది. దాడులకు పాల్పడతామని, ఇందుకోసం భారత్ వ్యాప్తంగా పాకిస్థాన్‌కు విధేయులైన స్లీపర్ సెల్స్ సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించినట్లు సమాచారం. ఈ స్టేడియం ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు హోం గ్రౌండ్‌గా ఉండగా, మే 11న ఇక్కడ ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే, టోర్నమెంట్‌ను వారం రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు బీసీసీఐ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ బెదిరింపు ఈ-మెయిల్ అందిన విషయాన్ని డీడీసీఏ ఉన్నతాధికారి ఒకరు ధృవీకరించారు. టైమ్స్ ఆఫ్ ఇండియా డాట్ కామ్‌తో మాట్లాడుతూ, "అవును, ఈ ఉదయం మాకు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. దానిని వెంటనే ఢిల్లీ పోలీసులకు పంపాము. వారు



ఇప్పటికే రంగంలోకి దిగి, స్టేడియాన్ని తనిఖీ చేశారు" అని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీ పోలీసులు స్టేడియం వద్ద భద్రతను కట్టుదిట్టం చేసి, బెదిరింపు ఈ-మెయిల్ మూలాలపై దర్యాప్తు చేస్తున్నారు. భద్రతా వర్గాలు అన్ని కోణాల్లోనూ విచారణ జరుపుతున్నాయి. ఇదిలా ఉండగా, ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా భారత సైన్యం చేపట్టిన చర్యలు, అలాగే ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య మ్యాచ్ జరుగుతుండగా వైమానిక దాడి హెచ్చరిక (ఎయిర్ రెయిడ్ అలర్ట్) మోగడం వంటి పరిణామాల నేపథ్యంలో, జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా ఐపీఎల్ 2025ను వారం రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఈ విషయంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ, "అన్నింటికన్నా దేశ ప్రయోజనాలే అత్యంత ముఖ్యం" అని స్పష్టం చేశారు. భారత సాయుధ బలగాలకు బీసీసీఐ సంఘీభావం తెలుపుతుందని, దేశ సమగ్రత, భద్రతకు కట్టుబడి ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. టోర్నమెంట్‌లో ఇంకా 16 మ్యాచ్‌లు మిగిలి ఉండగా, భాగస్వాములు మరియు అధికారులతో పరిస్థితిని సమీక్షించిన అనంతరం సవరించిన షెడ్యూల్‌ను ప్రకటిస్తామని బీసీసీఐ వెల్లడించింది.

# భారత్ - పాక్ వార్..

మొదటి పేజి తరువాయి

విజయవాడ రైల్వేస్టేషన్, విజయవాడ బస్‌స్టాండ్, ఎంజీ రోడ్‌లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని కేంద్రం సూచించింది. హైదరాబాద్ అంతా కూడా అలర్ట్ జోన్‌లో ఉంది. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షణ కొనసాగుతోంది. డీజీ స్థాయి అధికారి హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ పర్యవేక్షణలోనే సూచనలు వెళ్తున్నాయి. సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్‌లను నమ్మవద్దని పోలీసులు, ప్రభుత్వం ఇచ్చే అధికారిక సమాచారాన్నే నమ్మాలని పోలీసులు చెబుతున్నారు. హైదరాబాద్‌లోని ఆరు హైఅలర్ట్ జోన్లలో ఆక్టోపస్, లా అండ్ అండ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాయి. పాక్ దాడుల నేపథ్యంలో టీటీడీ అధికారులను కేంద్ర హోంశాఖ అధికారులు అప్రమత్తం చేశారు. తిరుమల్లో తీసుకువాల్సిన భద్రతా చర్యలపై టీటీడీ అధికారులకు కేంద్ర హోం శాఖ అధికారులు పలు సూచనలను చేశారు. కేంద్రం ఆదేశాలు మేరకు తిరుమల్లో భద్రతను టీటీడీ మరింత పటిష్టం చేసింది. మరోవైపు భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో రాష్ట్రాలను కేంద్ర హోంమంత్రిత్వ శాఖ అప్రమత్తం చేస్తోంది. అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ లేఖ రాసింది. అవసరమైన ముందు జాగ్రత్త చర్యలను సమర్థవంతంగా





అమలు చేయడానికి పౌర రక్షణ నిబంధనల ప్రకారం అత్యవసర అధికారాలను ఉపయోగించాలని ఆదేశించింది. అలాగే దేశ వ్యాప్తంగా అన్ని పోర్టుల్లో భద్రత పెంచారు. భద్రతను రెండో లెవల్‌కు పెంచుతూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. భద్రతా పెంపు ఆదేశాలు వెంటనే అమలులోకి వస్తాయని షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ తెలిపారు. పోర్టులు, షిప్పులు, టర్మినల్స్‌లో కేంద్రం భద్రతను పెంచింది.

స్టేషన్లలో భద్రత పెంచాం: సెంట్రల్ రైల్వే సిపిఆర్వో శ్రీధర్

భారత్, పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో రైల్వే స్టేషన్లలో భద్రత పెంచామని సెంట్రల్ రైల్వే సీపీఆర్వో శ్రీధర్ అన్నారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో ఉద్యోగుల సెలవులను రద్దు చేశామన్నారు. ఆర్పీఎఫ్, ఇంటెలిజెన్సీ పోలీసుల నిఘా పెంచామని తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలను రద్దు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే నుంచి గుజరాత్, ఢిల్లీ, రాజస్థాన్ రూట్లల్లో రైళ్ళు యధావిధిగా నడుస్తున్నాయని అన్నారు. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్‌పై ప్రత్యేకంగా నిఘా పెట్టామని శ్రీధర్ వెల్లడించారు.

# భారత్-పాక్ యుద్ధం.. తెలంగాణ కాంగ్రెస్ కీలక నిర్ణయం

మొదటి పేజి తరువాయి

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చర్చించి ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించనున్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ విజ్ఞప్తి చేసింది.

### భారత ఆర్మీకి మంచి జరగాలని

మన భారత గడ్డ మీద పర్యాటకులను చంపిన తీవ్రవాదులను ఏరివేతే లక్ష్యంగా దేశ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ టార్గెట్ విజయవంతం అయ్యేందుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కీలక ఆదేశాలు జారీ చేశారు. భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని మన రాష్ట్రంలో ఉన్న ప్రతి దేవాలయంలో పూజలు చేయాలని మంత్రి ఆదేశించారు. ఇంతటి సంక్లిష్టమైన సమయంలో భారత ఆర్మీకి అంతా అండగా నిలవాల్సిన సందర్భమన్నారు. పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ రెండో దాడి విజయవంతం అవడం హర్షించదగ్గ విషయమని అన్నారు. మన ఆర్మీ బలగాలు సరిహద్దులో పెద్ద ఎత్తున పోరాడుతున్న సమయంలో వారి క్షేమం కోరి అంతా పూజలు చేయడం సందర్భోచితమని మంత్రి కొండా సురేఖ అన్నారు. తీవ్రవాదాన్ని యావత్ భారతమంతా ఉక్కు పిడికిలితో ఎదుర్కొన్నదన్నారు. ఈ సమైక్యత దేశ భద్రత విషయంలో రానున్న రోజుల్లో కూడా ఉంటుందన్నారు. తీవ్రవాదం ఏ రూపంలో ఉన్నా.. ఎక్కడ ఉన్నా కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. మన దేశ పౌరుల మీద ఇటీవల కాశ్మీర్‌లో జరిగిన దాడికి నిరసనగా ఇండియన్ మిలటరీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అందరూ స్వాగతిస్తున్నామన్నారు. తెలంగాణ మంత్రిగా కాదు, ఇంతటి గొప్ప దేశ పౌరురాలిగా ఈ చర్యపై చాలా సంతోషంగా భావిస్తున్నట్లు తెలిపారు. పుల్వామాలో మనం కోల్పోయిన వీర సైనికులను తిరిగి తీసుకురాలేమని.. వారి త్యాగం శాశ్వతమన్నారు. మనమున్నంత కాలం వారిని స్మరించుకుంటామన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ తలెత్తి నిలిచిందన్నారు. ఏకత్వంతో, శక్తితో, నిశ్శబ్దమైన సంకల్పంతో మనల్ని ప్రపంచం నిలబెట్టిందని చెప్పుకొచ్చారు. ఇది కేవలం ప్రతిస్పందన కాదని.. ఒక ప్రతి సమాధానమని వెల్లడించారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో చాలా మర్యాదగా ప్రవర్తించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ భద్రత విషయంలో అందరినీ కలుపుకుపోవాలని..





ఎందుకంటే ఇది దేశానికి సంబంధించిన విషయమన్నారు. ఈ సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎటువంటి రాజకీయం చేయాలని అనుకోవడం లేదని... చేయదు కూడా అని స్పష్టం చేశారు. తాము భారత ఆర్మీకి పూర్తి మద్దతుగా ఉన్నామని.. రానున్న రోజుల్లో కూడా ఉంటామన్నారు. అందుకే ఈరోజు తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గుడిలో, దేవాలయాలో ఆర్మీకి మంచి జరగాలని పూజలు చేస్తున్నామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

# ఇండియన్ ఆర్మీకి అండగా ఉందాం

మొదటి పేజి తరువాయి

ఖమ్మం, మే 9: భారత్ - పాకిస్థాన్ యుద్ధంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. పాకిస్థాన్‌తో భారతదేశం పోరాడుతోందన్నారు. ఇండియన్ ఆర్మీ వీరోచితంగా పోరాడుతున్నారని కొనియాడారు. భారత సైన్యానికి మద్దతుగా అండగా నిలుద్దామని మాజీ మంత్రి పిలుపునిచ్చారు. ఈరోజు (శుక్రవారం) జిల్లాలో పర్యటించిన కేటీఆర్.. మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ దివంగత రాయల శేషగిరిరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం తల్లాడ మండలం మిట్టపల్లిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... మాజీ డీసీఎంఎస్ రాయల శేషగిరిరావు ఘనంగా నివాళులర్పించారు. శేషగిరి రావు రైతుల కోసం పోరాడారని గుర్తుచేశారు. ఖమ్మం జిల్లాకు మూడు మంత్రి పదవులు వచ్చాయని.. కానీ జిల్లాకు జరిగిన ప్రయోజనం ఏంటి అని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం.. ఎన్నికలలో గెలవటానికి అఫిడవిట్లు రాసి, బాండ్లు రాసి ప్రమాణాలు చేశారని.. ఆ ప్రమాణాలు ఏమయ్యాయని నిలదీశారు.



కేసీఆర్ అమలు జరిపిన పథకాలన్నీ ఎత్తేశారని మండిపడ్డారు. రైతులకు రుణమాఫీ చేయలేక పోయారని విమర్శించారు. ఆడబిడ్డలకు డబ్బులు, తులం బంగారం అన్నారు ఏది ఏమైందని అడిగారు. ఇప్పుడు బాగుందా మార్పు అని అడిగారు. ఖమ్మం జిల్లాలో మార్పు మార్పు అని కాంగ్రెస్‌కు గుద్దారు ఇప్పుడు ఏమైంది.. ఎక్కడ మార్పు అని నిలదీశారు. 'మీకు కొద్దిగా మాపై బోర్ కొట్టింది. వాళ్లకు ఓట్లు వేశారు. ఇప్పుడు ఏమైంది ' అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలేది లేదని.. నిలదీసి తీరతామని స్పష్టం చేశారు.

డిప్యూటీ కలెక్టర్‌కు డిమోషన్.. సుప్రీం సంచలన తీర్పు

రేవంత్ రెడ్డి అంత నికృష్ట ముఖ్యమంత్రి ఎవరూ లేరన్నారు. 'ఢిల్లీలో అపాయింట్‌మెంట్స్ ఇవ్వటం లేదు. చెప్పులు ఎత్తుకుపోయే వాడిగా, దొంగలా చూస్తున్నారట. దొంగను దొంగలా చూడక ఎలా చూస్తారు' అంటూ ఎద్దేవా చేశారు. అంబేద్కర్ కూడా ఇటువంటి దుర్మార్గులు వస్తారని ఊహించి ఉండరన్నారు. తొందరలోనే ప్రజలకు మంచి అవకాశం వస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని.. తామంతా సీరియస్‌గా పని చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరేద్దామని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు అన్నీ గెలవాలని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. బహిరంగ సభలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. సరిహద్దులలో వీరోచితంగా పోరాడుతున్న భారత సైనికులకు సెల్యూట్ చేశారు. భారత సైన్యానికి అండగా నిలుద్దామన్నారు. మాజీ డీసీఎంఎస్ రాయల శేషగిరిరావుకు రవిచంద్ర నివాళులర్పించారు.

# సంపాదకీయం

## ఏ వెలుగులకీ లెక్కలు

తాత్కాలిక ఆవేశంతోనో, స్పందనతోనో, చిరకాల కోరిక నెరవేరుతుందన్న ఆశావహ దృష్టితోనో చూస్తే చరిత్రాత్మకం అనిపిస్తాయి. సమకాలీన చరిత్రను కొత్త మలుపు తిప్పే శక్తి వాటికి ఉన్నదని భావించేలా మనపై ప్రగాఢ ముద్రవేస్తాయి. 14 ఏళ్ల కిందట సామాజిక, ఆర్థిక కులగణనను (ఎస్ఈసీసీ) చేపడతామని ఆనాటి యూపీయే ప్రభుత్వం ప్రకటించినప్పుడు అన్నిరంగాల్లో సామాజిక న్యాయం, రిజర్వేషన్ల పరిధి బాగా విస్తరించాలని కోరుకుంటున్న వారందరూ అలాగే భావించారు. కులగణన అనేది కులనిర్మూలనకు దారితీస్తుందని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త సతీశ్ దేశ్‌పాండే ఘనంగా ప్రకటించారు. మరో ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త గేల్ ఆమ్‌వెట్ సమానత్వానికి అవసరమైన విధానాల రూపకల్పనకు కులగణన ఎంత అవసరమో వివరించారు. దాన్ని వ్యతిరేకించే వారందరూ కళ్లముందున్న సామాజిక అసమానతలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కులగణన అనేది సంక్లిష్టమైనది కానేకాదనీ, ప్రతివ్యక్తి దగ్గరికి వెళ్లి నీ కులం ఏమిటి? అని అడిగి దాన్ని నమోదుచేస్తే సరిపోతుందనీ ఆమ్‌వెట్ సూచించారు. అట్లా సేకరించిన సమాచారాన్ని ఇతరత్రా వాటిని ఆధారం చేసుకుని నిపుణులు నింపాదిగా విశ్లేషణ చేసి వివిధ కులాల ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా ఏ వర్గానికి చెందుతారో నిర్ణయించవచ్చని చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా చెప్పే కులాల పేర్లను జనాభా సేకర్తలు యథాతథంగా రాసుకోవాలనీ, ముందుగా నిర్దేశించుకున్న కొన్ని కేటగిరీల్లో చేర్చేలా ఫలానా విధంగా సమాచారం చెప్పాల్సిందిగా నిర్బంధం పెట్టకూడదని కూడా సూచించారు. ఎన్నో తర్జనభర్జనల అనంతరం ఆనాడు సామాజిక, ఆర్థిక, కులగణను ఆమ్‌వెట్ లాంటి వాళ్లు సూచించిన పద్ధతిలోనే చేపట్టారు. 6.4 లక్షల 'టాబ్స్'తో 640 జిల్లాల్లో డిజిటల్‌గా సమాచారాన్ని సేకరించారు. జనాభా సేకరణ చట్టం పరిధిలో కాకుండా ఆ కులగణనను వేరుగా నిర్వహించారు. అందుకే జనాభా లెక్కలతో పాటు ఆ సమాచారాన్ని వెల్లడించలేదు. విడిగా కూడా కులాల సమాచారాన్ని బహిరంగపరచలేదు. అంతలోనే ఎన్నికలు వచ్చాయి. యూపీయే ప్రభుత్వం ఓడిపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 2015లో పాక్షికంగా కొంత సమాచారాన్ని వెల్లడించింది. అది కూడా గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన ఆర్థిక సమాచారాన్ని మాత్రమే ప్రకటించింది. గ్రామీణ ప్రాంతాల్లోని 17.91 కోట్ల కుటుంబాల్లో 7.05 కోట్ల కుటుంబాలు ప్రభుత్వ చేయూత అవసరం లేనివిగా గుర్తించారు. 16 అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆ నిర్ణయానికి వచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక పరిస్థితులపై 2011కు ముందు కూడా అవసరమైన సమాచారం ఉంది. కానీ దేశవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులను ఏకకాలంలో సర్వేచేయటంతో అంతకుముందు లేనంత స్థాయిలో సమగ్రంగానే సమాచారం లభ్యమైంది. కులగణన కోసం పట్టుపట్టిన వాళ్లకు ఆ సమాచారం సంతృప్తిని ఇవ్వలేదు. వెనుకబడిన కులాల జనాభా ఎంత ఉందో స్పష్టంగా వెల్లడి కావాలనీ దాంతో పాటు వారి విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక పరిస్థితి గురించి స్పష్టమైన గణాంకాలు ఉండాలనీ వారు కోరుకున్నారు. ప్రభుత్వం 2018లో వెల్లడించిన తుది నివేదికలో కూడా కులాల సమాచారాన్ని పొందుపర్చలేదు. రిజర్వేషన్ల కోసం మరాఠాలు చేస్తున్న ఆందోళనలతో సతమతమవుతున్న మహారాష్ట్ర ప్రభుత్వం కేంద్రం తన వద్దనున్న కులాలవారీ గణాంకాలను ఇవ్వాలని కోరింది. కేంద్రం తిరస్కరించింది. దీంతో సుప్రీంకోర్టులో మహారాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలుచేసింది. తన దగ్గరున్న కులాల సమాచారం చాలా గందరగోళంగా ఉందనీ, దానికి ప్రామాణికత లేదనీ కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. మహారాష్ట్రలో కులాలు 4,28,677గా తేలాయనీ, ఇక దేశవ్యాప్తంగా అవి 45 లక్షల దాకా నమోదయ్యాయని పేర్కొంది. గందరగోళాన్ని సృష్టించే అటువంటి సమాచారాన్ని వెల్లడి చేయలేమని తేల్చిచెప్పింది.అప్పటికి మహారాష్ట్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీల జాబితాలో 494 కులాలు మాత్రమే ఉన్నాయి. ప్రతి రాష్ట్రంలోనూ ఈ తరహా జాబితాలు ఉన్నాయి. వాటిని ప్రాతిపదికగా తీసుకుని కులాల జనసంఖ్య లెక్కించినా కొంత ఫలితం ఉండేది. ఎవరికి వారు తమది ఫలానా కులమని చెబితే మారుమాట్లాడకుండా దాన్ని నమోదు చేయాలనే నిర్ణయం మొదటికే మోసం తెచ్చింది. ఈ పరిస్థితిని అధికార యంత్రాంగం ఎందుకు ఊహించలేకపోయిందన్నది ఇప్పటికీ జవాబులేని ప్రశ్నగానే మిగిలిపోయింది. రాష్ట్రాలవారీగా కులాలపై ఎన్నో అధ్యయనాలు అప్పటికే వెలువడిన నేపథ్యంలో ఇదెందుకు జరిగిందన్న విషయాన్ని కూడా ఎవరూ గట్టిగా లేవనెత్తలేదు. అప్పటి సర్వేని వేనోళ్ల పొగిడిన చాలామంది ఆ వైపరీత్యంపై మౌనం పాటించారు. కులాల లెక్కల విషయంలో ఆ గతం పునరావృతం కాకుండా ఏం చేయబోతున్నారన్న దానిపై ఇప్పటికైతే స్పష్టత లేదు. జనాభా సేకరణ చట్టాన్ని సవరించి కులాల లెక్కలను సాధికారికంగా తేల్చుతామని కేంద్రమంత్రుల నుంచి ప్రకటనలు మాత్రం వెలువడుతున్నాయి. ఆ లెక్కలు రాజకీయాల్లో పావులుగా మారకుండా చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. కేంద్ర మంత్రివర్గం తీసుకున్న కులగణన నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తన ఘనతగానే భావిస్తోంది. రాహుల్ గాంధీ చేసిన పోరాటంతోనే కేంద్రం దిగివచ్చిందనే ప్రచారాన్ని ముమ్మరం చేసింది. దాంతోనే ఆగలేదు. తెలంగాణలో తమ పార్టీ ప్రభుత్వం చేసిన కులసర్వే సర్వసమగ్రమైందనీ దాన్ని దేశవ్యాప్తంగా అనుసరిస్తే అద్భుత ఫలితాలు వస్తాయని చెబుతోంది. తెలంగాణ కులసర్వేలో వెల్లడైన విద్య, ఉద్యోగ, ఆర్థిక పరిస్థితులకు సంబంధించి కీలక సమాచారాన్ని బయటపెట్టకుండా అద్భుత ఫలితాల గురించి పదేపదే మాట్లాడటం అసంబద్ధంగా అనిపిస్తుంది. ఆ సమాచారం ఏమిటో తెలిస్తేనే దేశవ్యాప్తంగా అనుసరించతగ్గ నమూనాగా తెలంగాణ సర్వే పనికొస్తుందో లేదో చెప్పగలిగే అవకాశం ఉంటుంది.

## ఎట్టకేలకు స్వేచ్ఛా వాణిజ్యం



భారత్%బ్రిటన్‌ల మధ్య ప్రస్తుత వాణిజ్యాన్ని అనేక రెట్లు పెంచగలదని భావిస్తున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై రెండు దేశాలూ గురువారం ఒక అంగీకారానికి రావటం ద్వైపాక్షిక వాణిజ్యంలో కీలక మలుపు. త్వరలో న్యూఢిల్లీలో రెండు దేశాల ప్రధానులూ సమావేశమై లాంఛనంగా ఈ ఒప్పందాన్ని ఖరారు చేసుకుంటారు. వివిధ అంశాలపై ఇద్దరి దృక్పథాలూ వేర్వేరు కావటం, ఇద్దరూ పట్టువిడుపులు ప్రదర్శించకపోవటం తదితర కారణాల వల్ల ఒప్పందంపై మూడేళ్లుగా ఎడతెగని చర్చలు సాగాయి. వాస్తవానికి ఇరు దేశాల వాణిజ్యమూ 2004 నుంచి ఊపందుకుంది. ముఖ్యంగా ఔషధాలు, దుస్తులు, వాహనాల విడిభాగాలూ, సర్వీసు రంగాల్లో మన దేశం నుంచి బ్రిటన్‌కెళ్లే ఎగు మతుల పరిమాణం బాగా పెరిగింది. అదే సమయంలో బ్రిటన్‌నుంచి మన దిగుమతులు కూడా చెప్పుకోదగ్గ స్థాయికి విస్తరించాయి. నిరుటి గణాంకాల ప్రకారం బ్రిటన్ మన నుంచి 3,300 కోట్ల డాలర్ల మేర దిగుమతులు చేసుకుంటుండగా, బ్రిటన్‌కు మన ఎగుమతులు 2,300 కోట్ల డాలర్ల వరకూ వున్నాయి. ఈ వాణిజ్యాన్ని మరింత విస్తరించుకోవటానికీ, సరుకుల నాణ్యతను పెంచటా నికీ ఈ ఒప్పందం మార్గ నిర్దేశం చేయబోతోంది. ఒప్పందం అమల్లోకి రాగానే 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యం 12,000 కోట్ల డాలర్లకు చేరుతుందని ఇరు దేశాలూ అంచనా వేస్తున్నాయి. యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి బయటికొచ్చినప్పటి నుంచీ కష్టాలు పడు తున్న బ్రిటన్‌ను గోరుచుట్టుపై రోకటి పోటులా కరోనా మహమ్మారి కాటేసింది. దాంతో అంతంత మాత్రంగా వున్న ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. ఈయూ సభ్యదేశంగా ఆ ప్రాంత దేశాలకు ఎలాంటి అవరోధాలూ లేకుండా సాగిపోయిన ఎగుమతులు ఇప్పుడు ఎన్నో సమస్యల్ని ఎదుర్కొనాల్సి వస్తోంది. ఈయూ నుంచి వెలుపలకు రావటంవల్ల 2022 మధ్యకల్లా ఉత్పాదకత 5.5 శాతం మేర తగ్గింది. ఇక అప్పటి నుంచీ వాణిజ్యాన్ని మెరుగుపరుచుకోవటానికి గల అవకాశాల అన్వేషణ ఎక్కువైంది. ముఖ్యంగా చురుకైన ఆర్థిక వ్యవస్థలతో ఒప్పందాలు కుదిరితే పరిస్థితి మెరుగవుతుందని అక్కడి ప్రభుత్వం భావిస్తోంది. భారత్ ఇప్పటికే ప్రపంచంలో అయిదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. 2028 నాటికి మూడో స్థానానికి ఎగబాకవచ్చన్న అంచనాలున్నాయి. అయితే కుదరబోయే ఈ ఒప్పందంపై రెండు దేశాల్లోనూ సహజంగానే విమర్శలున్నాయి. బ్రిటన్ కార్మికవర్గ ప్రయోజనాలను ప్రభుత్వం భారత్‌కు తాకట్టు పెట్టిందని అక్కడి విపక్షాల ఆరో పణ. ముఖ్యంగా స్వల్పకాలిక వీసాలపై బ్రిటన్ వచ్చే భారతీయ కార్మికులకూ, వారి యాజమాన్యా లకూ జాతీయ బీమా సంస్థ ఎన్ఐసీకి చేసే చెల్లింపుల నుంచి మూడేళ్లపాటు మినహాయింపు ఇవ్వ టాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఈ రాయితీ వల్ల బ్రిటన్ ఖజానా ఏటా పది లక్షల పౌండ్ల ఆదాయం నష్ట పోతుందనీ, ఈ వెసులుబాటు వినియోగించుకోవటానికి కంపెనీలు భారతీయ కార్మికులకు అధికంగా అవకాశాలిస్తాయనీ, దాంతో ఇక్కడివారి ఉపాధి దెబ్బతింటుందనీ వారి వాదన. ఇది కేవలం తాత్కాలిక ఉద్యోగాలకే వర్తిస్తుందని, బయటివారికి శాశ్వత ఉద్యోగాలిచ్చే అవకాశం ఉండబోదని ప్రభుత్వ జవాబు. ఇప్పటికే అమెరికా, కెనడా, జపాన్‌లతో సహా 50 దేశాలకు ఇదే తరహా వెసులు బాట్లు ఇస్తుండగా భారత్‌తో కుదిరే ఒప్పందం వల్లే ఏదో జరిగిపోతుందని ఎలా అంటారని ప్రశ్నిస్తోంది. నిజానికి భారత్‌కు ఎన్ఐసీ వెసులుబాటు ఇవ్వకూడదని బ్రిటన్ భావించటం వల్లే ఒప్పందంపై ప్రతిష్టంభన ఏర్పడింది. మన దేశంలో సైతం ఈ మాదిరి ఒప్పందాలపై వ్యతిరేకత వుంది. ఎఫ్‌టీఏల వల్ల మన ఎగుమతులకన్నా అటునుంచి దిగుమతులు పెరుగుతాయనీ, అవి స్థానిక ఉత్పత్తులను దెబ్బతీస్తాయనీ విమర్శకుల వాదన. పర్యవసానంగా ఏర్పడే వాణిజ్యలోటు దేశ ప్రయోజనాలను దెబ్బతీస్తుందని వారి విమర్శ. అలాగే ఈ ఎఫ్‌టీఏల వల్ల ఔషధ పేటెంట్లు, డేటా వినియోగం వంటి అంశాల్లో దేశీయ పరిశ్రమలకు అన్యాయం జరుగుతుందన్న ఆరోపణ మొదటి నుంచీ వుంది. ముఖ్యంగా జెనెరిక్ ఔషధ పరిశ్రమ దెబ్బతిని సాధారణ జనం నష్టపోతారన్న విమర్శ. అక్కడి ఉత్పత్తులతో పోటీపడటం మనవాళ్లకు కష్టమవుతుందన్న వాదన సరేసరి. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల నష్టాలున్నట్టే లాభాలూ వుంటాయి. ఉదాహరణకు మన ఔళి ఉత్పత్తులు, దుస్తులపై బ్రిటన్‌లో ఇంతవరకూ 12 శాతం సుంకాలుండేవి. ఒప్పందం అమల్లోకొస్తే ఆ బెడద వుండదు. బ్రిటన్ మార్కెట్లలో మనతో పోటీపడే చైనాకు ఇది సమస్యాత్మకం. మన దుస్తులపై సుంకాలు పెంచుతామని అమెరికా బెదిరిస్తున్న వర్తమానంలో ఇది మనకు కలిసొచ్చే అంశం. బ్రిటన్‌కు దుస్తులు, తెరలు, దుప్పట్లు వగైరాల ఎగుమతులు కనీసం 4 శాతం వరకూ పెరుగుతాయని అంచనా. అదే సమయంలో బ్రిటన్ కార్లు, విస్కీ, వైద్య ఉపకరణాలు వగైరాలు చవగ్గా లభిస్తాయి. ఉదాహరణకు ఇప్పుడు రూ. 5,000 పలికే విస్కీ ధర రూ. 3,500కు పడిపోతుంది. రాగల పదేళ్లలో మరింత తగ్గుతుంది. ఇది ఇక్కడి మద్యం పరిశ్రమకు చేటు కలిగించేదే. కార్ల పరిశ్రమలకూ జరిగేది ఇదే. ప్రస్తుతం బ్రిటన్ తయారీ కార్లపై వంద శాతం సుంకాలు విధిస్తున్నారు. అవి కాస్తా పది శాతానికి పడిపోతాయి. గ్రామీణ, పట్టణప్రాంతాల్లోని చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు గిరాకీ పెరుగుతుందని వాణిజ్య నిపుణుల భావన. లక్షలమందికి ఉపాధి కల్పిస్తున్న ఈ రంగాలు ఎగుమతులు విస్తరిస్తే మరింతగా ఎదుగుతాయని వారంటున్నారు. ఐటీ రంగానికి కూడా ఇది వర్తిస్తుంది. ఏటా బ్రిటన్ ఐటీ సంస్థల్లో కనీసం 60,000 మంది నిపుణులకు అవకాశాలు లభిస్తా యని చెబుతున్నారు. అయితే లాభనష్టాలేమిటో ఒప్పందంపై సంతకాలయ్యాకే తెలుస్తుంది.

## ప్రజల ఐక్యతే దేశానికి రక్ష



పాకిస్థాన్ ప్రేరేపిత జీహాదీ ఉగ్ర మూకలు పహల్గాంలో 26 మంది అమాయక పర్యాటకులను కాల్చి చంపడంపై దేశమంతటా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. 370వ అధికరణం రద్దు తర్వాత ఇతర రాష్ట్రాల ప్రజలు కశ్మీర్ పర్యటనకు వస్తూ అక్కడి ప్రజలతో మమేకం కావడాన్ని జీర్ణించుకోలేని ఇస్లామిక్ మతఛాందస జీహాదీ శక్తులు పథకం ప్రకారం పర్యాటకులను కాల్చిచంపడం కశ్మీర్ అభివృద్ధిని అడ్డుకోవడమే. ఈ దుర్మార్గపు చర్యతో భారత్‌లో మళ్లీ హిందూముస్లిం మత విభజన తేవడం పాక్ సైనిక పాలకుల పన్నాగం. 77 ఏండ్ల కిందట భారత్, పాకిస్థాన్లుగా విడిపోయినా పాక్ పలుమార్లు మత విద్వేష విషం కక్కుతూ యుద్ధాలకు, దురాక్రమణలకు పూనుకున్న దృష్టాంతాలెన్నో. పాకిస్థాన్ ప్రేరేపిత జీహాదీ ఉగ్ర మూకలు పహల్గాంలో 26 మంది అమాయక పర్యాటకులను కాల్చి చంపడంపై దేశమంతటా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. 370వ అధికరణం రద్దు తర్వాత ఇతర రాష్ట్రాల ప్రజలు కశ్మీర్ పర్యటనకు వస్తూ అక్కడి ప్రజలతో మమేకం కావడాన్ని జీర్ణించుకోలేని ఇస్లామిక్ మతఛాందస జీహాదీ శక్తులు పథకం ప్రకారం పర్యాటకులను కాల్చిచంపడం కశ్మీర్ అభివృద్ధిని అడ్డుకోవడమే. ఈ దుర్మార్గపు చర్యతో భారత్‌లో మళ్లీ హిందూముస్లిం మత విభజన తేవడం పాక్ సైనిక పాలకుల పన్నాగం. 77 ఏండ్ల కిందట భారత్, పాకిస్థాన్లుగా విడిపోయినా పాక్ పలుమార్లు మత విద్వేష విషం కక్కుతూ యుద్ధాలకు, దురాక్రమణలకు పూనుకున్న దృష్టాంతాలెన్నో. భారత్‌ను గుడ్డిగా ద్వేషించే పాక్ సైన్యాధ్యక్షుడు జనరల్ ఆసిఫ్ మునీర్ పహల్గాం మారణకాండకు కారకుడని రూఢీగా తెలుస్తున్నది. పాక్‌లో పేరుకే ప్రజాస్వామ్యం. అయితే నిజమైన అధికారం చెలాయిస్తున్నది పాక్ ప్రధాన దండ నాయకులేనని తెలిసిందే. పాక్ ఏర్పడిన 77 ఏండ్లలో 3 దశలలో 33 ఏండ్ల పాటు వీరే ప్రభుత్వాలను కూలదోసి, పాలనా యంత్రాంగంపై పట్టు బిగించి నిరంకుశ రాజ్యం చెలాయించింది. మిగతా సంవత్సరాలలో పేరుకే పౌర ప్రభుత్వాలే కానీ, అంతిమ అధికారం సైన్యం గుప్పిట్లోనే ఉంది. ఎవరైనా ధిక్కరిస్తే వారి గతి అంతే. మునుపటి ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తన ప్రభుత్వ నిర్ణయాలే అంతిమం అని గట్టిగా నిలిస్తే 2022లో కుట్ర ద్వారా ఇమ్రాన్ ప్రభుత్వాన్ని కూల్చి, ప్రత్యర్థులైన నవాజ్ షరీఫ్ ముస్లిం లీగ్, పాక్ పీపుల్స్ పార్టీ నేత బిలావల్ భుట్టోలతో కొత్త కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పరచడంలో సైన్యాధ్యక్షుడు ఆసిఫ్ మునీర్ కీలక పాత్ర పోషించాడు. ఇమ్రాన్‌ఖాన్ బహుళ జనాదరణ కలిగిన నేత. కానీ ఆసిఫ్ మునీర్ పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ, సైనిక నిఘా విభాగం రెండింటికీ డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరిస్తూ తిరుగులేని శక్తిగా ఎదిగాడు. ఇమ్రాన్ ఖాన్ సతీమణి బుష్రా బీబీ అక్రమంగా డబ్బు, వజ్రాలు, స్వర్ణాభరణాలు సంపాదించిన చేదు నిజం ప్రధాని దృష్టికి తేవడంతో ఆగ్రహించిన ఇమ్రాన్‌ఖాన్ మునీర్‌ను పదవి నుంచి తొలగించడంతో ఇరువురి మధ్య ప్రత్యక్ష ఘర్షణ ఆరంభమైంది. ఖురాన్‌ను కంఠస్థం చేసిన మునీర్ దేశంలో మత రాజకీయాలను ఎగదోయడం ప్రారంభించారు. ఈ విషయంలో ఇస్లామిక్ సైన్యాధ్యక్షుడిగా ఉండిన జనరల్ జియావుల్ హక్ మునీర్‌కు స్ఫూర్తి. పాకిస్థాన్ ఇప్పటికే అనేక రంగాల్లో తీవ్ర ఆర్థిక దుస్థితిని ఎదుర్కొంటూ, దివాలా స్థితిలో ఉన్నది. ఈ దుస్థితి నుంచి పాక్ ప్రజల దృష్టిని మళ్లించడానికే జనరల్ మునీర్ పహల్గాంలో లష్కరే తోయిబా జీహాదీ తీవ్ర వాదులను అమాయక విహార యాత్రికులపై దాడికి ఉసిగొల్పి భీతావహ పరిస్థితి సృష్టించారని తెలుస్తున్నది. ద్విజాతి సిద్ధాంతాన్ని నెత్తికెత్తుకొని హిందువులు-ముస్లింలు ఎప్పటికీ ఏకీకరణం కాలేరనే దుర్మార్గ వాదన వినిపిస్తూ భారత్‌లో విద్వేషాలు రెచ్చగొట్టే పథకం వేశారు. మతాన్ని, రాజకీయాలను మత ఉగ్రవాదాన్ని జోడించి ఎన్నటికీ సయోధ్య కుదరని స్థితికి తెచ్చారు. మాజీ ప్రధాని ఇమ్రాన్ అరెస్టుపై పాక్ సైన్యంలో విభేదాలున్నా అసమ్మతిని మునీర్ కఠినంగా అణచివేశాడు. దేశ విభజన జరిగినప్పుడు మునీర్ తండ్రి టీచర్. సయ్యద్ సర్వర్ పాక్‌కు వచ్చి రావల్పిండిలో స్థిరపడ్డారు. అక్కడి మదర్సాలో మునీర్ చదివాడు. ఆ తర్వాత పాక్ మిలిటరీ అకాడమీలో శిక్షణ పొంది ఫ్రాంటియర్ ఫోర్స్ రెజిమెంట్‌లో అధికారి అయ్యాడు. కుట్ర ద్వారా ఇమ్రాన్ ఖాన్‌ను గద్దె దించాక, షాబాజ్, నవాజ్ షరీఫ్ సోదరులు పాక్ సైన్యాధ్యక్షుడిగా మునీర్‌ను ఆమోదిస్తూ సంతకం చేయక తప్పలేదు. జనరల్ మునీర్ ఈ ఏడాది నవంబర్‌లో పదవీ విరమణ చేయాల్సి ఉన్నా త్రివిధ దళాల అధిపతుల పదవీకాలాన్ని మూడు నుంచి ఐదేండ్లకు పెంచుతూ పార్లమెంటు తీర్మానించడంతో 2027 వరకు మునీర్ కొనసాగడం ఖరారైంది. ప్రస్తుతం పాకిస్థాన్‌లో అంతర్గత అసమ్మతి, ఉగ్రవాద శక్తులు చెలరేగిపోవడంతో, తీవ్ర ఆర్థిక దుస్థితి నెలకొన్నది. ప్రజలు కొనుగోలు శక్తి క్షీణించి దివాలా స్థితిలో ఉన్నా, పాక్ పాలకులు జీహాదీ మత భావనలు ప్రేరేపించి కశ్మీర్‌లో భారత్‌పై దాడులకు కుట్రలు కుతంత్రాలు పన్నుతూనే ఉన్నారు. పహల్గాంలో కొందరు జిహాదీ ఉగ్రవాదుల మారణకాండ తర్వాత భారత ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నది. పహల్గాం మారణకాండ జరిగినప్పుడు కశ్మీర్ పౌరులు అపూర్వంగా స్పందించి యాత్రికులకు ఆశ్రయం, రక్షణ కల్పించి ఆదుకోవడం ప్రశంసనీయం. మతోద్రిక్తతలు రెచ్చగొట్టే కుతంత్రాల ప్రభావానికి లొంగకుండా మానవీయ దృష్టిలో స్పందించి కులం, మతం, ప్రాంతం ఏవైనా తామంతా భారతీయులమని చాటారు. ఈ పరిస్థితుల్లో దేశరక్షణ, ప్రాదేశిక సమగ్రత, సమైక్యత, ప్రజల్లో దేశభక్తి భావనలు పెంపొందించాలి. ముఖ్యంగా ప్రజల్లో మత విద్వేష భావనలు రెచ్చగొట్టే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, సామరస్యాన్ని, ఐక్యతను పెంపొందించేందుకు ప్రభుత్వాలు సన్నద్ధం కావాలి. ప్రజల ఐక్యతే దేశ రక్షణకు శ్రీరామరక్ష.

## పాక్ పథకంతోనే 'పహల్గాం'

'పహల్గాంలో 26 మంది పర్యాటకులను మతం పేరిట హతమార్చింది మేమే'నని ప్రకటించిన లష్కరే తోయిబా విషపుత్రిక 'టీఆర్ఎఫ్'ను, వారి రాక్షసత్వాన్ని భారతీయులు ముక్తకంఠంతో ఖండించారు. ఉగ్రవాదులను పెంచి పోషించిన పాకిస్థాన్‌ను తిట్టి, శాపనార్థాలు పెట్టారు. ఉగ్రమూకలను పట్టి హతమార్చటానికి, పాక్‌ను కట్టడి చేయడానికి భారత ప్రభుత్వం ఏ చర్యలు చేపట్టినా మేం సహకరిస్తామని ప్రతిపక్ష పార్టీలన్నీ ప్రధాని మోదీకి మద్దతు ప్రకటించాయి. కొందరు ముస్లిం బాలబాలికలు కొన్నేండ్లుగా తాము దాచుకున్న కిడ్డీ బ్యాంకు ధనాన్ని, ఉగ్రవాదులను ఖతం చేసేటందుకు ప్రధాని మోదీకి పంపిస్తామని ముందుకురావటం అభినందనీయం. ఈ నేపథ్యంలో భారతీయ ముస్లింలు ముక్తకంఠంతో ఉగ్రదాడిని ఖండిస్తూ, పాక్‌ను నిరసిస్తూ, భారత ప్రభుత్వానికి మద్దతు ప్రకటించటం శుభ పరిణామం. పర్యాటకులను కాపాడేందుకు ఉగ్రమూకలకు ఎదురునిలిచి తన ప్రాణాలర్పించిన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా తండ్రి ముహమ్మద్ 'పర్యాటకుల కోసం ప్రాణాలర్పించిన నా కుమారుడు నాకు గర్వకారణం' అన్నారు. పై ఘటనలు సిసలైన భారతీయతకు, కశ్మీరియతకు ప్రతీకలు. అంతేకాదు, కశ్మీరీ ముస్లిం యువకులు గాయపడిన పర్యాటకులను భుజాలపై మోసుకెళ్లి వైద్యం చేయించారు. తమ తమ టాక్సీలలో హాస్పిటల్స్‌కు ఫ్రీగా తీసుకువెళ్లారు, విమానాశ్రయాలకు చేర్పించారు. భయాందోళనలో వణికిపోతున్న పర్యాటకులకు మసీదులలో ఆశ్రయమిచ్చి, సేవలందించిన కశ్మీరీ ముస్లిం మతాచార్యులు తమ తమ గృహాలతో ఆశ్రయమిచ్చి సేదదీర్చారు. పర్యాటకులను ఆత్మీయంగా సాగనంపిన కశ్మీరీ ముస్లిం కుటుంబీకులు, సమస్త భారతీయులకు ఆదర్శనీయులే! అందుకే, పర్యాటకులు, భారతీయులందరి తరఫున వారికి నా




కృతజ్ఞతాభివందనాలు. హేట్సాఫ్ కశ్మీర్ ముస్లిం సహోదరీ సహోదరులారా హేట్సాఫ్. పాకిస్థాన్ ఉగ్రవాదులను కశ్మీర్‌పైకి ఎగదోయడానికి ముఖ్య కారణమేమిటో తెలుసుకుందాం. కొందరు రాజకీయ నాయకులు రౌడీలు, గూండాలను పోషిస్తున్నట్టే, పాకిస్థాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తుందన్నది జగమెరిగిన సత్యం. పాక్‌తో పలు ముఠాలుగా పెరుగుతున్న ఉగ్ర బృందాలను వివిధ కంప్యూటర్లతో పోల్చితే, వాటన్నింటికీ సర్వర్ పాక్ 'ఐఎస్ఐ' అన్నదీ జగద్విదితమే. ఇటీవల పాక్ రక్షణ మంత్రి ఖవాజ్ ఆసిఫ్ 'స్కైన్యూస్'తో మాట్లాడుతూ%ొ% 'అమెరికా, పశ్చిమదేశాల కోసం ఉగ్రవాదులను పోషించే చెత్త పనిని నెత్తికెత్తుకున్నామ'ంటూ తమ తప్పును అంగీకరించారు. అలాగే పాక్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్, పాక్ ప్రవాసీ వ్యాపారవేత్తల సభలో మాట్లాడుతూ.. 'హిందువులు వేరు, ముస్లింలు వేరు' మనది ముస్లిం జాతి, హిందువులతో మనకు కుదరని పని. ఈ 'ద్విజాతి సిద్ధాంతం'తోనే అవతరించింది మన పాకిస్థాన్. ఈ ద్విజాతి సిద్ధాంతాన్ని మీ పిల్లలకూ ప్రబోధించండి! మీరు విస్మరించకండి' అంటూ పసి హృదయాలలో కూడా మత విద్వేష బీజాలను నాటమని ప్రబోధించాడు. అంతేకాదు, 'కశ్మీర్ సమస్యనూ మనమెప్పటికీ వదులుకోకూడదు. ఎందుకంటే కశ్మీర్ మన కంఠనాళం' అని కూడా వక్కాణించాడు. దాన్నంతగా ఎందుకు నొక్కి చెప్పాడంటే.. పాక్ ప్రజల్లో ఆగ్రహజ్వాలలు ప్రజ్వరిల్లినప్పుడల్లా, వాళ్ల దృష్టిని భారత్ వైపు మళ్లించాలి. అందుకు పాక్ పాలకులకున్న ఏకైక సాకు కశ్మీరే! ఎందుకంటే పాకిస్థాన్ ఒక విఫల ప్రజాస్వామ్య దేశం! పాక్ మత పెద్దలు, సైనికాధికారుల చేతి రిమోటే పాక్ ప్రధాని. భారతదేశంలో అత్యధిక సంపద కొందరు కార్పొరేట్ల వద్ద పోగుపడినట్టే పాకిస్థాన్‌లోని అత్యధిక సంపద కొందరు మత పెద్దలు, సైనికాధికారుల వద్ద పోగుపడింది. దాన్ని కాపాడుకోవడానికి, మరింత పెంచుకోవడానికి వాళ్లు చేస్తున్న స్వార్థ రాజకీయాల కారణంగా పాకిస్థాన్ నేడు రాజకీయ, ఆర్థిక సంక్షోభాలలో కొట్టుమిట్టాడుతున్నది.

# బీజేపీ కుట్రతో ఆర్.డి.టి సెట్ రద్దు.



అనంతపురం : : బీజేపీ ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరించడం వల్లనే ఆర్.డి.టి సెట్ రద్దయిందని కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ గౌడ ఆరోపించారు.ఆయన మాట్లాడుతూ విదేశీ సహాయ చట్టం రెన్యూవల్ ను నిరోధించి సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను అడ్డుకోవడం అప్రజాస్వామిక మన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులు, పండ్ల తోటల అభివృద్ధి,దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల విద్య వైద్య సేవలందిస్తూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు అందిస్తూ ఆర్డీటీ సంస్థ చేయుత అందించిందని గుర్తు చేశారు.ఆ చట్టాన్ని కొనసాగించకపోవడంతో వారి ఖాతాలు ఫ్రీజ్ అయ్యాయన్నారు.నిస్వార్థ సేవలకు బీజేపీ ప్రభుత్వా రాజకీయ అడ్డంకులు సృష్టించడం తగదన్నారు.

## శ్రీసిటీ-ఐఎఫ్ఎఫ్ పరిశ్రమ వితరణతో
# వడ్డిపాళెంలో కమ్యూనిటీ లైబ్రరీ ప్రారంభం



శ్రీసిటీ, : శ్రీసిటీలోని ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్నాన్సెస్ (ఐఎఫ్ఎఫ్) పరిశ్రమ యాజమాన్యం తమ సీఎస్ఆర్ చర్యల్లో భాగంగా రూరల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్మెంట్ (రీడ్) సంస్థ భాగస్వామ్యంతో వరదయ్యపాళెం మండలం వడ్డిపాళెం గ్రామంలో కమ్యూనిటీ లైబ్రరీ రిసోర్స్ సెంటర్ ను ఏర్పాటు చేసింది. ఐఎఫ్ఎఫ్ ఆపరేషన్స్ హెడ్ శరవణన్ అరుణాచలం, శ్రీసిటీ డైరెక్టర్ (సిఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి దీనిని లాంఛనంగా ప్రారంభించారు. పిల్లలకు చదవడం, రాయడం వంటి నైపుణ్యాలతో పాటు, యువతి యువకులకు చేతివృత్తులలో శిక్షణ, ఆరోగ్య అవగాహన కల్పించడం కమ్యూనిటీ లైబ్రరీ రిసోర్స్ సెంటర్ ముఖ్య ఉద్దేశ్యం. ఇందులో లైబ్రరీ, కంప్యూటర్ రూమ్, శిక్షణా హాల్ మరియు పిల్లలు, మహిళలకు ప్రత్యేక విభాగాలు ఉంటాయి. గ్రంథాలయంలో వివిధ పుస్తకాలతో పాటు స్పోకెన్ ఇంగ్లీష్, పోటీ పరీక్షలు, ఉన్నత విద్యకు అవసరమైన ఇ-కంటెంట్ కూడా అందుబాటులో ఉంటుంది. ఈ మేరకు రీడ్ ఇండియా బృంద సభ్యులు కమ్యూనిటీ లైబ్రరీ మరియు రిసోర్స్ సెంటర్ వలన ఒనగూరే ప్రయోజనాలను గ్రామస్థులకు వివరించారు. విద్య, కమ్యూనిటీ అభివృద్ధిని ప్రోత్సహించే ప్రయత్నంలో భాగంగా కమ్యూనిటీ లైబ్రరీ ఏర్పాటుకు తమ సంస్థ ముందుకు వచ్చినట్లు శరవణన్ అరుణాచలం పేర్కొన్నారు. దీనిని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐఎఫ్ఎఫ్ పరిశ్రమ యాజమాన్యం సిఎస్ఆర్ చొరవను నిరీషా సన్నారెడ్డి అభినందించారు. వడ్డిపాళెం మరియు పరిసర గ్రామస్థులు, ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, దీని నుండి మంచి ఫలితాలను పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐఎఫ్ఎఫ్ ఫ్యాక్టరీ మేనేజర్ శరవణన్ బాలసుబ్రమణ్యం, ఫ్రాగ్నాన్సె హెడ్ రాజశేఖర్ మణి, హెచ్ ఆర్ హెడ్ అరుణ్ కుమార్, అడ్మిన్ హెడ్ వెంకట భాస్కర్, సిఎస్ఆర్ హెడ్ కార్తీక్ పళని, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్, వడ్డిపాళెం మరియు పరిసర గ్రామస్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉచిత కంటి ఆపరేషన్లు మెగా వైద్య శిబిరం

ఆలూరు : ఆలూరు పట్టణంలో ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరం నిర్వహించబడును. 13వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల ల నుండి మ2గం టల వరకు జరుగును. క్యాంపు స్థలం శ్రీ శిరిడి సాయిబాబా దేవస్థానము, టీచర్స్ కాలని, ఆదోని రోడ్డు, ఆలూరు. ఉచిత కంటి ఆపరేషన్ కొరకు వచ్చువారు తమ యొక్క ఒరిజినల్ ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజు కలర్ ఫోటోలు-2, ఆరోగ్యశ్రీ కార్డు, సెల్ ఫోన్ నెంబర్ తమవెంట హాస్పిటల్ కు తెచ్చుకోవలెను. ఎంప్లాయిస్ ఈ హెచ్ ఎస్ హెల్త్ కార్డ్ ద్వారా కంటి ఆపరేషన్స్ ఉచితంగా చేయబడును పత్యేక పాధాన్యత ఇవ్వబడును. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించిరావలెను. మరియు క్యాంపు స్థలములో సామాజిక దూరాన్ని పాంటిచవలెను. పిల్లలు, పెద్దలు మరియు వృద్దులకు అందరికి కంటి సంబధిత సమస్యలు వైద్యనిపుణులుచే ఉచితంగా కంటి పరీక్షలు చేయబడును. శిబిరములో కంటి ఆపరేషన్ అర్హులైనవారిని అదే రోజు కర్నూలుకి తీసుకువెళ్ళి విశ్వభారతి కంటి ఆస్పత్రి నందు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయబడును. మరియు వారిని ఇంటి దగ్గరకు చేర్చబడును. ఉచిత బస్సు మరియు భోజన సౌకర్యం కల్పించబుడును. ఆపరేషన్లు కొరకు వెళ్ళినవారికి కర్నూలులో భోజనము, వసతి, ఇతర సౌకర్యములు ఉచితముగా కల్పించబడును. కంటి పరీక్షల శిబిరములకు వచ్చువారు స్నానము చేసి శుభ్రమైన బట్టలు ధరించి రావలెను. కంటి ఆపరేషన్ చేయించుకొని వచ్చినవారు ఖచ్చితముగా వైద్య నిపుణులు ఇచ్చిన తేదినాడు మరలవచ్చి కంటి పరీక్ష చేయుంచుకొనవలెను. వివరములకు సంప్రదించండి : కె. బందయ్య క్యాంపు ఇన్చార్జ్, కె. భాస్కర్ క్యాంపు ఇన్చార్జ్ ఫోన్ నెంబర్లు 832 805 3652/9381288458 4. 9448191738.

## ఆపరేషన్ సింధూర్ విజయవంతం
# త్రివిధ దళాలకు ప్రత్యేక అభినందనలు.
## పులి సత్యనారాయణరెడ్డి.



పీలేరు : జమ్మూ కాశ్మీర్లో ఉగ్ర మూక దాడులలో పర్యాటకులు మృతి చెందిన వారిని చూసి చెల్లించిపోయిన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆపరేషన్ సింధూర్ లో భాగంగా ఉగ్రవాదుల స్థావరాలపై ముప్పేట దాడి చేసివిజయవంతమైనందుకు త్రివిధ దళాలను భారత ప్రభుత్వంను ఒక భారతీయుడిగా అభినందనలు తెలియజేస్తూ గర్విస్తున్నానని ఉగ్రవాదులకు భారత్ పై దాడులు అంటేనే దడపుట్టేలాగట్టిగా జవాబిస్తున్న భారత త్రివిధ దళాలకు గట్స్ ఉన్న నాయకుడు నరేంద్ర మోడీ నిర్ణయాలు సాహసోపేతమైనవని ధైర్యసహసాలకు మారుపేరు ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వామని అందుకు భారతదేశానికి వినమ్రంగ నమస్కారం చేస్తున్నానని అన్నారు శ్రీ సత్యమ్మ తల్లి ఆలయ కమిటీ అధ్యక్షులు పులి సత్యనారాయణరెడ్డి.

# సీపెట్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోండి
## - డైరెక్టర్ హెడ్ డాక్టర్ సిహెచ్ శేఖర్




విజయవాడ : పదవ తరగతి పాస్ ఐన విద్యార్థినీవిద్యార్థులు సీపెట్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ హెడ్ డాక్టర్ సిహెచ్ శేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన విజయవాడ లో మాట్లాడుతూ ఉద్యోగ కల్పనే లక్ష్యంగా భారత ప్రభుత్వ విద్యా సంస్థ "సీపెట్ " పనిచేస్తుందని తెలిపారు. పదవ తరగతి పాస్ ఐన విద్యార్థినీవిద్యార్థులకు మూడు సంవత్సరాల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ , డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ , బి.యస్సీ విద్యార్థులకు రెండు సంవత్సరాలు వ్యవధి గల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెస్సింగ్ అండ్ టెస్టింగ్ అనే మూడు కోర్సులను కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఆయన తెలిపారు. భారత ప్రభుత్వం విజయవాడ లోని కళాశాల ప్రాంగణంలోనే విద్యార్థినీ విద్యార్థులకు విడివిడిగా హాస్టల్ వసతి కల్పిస్తుందన్నారు. నిబంధనలను అనుసరించి అర్హులైన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి "ఫీజు రీయింబర్స్మెంట్" సదుపాయాలు ఉన్నాయన్నారు. సిపెట్ అడ్మిషన్ టెస్ట్ ను జూన్ 8 వతేది ఆదివారం విజయవాడ మరియు అనంతపురములలో నిర్వహిస్తామని , ర్యాంక్ ఆధారంగా 150 సీట్లను భర్తీ చేస్తారని ఆయన తెలిపారు. ఈ కోర్సులను పూర్తిచేసిన వారికి ప్లాస్టిక్స్ రంగంలో గల బహుళ జాతి సంస్థ అనుబంధ సంస్థలలో జూనియర్ ఇంజనీర్ (ప్రొడక్షన్), మౌల్డ్ డిజైనర్ మేకర్, జూనియర్ ఇంజనీర్ (మైంటెనెన్స్), క్వాలిటీ కంట్రోల్ విభాగాలలో ఇన్స్ట్రక్టర్ వంటి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. సిపెట్ అడ్మిషన్ టెస్ట్ కోసం ఈనెల 29 వతేది లోగా ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. పూర్తి సమాచారం కోసం 9398535697 నెంబర్ ని సంప్రదించాలని ఆయన తెలిపారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి




ఆదోని : : స్థానిక ఆదోనిలో సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక లోకానికి ఐఎఫ్టియు పిలుపునిస్తున్నది. ఈ సందర్భంగా సిపిఐ ఎమ్ ఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి వెంకప్ప మాట్లాడుతూ బీజేపీ నాయకత్వంలోని 11 సంవత్సరాల ఎన్డీఏ ప్రభుత్వ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాల ఫలితంగా నిరుద్యోగం పెరుగుతుంది అన్నారు. కానీ ఉద్యోగాల గ్యారంటీ,నాణ్యత అమానుష స్థాయికి దిగజారింది.మరో పక్క కార్పొరేట్ కంపెనీల లాభాలు అనేక రెట్లు పెరిగాయి.దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగి పైనున్న 5 శాతం జనాభా వద్ద మొత్తం సంపదలో 70 శాతం ఉండగా,అట్టడుగున ఉన్న 50 శాతం ప్రజల వద్ద 3 శాతమే ఉన్నది.అసంఘటిత కార్మికుల వేతనాలు 2017-18తో పోల్చినపుడు 2023-24కు బాగా తగ్గాయి. ప్రపంచ ప్రజలంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతికిన కరోనా కాలంలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మికవర్గం బ్రిటీష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక అనుకూల చట్టాలను రద్దు చేసి కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లు అమల్లోకి తెచ్చింది. నేడు దీని అమలుకై రాష్ట్రాలకు ఆదేశాలిచ్చింది. ఇవి అమల్లోకి వస్తే ఈ కోడ్స్ వలన నిర్దేశిత కాల ఉద్యోగాల (ఫిక్స్డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్) ప్రవేశంతో ఉద్యోగ భద్రత ఉండదు. కార్మికులను తొలగించే అధికారం యజమానులకు వస్తుంది.లక్షలాది కోట్ల రూపాయల ఈపీఎఫ్, ఈపీఎస్, ఈఎస్ఐ నిల్వలు స్టాక్ మార్కెట్లో మరియు మెడికల్ ఇన్సూరెన్స్ కార్పోరేట్ల హస్తగతమవుతాయి. కార్మికులకు సామాజిక భద్రత నశిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే కార్మికులను కార్పొరేట్లకు కట్టుబానిసలుగా మార్చే విధానమే లేబర్కోడ్స్. వీటి అమలును దేశవ్యాప్తంగా కార్మికవర్గం వ్యతిరేకిస్తోంది. పేదలను దాతల దయా దాక్షిణ్యాలకు వదిలేసే రాష్ట్ర ఎన్.డి.ఏ ప్రభుత్వ విధానాన్ని రాష్ట్ర సదస్సు ఖండిస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వం కార్మికుల వేతనాలను పెంచటానికి, పని పరిస్థితులను మెరుగుపర్చటానికి సిద్ధంగా లేదు. రాష్ట్రంలో 2006-07 నుండి షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్లో ఉన్న 50 లక్షల మంది కార్మికులకు మూడు సార్లు జరగాల్సిన వేతన సవరణ జరగలేదు. కార్మిక చట్టాల అమలును పర్యవేక్షించే తనిఖీలు నిలిపేశారు. ఈ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక వైఖరిని సదస్సు తీవ్రంగా ఖండిస్తోంది. రాష్ట్రంలో కూడా లేబర్కోడ్స్ అమలుకు దూకుడుగా ప్రయత్నిస్తున్నారు. ఇది కార్మిక వ్యతిరేక చర్య. దీన్ని ప్రతిఘటిద్దాం. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, మాట్లాడే స్వేచ్ఛ, అసమ్మతి హక్కు, మత స్వేచ్ఛ తదితర ప్రాథమిక హక్కులపై మోడీ ప్రభుత్వం తీవ్రంగా దాడి చేస్తోంది.చివరకు కార్మికుల సమిష్టి కార్యాచరణ, భారతీయ న్యాయ సంహితను ఉపయోగించి కార్మికులను, నాయకులను జైళ్లకు పంపుతున్నారు. కార్మిక వర్గంపై జరుగుతున్న ఈ వినాశకర దాడులను రాష్ట్ర సదస్సు తీవ్రంగా ఖండిస్తోంది.రాష్ట్రంలో మే 20న రాష్ట్రంలోని లక్షలాది మంది సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొనాలని ఐఎఫ్టియు జయప్రదం చేయాలనీ కార్మికవర్గానికి విజ్ఞప్తి చేస్తున్నది. ఈ సమావేశంలో పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి మణి, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు అఖండ,రైతు కూలి సంఘం నాయకులు సౌరప్ప, ఐఎఫ్టియు నాయకులు నారాయణ,కుమార్, తదితర ఐ ఎఫ్ టివి నాయకులు పాల్గొని సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

# ప్రొఫెసర్ ఎన్ టి కే నాయక్ ను తక్షణమే విధుల నుండి తొలగించాలి.





కర్నూలు :: రాయలసీమ విద్యాలయంలో పనిచేస్తున్నటువంటి ప్రొఫెసర్ రెక్టారు ఎన్ టి కే నాయక్ ను తక్షణమే విధుల నుండి తొలగించాలని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి-కుల- ప్రజా-మహిళా సంఘాల ఐక్య వేదిక నాయకులు శేషఫణి, పట్నం రాజేశ్వరి, నక్కలమిట్ట శ్రీనివాసులు, ఖధీరుల్లా, సీమకృష్ణ, వెంపేంట రాంబాబు,భరత్ కుమార్ ఆచారి,నంది విజయలక్ష్మీ , పెరుగు శివకృష్ణ, కరుణాకర్, నాగభూషణం లు డిమాండ్ చేస్తూ వైస్ ఛాన్సలర్ డాక్టరు వెంకట బసవరావు మరియు రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడు లకు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ విశ్వవిద్యాలయం విద్యాలయ కేంద్రంగా కాకుండా అక్రమార్కులకు అవినీతిపరులకు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారడం బాధాకరం అని వారు తెలిపారు. రాయలసీమ ప్రాంతానికి తలమానికంగా నిలిచిన రాయలసీమ విశ్వవిద్యాలయం అభివృద్ధికి నోచుకోక పోవడం శోచనీయమని వారు అన్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ గా, ఇంఛార్జి వైస్ ఛాన్సలర్ గా పనిచేసి ప్రస్తుతం రెక్టారుగా పనిచేస్తున్న ఎన్ టి కే నాయక్ అవినీతి అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా, రోస్టర్ అమలు చేయకుండా ఇష్టం వచ్చినట్లు ఉద్యోగాల భర్తీ చేసుకుని తనకంటూ ఒక కోటరీ ఏర్పాటు చేసుకుని నియంతలా యూనివర్సిటీలో చలామణీ అవుతున్నాడని వారు తెలిపారు. ప్రశ్నించిన వారిపై దాడులు చేయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తు తనకు తిరుగు లేకుండా చేసుకున్నాడని వారు అన్నారు. ప్రొఫెసర్ ఎన్ టి కే నాయక్ పై సి బి సి ఐ డి వారు మరియు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ వారు విచారణ జరిపి అవినీతికి పాల్పడినది వాస్తవమని ఉన్నత విద్యా మండలి వారికి నివేదిక అందజేస్తూ చర్యలకు సిఫారసు చేశారు.ఉన్నత విద్యా మండలి వారు ఎన్ టి కే నాయక్ అవినీతిపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్ టి కేనాయక్ పై క్రిమినల్ చర్యలు చేపట్టాలని అడిషనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ పోలీసు వారికి ఎండార్స్మెంట్ పంపించడం జరిగింది అని వారు తెలిపారు.అయితే గత ప్రభుత్వ అండతో ఎన్ టి కే నాయక్ అన్నీ తొక్కి పెట్టించు కున్నాడు కానీ యూనివర్సిటీ పాలకమండలి ఎన్ టి కే నాయక్ కు రెండు ఇంక్రిమెంట్స్ కట్ చేసి అడ్మినిస్ట్రేషన్ పరంగా,ఆర్థికపరంగా ఏలాంటి అధికారి పదవులు లేకుండా ప్రొఫెసర్ గా (రెక్టారు) మాత్రమే అవకాశం ఇచ్చి శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తీర్మానం చేశారని వారు అన్నారు. ఎన్ టి కే నాయక్ అవినీతి అంతా ఇంతా కాదు కొన్ని కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడ్డారని, యూనివర్సిటీ భూములు సుమారు 150 ఎకరాలు కూడా గత ప్రభుత్వ రాజకీయ నాయకులకు అప్పనంగా కట్టబెట్టారని వారు తెలిపారు. ఎన్ టి కే నాయక్ చేసిన అవినీతి అక్రమాల పై చర్యలు చేపట్టాలని లేని పక్షంలో యూనివర్సిటీ ముందు ప్రజా కుల సంఘాలు పోరాటం చేయాల్సి వస్తుందని వారు తెలుపుతూ రాయలసీమ విశ్వవిద్యాలయం ఉద్యోగులతో కలిసి ఉపకులపతి కి, రిజిస్ట్రార్ కి వినతిపత్రాన్ని అందజేయడం జరిగింది.

## వీరమరణం పొందిన జవాన్
# మురళీనాయక్ కి గాఢ సంతాపం.

కర్నూలు : **రాయలసీమ న్యూస్ మే 09 :** దేశ భద్రత కోసం తన ప్రాణాలను అర్పించిన మురళీనాయక్ త్యాగాన్ని దేశం ఎన్నటికీ మరువదు అని ఈ విషాద సమయంలో ఆయన కుటుంబానికి భగవంతుడు శక్తిని, ధైర్యాన్ని ఇవ్వాలని రాయలసీమ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బత్తిన నవీన్,చంద్రశేషర్ రెడ్డి లు కోరుకుంటున్నామన్నారు. భారతదేశం తన శక్తిని ప్రపంచానికి చూపించింది. ప్రతి భారతీయుడు ఒక్కటై, " ఒక్కటైన యుద్ధంలో పోరాడే సైనికుల కోసం ప్రార్థన చేస్తున్నారని అన్నారు. మన సైన్యం ధైర్యంగా, తెలివిగా శత్రు స్థావరాలను ధ్వంసం చేసిందనీ అన్నారు.. భారత్ ఎప్పుడూ తలవంచదు, ఎప్పుడూ వెనుకడుగు వేయదనీ. శాంతి కోరుకుంటాం, కానీ అవసరమైతే దిమ్మ తిరిగే బలంతో సమాధానం చెబుతుందనీ అన్నారు.

## ఘనంగా ఆల్ ఇండియా క్షత్రియ
# మహాసభ మహరణ ప్రతాప్ జయంతి.




కాన్పూర్ : ఆల్ ఇండియా క్షత్రియ మహాసభ మహరణ ప్రతాప్ జయంతిని జరుపుకున్నారు ఆల్ ఇండియా నాయకత్వంలో క్షత్రియ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కున్వర్ మనోజ్ భడోరియా, వీర్ షిరోమణి మహాయోధ మహారానా ప్రతాప్ యొక్క జంట వార్షికోత్సవం ఆడంబరంతో జరుపుకున్నారు. మహారానా ప్రతాప్ జయంతిని జరుపుకునే రామదేవి ప్రాంతంలో రాష్ట్ర అధ్యక్షుడు కున్వర్ మనోజ్ భడోరియా మాట్లాడుతూ మహారానా ప్రతాప్ జయంతిని మేవార్ వీర్ రాజ్పుత్ మహారానా ప్రతాప్ సింగ్ పుట్టినరోజు జ్ఞాపకార్థం జరుపుకుంటారు. అతను ముఖ్యంగా రాజస్థాన్లో మరియు భారతదేశం అంతటా ఆరాధించబడ్డాడు, శౌర్యం, ధైర్యం మరియు దేశభక్తికి చిహ్నంగా. మొఘల్ సామ్రాజ్యం విస్తరించడానికి వ్యతిరేకంగా అతని బలమైన ప్రతిఘటన అతన్ని భారతీయ చరిత్రలో అమరత్వం కలిగించింది. హల్దిఘటి యుద్ధంలో అక్బర్ యొక్క విస్తారమైన సైన్యాన్ని ఎదుర్కొంటున్నప్పుడు అతను చూపించిన శౌర్యం ఇప్పటికీ దేశభక్తిని మరియు ఆత్మవిశ్వాసం ప్రేరేపిస్తుంది. ఈ జనన వార్షికోత్సవం ఆయన పుట్టిన వేడుక మాత్రమే కాదు, అతని ఆదర్శాలు,




వారసత్వం మరియు భారతదేశ సాంస్కృతిక వారసత్వంలో చేసిన అమూల్యమైన సహకారం. ఘతంపూర్ ప్రాంతంలోని చిల్డ్రన్స్ ఉడియాన్ గెస్ట్ హౌస్ వద్ద మన్వేంధన్ సింగ్ నిర్వహించిన కార్యక్రమంలో, రాష్ట్ర అధ్యక్షుడు కున్ మనోజ్ భడోరియాను స్వాగతించారు మరియు మెమెంటో సమర్పించారు. ఎమ్మెల్యే అభిజీత్ సింగ్ సాంగా శాసనసభ సరోజ్ కురిల్, వేదికను పంచుకుంటున్నారు, మహారానా ప్రతాప్ జీవితంపై తన ప్రసంగంలో వెలుగునిచ్చారు. వందలాది మంది అధికారులలో, రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ భడోరియా, ప్రస్తుతం భారతదేశాన్ని పాకిస్తాన్ మరియు భారత సైన్యం యొక్క శక్తిగా భావిస్తున్నప్పుడు, భారతదేశం యొక్క మిలియన్ల మంది తల్లి అధికారాలు ధైర్య కుమారులకు జన్మనిచ్చాయని చెప్పారు. ఈ రోజు మన మాతృభూమి వెనుక మా ఇళ్లలో సురక్షితంగా కూర్చున్న మనమందరమని అన్నారు.

## అంగరంగ వైభవంగా ఆస్పరి
# ఎంపీపీ కుమారుడు వివాహ వేడుకలు

హాజరైన పలువురు జిల్లా వైకాపా ముఖ్య నేతలు

నూతన వధూవరులను ఆశీర్వదించిన కర్నూల్ మేయర్ బి. వై రామయ్య మరియు

వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి



ఆస్పరి :ఆలూరు నియోజకవర్గం, ఆస్పరి మండలం, చిరుమాన్ దొడ్డి గ్రామంలో ఆస్పరి ఎంపిపి ఉమాదేవి/ రామాంజనేయులు కుమారుడు అనిరుద్ బాబు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన కర్నూల్ మేయర్ బి వై రామయ్య, వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్లు సురేందర్ రెడ్డి, నూతన దంపతులను ఆశీర్వదిస్తూ పిల్లాపాపలతో నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండాలని దంపతులను వారు ఆశీర్వదించారు, ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకులు హలిగేర కేశం వెంకటరెడ్డి, రామిరెడ్డి, శంకర బండ సర్పంచ్ పురుషోత్తం రెడ్డి, యాటకల్లు పెద్దిరెడ్డి, కైరుప్పల వీరభద్ర, బిల్లేకల్లు పెద్దయ్య, హనుమంత్ రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మన్న, ములుగుంద మనోహర్ రెడ్డి, మండల ఎంపిటిసిలు, సర్పంచులు, కార్యకర్తలు, తదితరులు భారీగా పాల్గొన్నారు.

# రాజ్యాధికారమే మాంతిమ లక్ష్యం



కర్నూలు : బీఎస్పీ పార్టీ రాజ్యాధికారమే మాంతిమ లక్ష్యంమని నాయకులు అన్నారు. కర్నూల్ నగరంలోని సికాం సెంటర్ డ్రైవర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథులుగా బహుజన్ సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ , జై రాజ్ బీఎస్పీ కర్నూలు జిల్లా అధ్యక్షులు , డి. ఎర్రన్న జిల్లా ప్రధాన కార్యదర్శి ,అకేపోగు వనములయ్య పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో రాజ్యాధికారమే మాంతిమ లక్ష్యం పనిచేస్తామని రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ , అన్నారు , కర్నూలు జిల్లా నియోజకవర్గం నాయకులు జిల్లా నాయకులు బహుజన రాజ్యాధికారం చైతన్యవంతం చేయాలని ప్రజల్లో చైతన్యవంతం చేయాలని మాట్లాడడం జరిగింది కర్నూలు సిటీ 52 వార్డు కార్పొరేషన్ ఎలక్షన్ లో 30 కార్పొరేషన్ కైవసం చేసుకుంటా రాష్ట్ర నాయకులు అన్నారు , ఈ కార్యక్రమములో సీనియర్ నాయకులు మౌలాలి అడ్వకేట్ బి ఎస్ పినంద్యాల జిల్లా ఇంచార్జ్, రాజ్ కుమార్ అంబేడ్కర్ , బీఎస్పీ కర్నూల్ సిటీ కన్వీనర్ , నాయకులు అరుణ్ కుమార్ బి ఎస్ పికర్నూలు జిల్లా ఇంచార్జ్ తిప్పనన్న ఆలూరు బి ఎస్ పిసీనియర్ నాయకులు,ఎద్దుల నాగేష్ బి ఎస్ పి కర్నూలు జిల్లా కార్యదర్శి తంగడ దాన సువర్ణమ్మ బి ఎస్ పి మహిళ నాయకురాలు, బి ఎస్ పి మైనారిటీ నాయకులు సలీం భాష, జయన్న బీసీ నాయకులు రామాంజనేయులు కర్నులు జిల్లా బిసి సమన్య కమిటీ నాయకులు , షేక్ సాధిక్ అలి సిటీ అధ్యక్షుడు రవి కుమార్ పాస్టర్ , కర్నూలు జిల్లా సిసిసి కన్వీనర్ జిల్లా కమిటీ నియోజకవర్గాల కమిటీల నాయకల్లు రాజేష్ పత్తికొండ నియోజకవర్గం ఇన్చార్జ్ ఫయాజ్ భాష ఆదోని నియోజకవర్గం ఇంచార్జ్ బహుజన్ సమాజ్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

## అమలాపురం గ్రామంలో
# బాలికలకిషోరి వికాసం కార్యక్రమం.



ఆత్మకూరు : నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మండలం అమలాపురం గ్రామంలోని అంగన్వాడి సెంటర్ నందు పొదుపు లక్ష్మి గ్రూపు మహిళలకు బాల్య వివాహాల గురించి మహిళలకు అవగాహన తెలియజేయుట. కిషోర్ వికాసంబాలికలకు 21 సంవత్సరం నిండిన తరువాత వివాహం చేయవలెను 21 సంవత్సరం నిండకుండా చేస్తే నేరం. బాలికలపై అత్యాచారం. చేయి చేసుకోవడం. దుష్ప్రచారాలు చేయుట.వారిపై అఘాయిత్యాలు చేసిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోబడును. బాల్య వివాహాలు చేస్తే వారిపై వేసే శిక్షల గురించి వారి తల్లిదండ్రులకు తెలియజేయడమైనది అందువలన తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించ వలయును. మరియు అమలాపురం బాలికలువెంకటాపురం జెడ్పిసి స్కూల్ లో 6 గ్రామాలలో టెన్త్ క్లాస్ లోచదివే పిల్లల కన్నా టాపర్ గా నిలిచిన ఇద్దరు అమ్మాయిలు. వారి పేర్లు:-1. గుంపెని లీలావతి.555 మార్కులు2. బాపన పల్లె శాంతి 545 మార్కులు.వారికి అమలాపురం గ్రామ%శీ% పంచాయతీ సెక్రెటరీ రాజు వారిని సన్మానించడం జరిగింది. వారిని ఇంకా ఉన్నత చదువులు చదివించాలని ఆకర్షణలకు లోను కాకుండా చెడు అలవాటులకు పడకుండా తల్లిదండ్రులకు ఊరికి మంచి పేరు తీసుకురావాలని వారిని సన్మానించారు .ఇంకా అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు కావలసిన గ్లాసులు ప్లేట్లు చాపలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ మహిళ కార్యదర్శి నాగమణి. టిడిపి నాయకులు రొడ్డగోకారి.నడిపి లింగన్న. అంగన్వాడీ టీచర్లు. 1.కోడి జ్యోతి 2.%ఎ%.కళావతి గ్రామ టిడిపి నాయకులు టిడిపి మహిళా కార్యకర్తలు తదితర టిడిపి నాయకులు ఈ కార్యక్రమానికి వచ్చి జయప్రదం చేయడం జరిగింది.

## నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి సార్

### జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లుకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వినతి



సత్యవేదు: మే 9, సత్యవేదు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లుకు విన్నవించారు. శుక్రవారం సాయంత్రం తిరుపతి లోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలెక్టర్ ను కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుడా నిధులతో పిచ్చాటూరు ఆరణియార్ వద్ద నిర్మిస్తున్న టూరిజం పనులు పూర్తి చేయడానికి అదనంగా రూ.40 లక్షలు నిధులు కేటాయించాలని కలెక్టర్ ను కోరారు. స్పందించిన కలెక్టర్ వెంటనే తుడా వైస్ చైర్మన్ మౌర్య రెడ్డి కి ఫోన్ చేసి నిధులు మంజూరుకు సహకరించాలని కోరారు. అలాగే సత్యవేదు మండలం లోని వా నెల్లూరు లో ఉన్న ఏం.ఐ.జీ భూములను తుడా నిధులతో అభివృద్ధి చేసి తక్కువ ధరకు పేదలకు పంపిణీ చేయాలని కలెక్టర్ ను ఎమ్మెల్యే కోరగా వెంటనే స్పందించి భూములను పరిశీలించి చర్యలు తీసుకోవాలని జేసీ శుభం కు కలెక్టర్ సూచించారు. నారాయణవనం మండలం లో ఎకో పార్క్ ఏర్పాటుకు నిధులు కేటాయించాలని కలెక్టర్ ను కోరారు. చివరగా సురుటుపల్లి తో పాటు నియోజకవర్గంలో అత్యవసరమైన చోట రోడ్లు నిర్మాణం చేపట్టాలని, ఇందుకు సంబంధించిన జాబితాను కలెక్టర్ కు అందించారు. తన వినతులను కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు.

## వైభవంగా శ్రీ సీతారామచంద్రమూర్తి, శ్రీ కాశీ విశ్వనాథ స్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ట .



కొత్తపల్లి నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలము శింగరాజుపల్లె గ్రామంలో స్వస్తిశ్రీ విశ్వావసు నామ సం.ర వైశాఖ శుద్ధ ద్వాదశీ తేది 09-05-2025 శుక్రవారము ఉదయం 09:45 ని.లకు హస్తానక్షత్రయుక్త మిథునలగ్న శుభపుష్కరాంశమందు శ్రీ సీతారామచంద్ర స్వామి, కామాక్షి సమేత శ్రీ కాశీ విశ్వనాథ స్వామి, పరివార దేవతల ,నాభి శిల విగ్రహా ప్రతిష్ట మహోత్సవం శాస్త్రానుసారాంగా వేదపండితుల మంత్రోత్సరణల మధ్య కనుల పండువగా నిర్వహించారు. ఈ ప్రతిష్ట మహోత్సవం తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు.. సృష్టించిన విగ్రహాలకు శాశ్వతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 06:00 గం.లకు ప్రభాత పూజ, గణపతి పూజ, విగ్రహాలకు, యంత్రాలకు అభిషేకం, కర్పూర హారతి, ఉదయం 09:40 ని.లకు హస్తానక్షయుక్త మిధున లగ్నము నందు యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, కక్షజ్వాల కూష్మాండ బలిప్రధానం, ప్రధాన దేవతా హెూమం, పూర్ణాహుతి, ఆశీర్వచనం, మహా మంగళహారతి, అన్న శాంతి నిర్వహించి, సాయంత్రం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఉత్సవ విగ్రహాలకు భక్త జనుల సమక్షంలో భాజ భజే నడుమ కన్నుల పండుగగా కళ్యాణ మహోత్సవము జరిపారు. రాత్రి 07:00 గంటలకు శ్రీ కామాక్షి సమేత శ్రీ కాశీ విశ్వనాథ స్వామి వారి కళ్యాణ మహోత్సవము వై భవంగా నిర్వహించారు. ఈ కళ్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తదనంతరం అన్నశాంతి పూజ జరిపి, చివరగా వేద బ్రాహ్మణులచే వేద ఆశీర్వచనం చేశారు. విగ్రహ ప్రతిష్ట సందర్భంగా గ్రామంలో వేలాదిమంది భక్తులు తరలిరావడంతో గ్రామంలో సందడి



వాతావరణం ఎలా ఉంది. వచ్చిన భక్తులకు మధ్యాహ్నం 01:00 గంట నుండి అన్నదాన కార్యక్రము నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకొని దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, బైరెడ్డి మల్లికార్జున్ రెడ్డి లు సందర్శించి నూతనంగా ప్రతిష్టించిన విగ్రహాలకు విశేష పూజలు భావించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కమిటీ పెద్దలు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## నూతన కట్టెల మిషన్ యంత్రాన్ని ప్రారంభించిన జిల్లా అధికార ప్రతినిధి బెంగళూరు కిషోర్



ఆలూరు : ఆలూరు పట్టణంలో బళ్లారి రోడ్డు లో నూతనంగా కట్టెల మిషన్ ప్రారంభోత్సవానికి హాజరైన బెంగళూరు కిషోర్.ఖాళీ సాబ్ అనేక సంవత్సరాలుగా మట్టి ఇండ్లకు, కిటికీ సామాను, తలుపులు, దూలాలు, రైతుల వ్యవసాయ సామాగ్రి, ఎడ్లబండ్లకు కర్ర సామాను అందించే వారన్నారు. నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాలకు ఎంతో ఉపయోగకరమైన కర్రసామానులు అందించేవారని కొనియాడారు. హత్తిబెలగల్ గ్రామస్తులైనటువంటి కాళీ సాబ్ మనవడు అక్బర్ బాషా కొత్త కట్టెల మిషన్ ఓపెనింగ్ చేసిన కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బెంగళూరు కిషోర్.

## బాల్య వివాహాల నిర్మూలనతో - కిషోరీ వికాసం

### పిచ్చాటూరు ఐసిడిఎస్ సూపర్వైజర్లు కల్పలత, సుమతి




కే వి బి పురం : కిషోర్ వికాసం బాల్యవివాహం నిర్మూలన తోనే సాధ్యమని పిచ్చాటూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్లు కల్పలత, సుమతి లు తెలిపారు. కిషోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వం తలపెట్టి అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో శుక్రవారం కే వి బి పురం మండలంలోని ఎంఎ రాజుల కండ్రిగ అంగన్వాడీ కేంద్రంలో బాల్య వివాహం పై ప్రత్యేక కార్యక్రమాన్ని ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్లు ఏర్పాటు చేశారు. బాల్య వివాహం చేసుకోవడం వల్ల ఎలాంటి అనర్థాలకు గురి అవుతారో సమావేశంలో వివరించారు. బాల్య వివాహం చేసుకున్న, ప్రోత్సహించిన చట్టరీత్య నేరమని సమావేశంలో సూపర్వైజర్లు కల్పలత సుమతి లు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది కిషోరి బాలికలు గ్రామస్తులు స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

## సత్యవేడు ఎస్సినియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

### జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లుకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వినతి



కెవిబిపురం : సత్యవేడు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లుకు విన్నవించారు. శుక్రవారం సాయంత్రం తిరుపతి లోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలెక్టర్ ను కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంమాట్లాడుతూ తుడా నిధులతో పిచ్చాటూరు ఆరణియార్ వద్ద నిర్మిస్తున్న టూరిజం పనులు పూర్తి చేయడానికి అదనంగా రూ.40 లక్షలునిధులుకేటాయించాలని కలెక్టర్ ను కోరారు.స్పందించిన కలెక్టర్ వెంటనే తుడా వైస్ చైర్మన్ మౌర్య రెడ్డి కి ఫోన్ చేసి నిధులు మంజూరుకు సహకరించాలని కోరారు. అలాగే సత్యవేడు మండలం లోని వా నెల్లూరు లో ఉన్న ఏం.ఐ.జీ భూములను తుడా నిధులతో అభివృద్ధి చేసి తక్కువ ధరకు పేదలకు పంపిణీ చేయాలని కలెక్టర్ ను ఎమ్మెల్యే కోరగా వెంటనే స్పందించి భూములను పరిశీలించి చర్యలు తీసుకోవాలని జేసీ శుభం కు కలెక్టర్ సూచించారు.నారాయణవనం మండలం లో ఎకో పార్క్ ఏర్పాటుకు నిధులు కేటాయించాలని కలెక్టర్ ను కోరారు.చివరగా సురుటుపల్లి తో పాటు నియోజకవర్గంలో అత్యవసరమైన చోట రోడ్లు నిర్మాణం చేపట్టాలని, ఇందుకు సంబంధించిన జాబితాను కలెక్టర్ కు అందించారు. తన వినతులను కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు.

# చెరుకు రైతుల బకాయిలు చెల్లించాలి..!!

**సెజ్ పరిధిలో సాధాబైనామా ద్వారా కొనుగోలు చేసిన భూములను రెగ్యులర్ చేయండి- సీపీఎం!!**

**సత్యవేడు నియోజకవర్గంలోని భూ సమస్యలను పరిష్కరించండి మంత్రి లోకేష్ కు సిపిఎం బృందం వినతి పత్రం!!**



కెవిబిపురం : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు చెల్లించాల్సిన 36 కోట్ల రూపాయలు మయూర షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు చెల్లించాల్సిన బకాయిలు 30 కోట్లు గత ఆరు సంవత్సరాలుగా చెల్లించకపోగా ఫ్యాక్టరీలను మూసేసి రైతులను అప్పులపాలు చేస్తున్నారని మంత్రి నారా లోకేష్ కు దాసరి జనార్దన్ తెలియజేశారు శ్రీ సిటీ పారిశ్రామిక వాడలో చేస్తున్న భూ సేకరణ గ్రామాలలో సాదా బైనమాల ద్వారా కొనుగోలు చేసిన రైతులకు రెగ్యులర్ చేసి ఆ తర్వాత భూసేకరణ చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్, సత్యవేడు ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్ లు మంత్రి నారా లోకేష్ కు వినతిపత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశ్రామిక వాడ పరిధిలో అగ్రిమెంట్ ల ద్వారా కొనుగోలు చేసిన రైతులు ఆన్లైన్లో తమ పేర్లు లేకపోవడం వలన భూ పరిహారం పొందలేని పరిస్థితి ఏర్పడిందని, భూమి విక్రయించిన భూస్వాములు పేరుతో భూ పరిహారం రావడం వలన రైతులు ఆందోళనలో ఉన్నారని వారు తెలిపారు. తక్షణం ప్రభుత్వం సాదా బైనమాలను రెగ్యులర్ చేసి కొనుగోలు చేసి సాగులో ఉన్న రైతులకు వన్ బి,ఆర్ ఓ ఆర్ రికార్డులలో నమోదు చేసి ఆ తర్వాత భూసేకరణ చేయాలని విజ్ఞప్తి చేశారు. భూసేకరణలో రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం మెరుగైన పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ భూములపై ఆధారపడి పని చేస్తున్న వ్యవసాయ కూలీలకు కూడా పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఇరుగుళం, కొల్లడం, పెద్ద ఈటిపాకం చిన్న ఈటిపాకం, రాచపాలెం గ్రామాల పరిధిలో ల్యాండ్ సీలింగ్ యాక్ట్ ద్వారా గతంలో పేదలకు పంచిన భూములను మళ్లీ భూస్వాముల పేరుతో నమోదు చేయడం వలన పేదలకు పరిహారం పొందలేని పరిస్థితి ఏర్పడిందని తక్షణమే ల్యాండ్ సీలింగ్ యాక్ట్ ద్వారా పేదలకు చెందాల్సిన భూములను తిరిగి పేదలకు పంపిణీ చేసి భూ పరిహారం పేదలకు చెందే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సత్యవేడు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న భూ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రంలో విజ్ఞప్తి చేశారు. సత్యవేడు మండలం పేరడం గ్రామంలో సాగులో ఉన్న దళితులు కు పట్టాలు, మూడు సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని ఉన్న యానాదులకు ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. కే వి బి పురం మండలం కొత్తూరు దళితులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని, పిచ్చాటూరు మండలం ఓబుల రాజు కండ్రిగ లోని దళితులకు భూమి బాట ఆక్రమించిన గోవర్ధనగిరి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు పై చట్టపరమైన చర్యలు తీసుకొని భూ ఆక్రమణ తొలగించాలని విజ్ఞప్తి చేశారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో దళితులకు సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని, పద్మావతి పురం దళితులు సాగులో ఉన్న కాటూరు రెవిన్యూ లోని భూముల కూడా పట్టాలి ఇవ్వాలని కోరారు. భూ సమస్యలపై గత జనవరిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మెజారిటీ అర్జీలు సాదా బైనామాలు రెగ్యులర్ చేయాలని రైతులు ఇవ్వగా నేటికీ పరిష్కారం కాలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారని జనార్దన్ రమేష్ లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ తక్షణమే సమస్యలన్నింటినీ పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని వారు

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ఐరా లక్ష్యం..!!

**ఐరా రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంపిక..!!**

**ప్రతి జర్నలిస్టు స్వేచ్ఛగా వార్తలు రాయడం హక్కు..!!**


**ఐరా జాతీయ ప్రధాన కార్యదర్శి యలనాటి జాషువా..**



నంద్యాల : రాష్ట్రంలో ఫోర్త్ ఎస్టేట్ గా భావించే ప్రతి జర్నలిస్టు సభ్యుల సమస్యలను పరిష్కరించడమే ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ (ఐరా) లక్ష్యమని నూతనంగా ఎంపికైన ఐరా రాష్ట్ర అధ్యక్షులు సీనియర్ జర్నలిస్టు జయప్రకాష్ నారాయణ(జేపీ) అన్నారు.గురువారం నంద్యాల ఐరా కార్యాలయంలో ఐరా జాతీయ ప్రధాన కార్యదర్శి జహంగీర్ ఆదేశాల మేరకు జాతీయ కార్యదర్శి యలనాటి జాషువా ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు.. ఇండియన్ రిపోర్టర్ అసోసియేషన్ మొదటి సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రనికి ప్రతినిధులుగా ఎన్నికైన పి.జయప్రకాష్ నారాయణ,యం.శరత్ బాబు,విజయ్ బాబులతో సమావేశమై కమిటీ కార్యచరణ విషయంపై మాట్లాడుతూ ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ జాతీయ కమిటీ తమకు రాష్ట్ర బాధ్యతలు అప్పగించడంతో జాతీయ అధ్యక్షులు మరియు జాతీయ ప్రధాన కార్యదర్శి మహ్మద్ జహంగీర్ కు మరియు జాతీయ కమిటీ సభ్యులకు మరియు ఆంధ్రప్రదేశ్ ఇంచార్జి జాతీయ కార్యదర్శి యలనాటి జాషువా బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండియన్ రిపోర్టర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల సంక్షేమానికి నిష్పక్షపాతంగా కృషి చేస్తామని జర్నలిస్టుల న్యాయమైన కోరికలను హక్కులను సాధించేవరకు పోరాడుతామని రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక నిధిని ఏర్పాటు దశగా పోరాటం చేస్తామని, వర్కింగ్ జర్నలిస్టుల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు అలాగే పాత్రికేయ పిల్లలకు ఉచిత విద్య,వైద్యం, ఉచిత ప్రమాద బీమా సౌకర్యాలను కల్పించాలని అలాగే వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్ సౌకర్యాన్ని సకాలంలో అందించే విధంగా కృషి చేస్తామని, 50 సంవత్సరాలు దాటిన పాత్రికేయులకు పెన్షన్ సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించే విధంగా పోరాడుతామని, ప్రతి జిల్లాలో మండలాల్లో ప్రెస్ క్లబ్ ఏర్పాటు దశగా తమ వంతు కృషి చేస్తామని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఐరా అధ్యక్షులు పి.జయప్రకాష్ నారాయణ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.శరత్ బాబు,రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ బాబు తెలుపుతూ సమావేశంలో తీర్మానం చేస్తూ ప్రతి జిల్లాలో ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ కమిటీలు వేసి జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని వారు తెలిపారు.. నంద్యాల జిల్లాకు అధ్యక్షులుగా సిఎం శ్రీనివాసులు (లెజెండ్ శ్రీను),మరియు ప్రధాన కార్యదర్శిగా పి.వి.రంగా రావును ఎన్నుకున్నందుకు ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ జాతీయ కమిటీకి మరియు జాతీయ అధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శి మహ్మద్ జహంగీర్ కు ప్రత్యేక

## ఆంధ్రప్రదేశ్‌లోని 115 చెంచు గిరిజన కుటుంబాలకు

# సాధికారత కల్పించిన హ్యుందాయ్ మోటార్స్ ఇండియా లిమిటెడ్.




ఆత్మకూర్ : నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణం డైమండ్ ఫంక్షన్ హాల్ నందు హ్యుందాయ్ ఐ యోనిక్ ఫారెస్ట్' ఆగ్రో ఫారెస్ట్రీ కార్యక్రమంను నిర్వహించారు.20 గ్రామాలలో భూసార పరిరక్షణకు వనములను పెంపకాన్ని ప్రోత్సహించడానికి మరియుఅణగారిన కుటుంబాలకు సాధికారత కల్పించడానికి ప్రాజెక్ట్ యొక్క 2వ దశ ను ప్రారంభించింది ్నమొదటి దశలో జీవనాధారం నుండి స్థిరమైన వ్యవసాయానికి మార్చడం ద్వారా నంద్యాల జిల్లాలోని 115 చెంచు కుటుంబాలజీవితాలను మార్చింది్న రెండవ దశలో భాగంగా రాబోయే మూడుసంవత్సరాలలో 20 గ్రామాల్లో 350 ఎకరాలలో పచ్చదనాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది్న కంచె, మొక్కలు, ఎరువు మరియు ఆధునికవ్యవసాయ పద్ధతులలో శిక్షణతో రైతులు మద్దతు పొందుతారు. నాయకత్వ శిక్షణద్వారా కమ్యూనిటీ ఆధారిత సంస్థలు (సీబీఓలు) ఏర్పాటు చేయబడతాయి మరియు బలోపేతంచేయబడతాయి సమగ్ర సమాజఅభివృద్ధి కోసం ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన పెంచడానికి కార్యక్రమాలుచేపట్టబడ్డాయి. నంద్యాల ఎ మే 09,2025: హ్యుందాయ్మోటార్స్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) యొక్క సీఎస్ఆర్ విభాగం అయిన హ్యుందాయ్ మోటర్ఇండియా ఫౌండేషన్(హెచ్ఎంఐఎఫ్), తమహ్యుందాయ్ యోనిక్ ఐయోనిక్ ఫారెస్ట్ కార్యక్రమం ద్వారా నంద్యాలజిల్లాలోని 115 చెంచు గిరిజన కుటుంబాలను జీవనాధార వ్యవసాయం నుండి స్థిరమైన ఆగ్రో ఫారెస్ట్రీకి మార్చడం ద్వారా సాధికారత కల్పించింది. అక్టోబర్ 2022లో ప్రారంభించబడిన ఈ కార్యక్రమం , పర్యావరణ అనుకూల రీతిలో భూసార పరిరక్షణకు వనములను పెంపకాన్ని ప్రోత్సహించడానికి, భూమి మరియు నీటి నిర్వహణ , సామర్థ్య నిర్మాణప్రయత్నాలను మిళితం చేయటం ద్వారా నంద్యాల జిల్లాలోనిచెంచులక్ష్మీ గూడెం, నరపురెడ్డి కుంట, బైర్లూటీ మరియు నాగలూటీ గ్రామాలలో విస్తరించి ఉన్న చెంచు కుటుంబాల జీవనోపాధినిమెరుగుపరిచింది.మొదటి దశలో , బోర్ బావులు , బిందు సేద్యంవ్యవస్థలు వంటి ఖచ్చితమైన నీటిపారుదల మౌలిక సదుపాయాలతో ఉద్యానవనతోటల ద్వారా దీర్ఘకాలిక ఆదాయ ఉత్పత్తి కోసం మొత్తం 250 ఎకరాల భూమిని అభివృద్ధి చేశారు. ఇది నీటి సామర్థ్యం, భూసార మెరుగుదల , పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను మెరుగుపరిచింది, అటవీ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించింది మరియు పర్యావరణ స్థిరత్వాన్నిప్రోత్సహించింది. అంతర పంటలతో సహా వైవిధ్యభరితమైన వ్యవసాయ అటవీ పద్ధతులు కుటుంబాలఆదాయాన్ని పెంచాయి, గత రెండుసంవత్సరాలలో నాలుగు గ్రామాలలో రూ. 24.56 లక్షలు సంపాదించాయి. అదనంగా, ఈ ప్రాజెక్ట్ఉద్యానవన శాఖ, ఇంటిగ్రేటెడ్ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ %ళి%ఐటిడిఏ%ఠి% మరియు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం %ళివీ+చీ-=జు+ూఠి% వంటి పథకాలతో సహావివిధ రాష్ట్ర ప్రభుత్వ విభాగాల నుండి రూ. 75.53 లక్షలను ఉపయోగించుకుంది, ఈ సమాజాలలో ఆహార భద్రత మరియు స్వావలంబనను మరింతబలోపేతం చేసింది.నంద్యాలమరియు కర్నూలు జిల్లాల్లోని 20 గ్రామాలలోనిగిరిజన , వెనుకబడినకుటుంబాలకు పర్యావరణం , స్థిరమైనజీవనోపాధిని విస్తరించడానికి దాని వ్యవసాయ అటవీ కార్యక్రమం యొక్క రెండవ దశ -హ్యుందాయ్ ఐయోనిక్ ఫారెస్ట్ ఈరోజు ప్రారంభించబడింది. ఈ కార్యక్రమంలో, ఆత్మకూర్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్%ౖ% సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ శ్రీమతి డి. నాగజ్యోతి, ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఐటిడిఏ) అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ ఎ. సురేష్ కుమార్ మరియు అధికారులు ప్రాజెక్ట్ నేమ్ బోర్డును ఆవిష్కరించి, లబ్ధిదారులకు మొక్కలను అందజేశారు. బిఏఐఎఫ్ %చీ+ూ% వైస్ప్రెసిడెంట్ మరియు రీజినల్ డైరెక్టర్ సౌత్,హార్టికల్చర్ (ఐటిడిఏ) అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ పి.సి. ధనంజయ్కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ రెండవ దశలో, హెచ్ఎంఐఎఫ్ లబ్ధిదారులకు భూమి చదును చేయడం, గుంతలు తవ్వడం, మొక్కల సరఫరా, కంచె వేయడం, ఎక్స్‌పోజర్సందర్శనలు , అంతర పంటలు మరియు పంట నిర్వహణ వంటి స్థిరమైన వ్యవసాయ పద్ధతుల్లో శిక్షణఇవ్వడంలో మద్దతు ఇస్తుంది. అదనంగా, రైతులు సేంద్రీయ ఎరువు, యాంత్రికంగా దుక్కు దున్నడం మరియు దున్నడానికి మద్దతు పొందుతారు.మొత్తం రూ. 5.3 కోట్ల నిధులతో, ఈ ప్రాజెక్ట్ 290 మంది రైతుల యాజమాన్యంలోని 600 ఎకరాల భూమినిసమిష్టిగా సాగు చేయడానికి సహాయపడుతుంది, వారికి స్వావలంబన కల్పిస్తుంది. 'హ్యుందాయ్ఐయోనిక్ ఫారెస్ట్' ప్రాజెక్ట్ యొక్క రెండవ దశ ప్రారంభంగురించి హ్యుందాయ్ మోటర్ ఇండియా ఫౌండేషన్ ట్రస్టీ శ్రీ గోపాలకృష్ణన్ సి ఎస్మాట్లాడుతూ, "హ్యుందాయ్ ఐయోనిక్ ఫారెస్ట్పర్యావరణ పరిరక్షణ , సమాజ సాధికారత పట్ల మా నిబద్ధతకు నిదర్శనం. భూసార పరిరక్షణ కార్యకలాపాలను జీవనోపాధి మద్దతుతో అనుసంధానించడం ద్వారా, గిరిజన , అణగారిన కుటుంబాలు స్వావలంబన సాధించడానికి మేము మద్దతు ఇవ్వడం లక్ష్యంగాపెట్టుకున్నాము. ఈ తరహా కార్యక్రమాల ద్వారా, మేము పర్యావరణ అనుకూల పురోగతి , అర్థవంతమైన మార్పును కొనసాగిస్తున్నాము, హ్యుందాయ్యొక్క 'మానవత్వానికి పురోగతి' అనే ప్రపంచ లక్ష్యంను బలోపేతం చేస్తున్నాము " అని అన్నారు 2011లో, హెచ్ఎంఐఎఫ్ తమిళనాడులో %-%ఈ తరహా ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది, ఇక్కడతమిళనాడులోని 5 జిల్లాల్లో 2 లక్షలకుపైగా 18 జాతులమొక్కలను నాటడం ద్వారా 500 ఎకరాలబంజరు భూమిని పునరుద్ధరించారు. ఈ కార్యక్రమం 346 మంది రైతుల జీవనోపాధిని మెరుగుపరిచిందిమరియు ఇప్పటివరకు 17833 టన్నుల కార్బన్‌నుసేకరించింది. అదనంగా, హ్యుందాయ్ మోటర్ఇండియా ఫౌండేషన్ అనేక హరిత కార్యక్రమాలకు నాయకత్వం వహించిందిబీ తమిళనాడులోని ఇరుంగట్టుకొట్టై సిప్కాట్‌లో 12.5 ఎకరాల బంజరు భూమిని పునరుద్ధరించడం మరియు 15 గిరిజన కుటుంబాలకు జీవనోపాధి కల్పించడం, గురుగ్రామ్‌లో సుమారు 20 ఎకరాల పార్కుపునరుద్ధరణ, రైతులకు

### ఎమ్మెల్యే వీరుపాక్షి గల్లిలో కాదు

## అసెంబ్లీలో చూపించు నీ ప్రతాపం.

### ఆలూరు టీడీపీ ఇంచార్జ్ వీరభద్ర గౌడ



ఆలూరు : ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను విమర్శించే స్థాయి నీది కాదు అంటూ ఆలూరు టిడిపి ఇంచార్జీ వీరభద్ర గౌడ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మెన్ గుమ్మనూరు నారాయణ, వైసీపీ ఎమ్మెల్యే వీరుపాక్షి పై మండిపడ్డారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయం లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆరోపిస్తున్నట్లు దనపురం - హొలగుంద రోడ్డు టీడీపీ ప్రభుత్వంలో మంజూరు చేస్తే గత వైసీపీ ప్రభుత్వంలో టెండర్ రద్దు అయ్యిందన్నారు. మీ ప్రభుత్వంలో రోడ్డు దుస్థితి మీకు కనిపించలేదా అని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వంలో డోన్ నియోజకవర్గం అభివృద్ధి చెందితే ఆలూరు నియోజవర్గం ను ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. త్వరలో రూ.14 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. నియోజవర్గం లో 9 నెలల వ్యవధి లో రూ. 18 కోట్ల తో రోడ్లు వేశామని,రూ. 2కోట్ల 23 లక్షలు రోడ్లకు ప్యాచ్ వేశామన్నారు. సూపర్ సిక్స్ పథకాల ను అమలు చేస్తున్నామన్నారు. వేసిపి ప్రభుత్వం లో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత జగన్ కే దక్కిందన్నారు. ఎమ్మెల్యే ఇంకా జడ్పీటిసి తరహాలోనే మాట్లాడుతున్నారు. ధైర్యం ఉంటే ప్రజా సమస్యలుపై అసెంబ్లీలో మాట్లాడాలన్నారు. మీడియాలో పబ్లిసిటీ కోసం కూటమి ప్రభుత్వం పై ఏ మండలంలోలైన విమర్శలు చేస్తే అ మండలంలో పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేస్తామన్నారు. ఇక నుంచి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. సమావేశంలో ఆలూరు బ్రాంచ్ కెనాల్ అధ్యక్షులు కిష్టప్ప, మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ముత్తవకుంట్ల నుంచే మా ప్రయాణాలు,

# విజయాలు.. పరిటాల సునీత

శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో సునీత, శ్రీరామ్

సొంత ఖర్చులతో విగ్రహాలు ఏర్పాటుకు సహకరించిన పరిటాల కుటుంబం

గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్న ఎమ్మెల్యే సునీత

పరిటాల రవి దగ్గర నుంచి శ్రీరామ్ వరకు ఈ గ్రామమంటే మాకెంతో ప్రేమ





రాప్తాడుమే : రాజకీయంగా మేము ఏ కార్యక్రమం తలపెట్టినా, విజయాలు చూసినా అది ముత్తవకుంట్ల నుంచే ప్రారంభమవుతుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామంలో శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ సమేత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఒ?క పండుగ వాతావరణంలో జరిగింది. సునీత, శ్రీరామ్ కు గ్రామస్థులు, ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం విగ్రహప్రతిష్టాపన కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామంలో శ్రీ సీతారాముల ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. ఇందులో 60లక్షల రూపాయలు దేవాదాయశాఖ నిధులు, మరో 15లక్షలు దాతలు అందించారు. శ్రీ సీతా,రామ,లక్ష్మణ, ఆంజనేయ సమేత విగ్రహాలతో పాటు జయ, విజయుల విగ్రహాల ఏర్పాటుకు పరిటాల కుటుంబం సహకారం అందించింది. విగ్రహ ప్రతిష్టాపన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ తమకు మొదటి నుంచి ముత్తవకుంట్ల గ్రామం అంటే ఒక ప్రత్యేకమైన అభిమానం అన్నారు. పరిటాల రవి హయాం నుంచి గ్రామంలో ఏ కార్యక్రమం తలపెట్టినా.. మేము ఈ గ్రామం నుంచే ప్రారంభిస్తామన్నారు. అది రవి దగ్గర నుంచి శ్రీరామ్ వరకు కొనసాగుతోందన్నారు. మాకు ఇది సెంటిమెంట్ గా మారిందన్నారు. ఈ గ్రామం నుంచి ఎన్నో విజయాలు చూశామన్నారు. ఇప్పటికే గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్టు చెప్పారు. కొత్తగా విద్యుత్ సబ్ స్టేషన్ కూడా మంజూరు చేయించామని.. భూమి పూజ కూడా చేసినట్టు వివరించారు. ఇంకా పెండింగ్ లో ఉన్న సీసీ రోడ్లను కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. మా స్వగ్రామం అంత ఇష్టమైన ఈ గ్రామంలో జరిగిన ఆలయ నిర్మాణంలో మేము భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని పరిటాల సునీత, శ్రీరామ్ అన్నారు...

## అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదు

కార్పొరేషన్ అధికారులతో మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం



నెల్లూరు : గత ఐదేళ్లలో నెల్లూరు నగరంలో కుంటుపడిన అభివృద్ధిని గాడిలో పెట్టేందుకు.. అహర్నిశలు పనిచేస్తానని.. ఎక్కడ రాజీ పడే ప్రసక్తే లేదని మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్ తో పాటు.. కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్చార్జిలు కోఆర్డినేటర్లు, అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరాభివృద్ధిపై సుదీర్ఘ చర్చ జరిపారు. కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టబోయే పనులు గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ కాలనీలో శాశ్వత ఇంటి పట్టాలకు క్యాబినెట్ ఆమోదం తెలపడంలో కృషి చేసిన మంత్రి పొంగూరు నారాయణకు టిడిపి నేతలు, భగత్ సింగ్ కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ డ్రైనేజీలలో సిల్ట్ ను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. నెల్లూరు సిటీలో 5000 మందికి శాశ్వత పట్టాలు ఇప్పిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఇంటింటికి కులాయి కనెక్షన్ కూడా ఇస్తామన్నారు. ఆ దిశగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. 22 ఎకరాలలో మార్కెట్ ఏర్పాటు బాధ్యత కార్పొరేషన్ కి అప్పగిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. స్కిల్ డెవలప్మెంట్ జాబ్ మేళా కార్యక్రమాన్ని ఈ నెల 18వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాబ్ మేళాలో పది ఐటీ కంపెనీలు పాల్గొనబోతున్నాయని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సిటీ నియోజకవర్గంలోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని.. టిడిపి హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. ఓటేసి నా ప్రజల కోసం నిరంతరం పనిచేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మంత్రి అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, నగర అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు , క్లస్టర్ ఇన్చార్జిలు కోఆర్డినేటర్లు హాజరయ్యారు.

## అనంతపురం ప్రభుత్వాసుపత్రిని

# 1200పడకలకు పెంచండి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి

ఛాయాపురం పర్యటనలో సీఎంని కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి

సూపర్ స్పెషాలిటీ, క్యాన్సర్ ఆసుపత్రులకు బెడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి

సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



అనంతపురం అర్బన్ : 560పడకల సామర్థ్యంతో ఉన్న అనంతపురం సర్వజనాసుపత్రిని 12వందల పడకలకు పెంచాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను పరిశీలిచేందుకు ముఖ్యమంత్రి జిల్లాకు రాగా ఛాయాపురం హెలిప్యాడ్ వద్ద సహచర ఎమ్మెల్యేలతో కలిసి దగ్గుపాటి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా సర్వజనాసుపత్రిలో గత కొన్ని రోజులుగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం సర్వజనాసుపత్రి కేవలం 560పడకల సామర్థ్యం మాత్రమే ఉందన్నారు. అయితే ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వచ్చే రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోందన్నారు. ఇప్పటికే 2వేల నుంచి 2200మంది ఔట్ పేషెంట్లు, 11వందల పేషెంట్లు వస్తున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న బడ్జెట్ లో మందులు, సర్జికల్ పరికరాలు, ఆక్సిజన్ ఇతర వాటికే సరిపడటం లేదన్నారు. దీనికి తోడు 200పడకల సామర్థ్యం ఉన్న సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి, క్యాన్సర్ ఆసుపత్రుల నిర్వహణ భారం కూడా సర్వజనాసుపత్రిపై కూడా పడిందన్నారు. ఇటీవల ఆర్డీటీ ఆసుపత్రుల సేవలకు కూడా అంతరాయం ఏర్పడిందన్నారు. దీని వలన ప్రభుత్వాసుపత్రిపై అదనపు భారం పడుతోందన్నారు. రోగుల సంఖ్య భారీగా పెరిగిందన్నారు. అందుకే జిల్లా ఆసుపత్రిని 1200పడకలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా బడ్జెట్ కూడా మాత్రమే పెంచాలని ముఖ్యమంత్రిని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని.. త్వరలోనే జిల్లా ప్రభుత్వాసుపత్రిని 1200పడకలకు విస్తరిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# వీర జవాన్ మురళీ కుటుంబానికి అండగా ఉంటాం...

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

జవాన్ తల్లిదండ్రులకు పరామర్శ

కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న మురళీ బంధువులు

భావోద్వేగానికి గురైన కంటతడిపెట్టి మంత్రి సవిత

సొంతంగా రూ.5 లక్షల అందజేత

గోరంట్లలో మురళీ నాయక్ విగ్రహం ఏర్పాటు

పాకిస్తాన్ తో జరుగుతున్న ధర్మయుద్ధంలో

మనదే గెలుపు : మంత్రి సవిత

వీర జవాన్ తల్లిదండ్రులను ఫోన్ లో

పరామర్శించిన సీఎం చంద్రబాబు



పెనుకొండ్ : ఆపరేషన్ సింధూర్ లో భాగంగా పాకిస్తాన్ తో జరుగుతున్న యుద్ధంలో గోరంట్ల మండలం కల్లితాండ గ్రామానికి చెందిన వీర జవాన్ మురళీ నాయక్ వీర మరణం పొందడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. గోరంట్ల మండల కేంద్రంలో మురళీ నాయక్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. పాకిస్తాన్ తో జరుగుతున్న యుద్ధంలో గోరంట్ల మండలం కల్లి తాండ గ్రామానికి చెందిన వీర జవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందారు. విషయం తెలుసుకున్న వెంటనే కల్లితాండ గ్రామానికి వెళ్లి మురళీ నాయక్ తల్లిదండ్రులను మంత్రి శుక్రవారం పరామర్శించారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న మురళీ నాయక్ తల్లిదండ్రులు శ్రీరాములు నాయక్, జ్యోతిభాయిని చూసి మంత్రి భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. తేరుకున్నాక మురళీ నాయక్ తల్లిదండ్రులను ఓదార్చారు. ప్రభుత్వంతో పాటు దేశమంతా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. తమ ఏకైక బిడ్డ యుద్ధంలో వీర మరణం చెందడంతో మురళీ నాయక్ తల్లిదండ్రులు శ్రీరాములు నాయక్, జ్యోతిభాయి కడుపు కోత వర్ణాతీతమన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీ నాయక్ ను సూర్య చంద్రులు ఉన్నంత వరకూ గుర్తించుకుంటామన్నారు. మురళీ ప్రాణ త్యాగం వృథా కానివ్వబోమని, శత్రువును చిత్తుగా ఓడించి తీరుతామని తెలిపారు. పాకిస్తాన్ జరుగుతున్న ధర్మయుద్ధంలో కేంద్ర ప్రభుత్వానికి, సైనికులకు రాజకీయాలకతీతంటా అండగా ఉండాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

### మురళీ నాయక్ విగ్రహం ఏర్పాటు

ధర్మం కోసం జరుగుతున్న పోరాటంలో మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. వీర జవాన్ తల్లిదండ్రులు విషాదంలో ఉన్నా తమ బిడ్డ దేశం కోసం ప్రాణాలు అర్పించడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. బాధిత కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తాను కూడా సొంతంగా రూ.5 లక్షలు చెక్కు ను అందజేసినట్లు మంత్రి సవిత తెలిపారు. మురళీ నాయక్ ధైర్య సాహసాలు భవిష్యత్తు తరాలకు తెలియాలనే లక్ష్యంతో గోరంట్ల మండలం ప్రధాన సర్కిల్ లో ఆయన విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు.

### ఫోన్లో సీఎం చంద్రబాబు పరామర్శ

మురళీ నాయక్ తల్లిదండ్రులను సీఎం చంద్రబాబునాయుడు ఫోన్ లో పరామర్శించినట్లు మంత్రి సవిత తెలిపారు. మురళీ ధైర్య సాహసాలను చూసి దేశం గర్విస్తోందని, అన్ని విధాలా అండగా ఉంటామని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చినట్లు వెల్లడించారు. మురళీ నాయక్ మృతదేహం శనివారం బెంగుళూరు నుంచి స్వగ్రామానికి వస్తుందని, ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామని మంత్రి సవిత తెలిపారు. అంతకుముందు మురళీనాయక్ చిత్ర పటానికి మంత్రి సవిత నివాళులర్పించారు

## పాకిస్థాన్ తో జరిగిన యుద్ధంలో అమరుడైన

# తెలుగు జవాన్ మురళీనాయక్ కు జోహార్లు.

పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు

కార్యాలయంలో వీర మరణం పొందిన

జవాను కు ఘన నివాళులు

పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర

రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె

రఘునాథ్ రెడ్డి



పుట్టపర్తి : పాకిస్తాన్ తో జరుగుతున్న యుద్ధంలో సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజవర్గం గోరంట్ల మండలం గడ్డంతండా పంచాయతీ కల్లితండా కు చెందిన 2022 లో అగ్నివీర్ జవాన్ గా చేరిన మురళీ నాయక్ ఈరోజు దేశ రక్షంలో వీర మరణం పొందడం తీవ్ర వేదనను కలిగించినట్లు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వీర మరణం పొందిన జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ రక్షణ కోసం ప్రాణాలు విడిచిన మురళీ నాయక్ వీర మరణం తెలుగు ప్రజలకే కాక యావత్ దేశ ప్రజలందరికీ స్ఫూర్తి దాయకం అన్నారు. భారత్ ,పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈరోజు తెల్లవారుజామున జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో పాకిస్తాన్ తో జరిగిన యుద్ధంలో మన వీర జవాన్ ఏపి రాష్ట్రానికి చెందిన సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన మురళీ నాయక్ ప్రదర్శించిన ధైర్యసాహసాలకు భారతీయులందరి తరపున ,పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల తరపున ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి తల్లితండ్రులకు ఎమ్మెల్యే సెల్యూట్ చేశారు. వీర సైనికుడు మురళి నాయక్ మృతి చెందడం అత్యంత బాధాకరమని అన్నారు ఆయన లేని లోటు దేశానికి వారి కుటుంబానికి తీర్చలేనిది అన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతి చెందిన వీర సైనికుడు మురళీ నాయక్ తల్లిదండ్రులకు యావత్ భారత ప్రజలంతా అండగా నిలవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఆ కుటుంబానికి ఏపి ప్రభుత్వం అండగా ఉండి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీర జవాన్ మురళి నాయక్ కుటుంబ సభ్యులతో కూడా ఫోన్ ద్వారా మాట్లాడి ప్రగాఢ సానుభూతిని తెలియజేసినట్లు తెలిపారు. మురళీ నాయక్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుడ్ని ప్రార్థిస్తున్నాను ,మురళీ నాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మురళీ నాయక్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది.భారతీయులు ప్రతి ఒక్కరు ఆ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ కన్వీనర్లు రామాంజనేయులు, గోపాల్ రెడ్డి ,జయచంద్ర ,మల్లి రెడ్డి విజయకుమార్ ,రామారావు ,గంగాధర్ నాయుడు,ఎల్ఐసి నర్సింలు ,శ్రీనివాస్ నాయక్ ,వల్లపు సోమశేఖర్, గంగాధర్ , సురేష్ చౌదరి, కృష్ణ ప్రసాద్, శ్రీరామ్ రెడ్డి ,పుల్లప్ప కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కరువును అధిగమించే

# నమ్మకాన్ని కలిగించింది చంద్రబాబు


జిల్లాపై రాష్ట్ర ముఖ్యమంత్రికి

అపరిమితమైన ప్రేమ

రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు

మరియు శాసనసభ వ్యవహారాల శాఖ

మంత్రివర్యులు పయ్యావుల కేశవ్



అనంతపురం, : కరువును అధిగమించే నమ్మకాన్ని కలిగించింది చంద్రబాబునాయుడుని రాష్ట్ర ఆర్థిక %ఁ% ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం ఛాయాపురంలో గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు పర్యటించారు. ఛాయాపురం గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ విప్ మరియు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, జల వనరుల శాఖ సెక్రెటరీ సాయిప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, బంగారు కుటుంబాల లబ్ధిదారులు, మార్గదర్శకులు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ గత 20, 30 సంవత్సరాల నుంచి మీలో ఒకడిగా మీవాడిగా మీ అన్నగా మీ తమ్ముడిగా మీ కొడుకుగా భావిస్తూ నన్ను ఆశీర్వదించినటువంటి మీ అందరికీ కూడా హృదయపూర్వక నమస్కారాలు తెలియజేసుకుంటున్నానన్నారు. మండుటెండలో 70 ఏళ్ల వయసులో 25 ఏళ్ల యువకుడిగా హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలోకి దిగి వెడల్పు పనులను పరిశీలించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలియజేశారు. ఒక పక్క వార్తలు చూస్తూ ఉన్నాం.. భారత్ - పాకిస్తాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయని, ఘర్షణలు మొదలై ఒకటి, రెండు రోజులు అయిందని, యుద్ధంలో అత్యద్భుతంగా నడిపిస్తున్నటువంటి భారత ప్రధాని నరేంద్ర మోడీ గారికి సెల్యూట్ చేద్దామని, బోలో భారత్ మాతాకీ జై.. బోలో భారత్ మాతాకీ బోలో జై.. అని ప్రజలతో కలిసి నినాదించారు. యుద్ధంలో సత్తా చాటుతున్నటువంటి సైనిక బలగాలకు ధన్యవాదాలు తెలిపారు. భారత ప్రధాని రెండు రోజులు వార్తలు చూస్తే ఒక విషయం ప్రధానంగా కనపడతా ఉందని, టెక్నాలజీలో ఇజ్రాయిల్ ప్రపంచంలో అమెరికా కన్నా ముందున్నదని, కానీ 30 సంవత్సరాల క్రితమే చంద్రబాబు నాయుడు ఈ విషయాన్ని గుర్తించి ఇజ్రాయిల్ డ్రిప్ టెక్నాలజీని రాష్ట్రంలో ప్రవేశపెట్టారన్నారు. రాయలసీమ తలరాతలు మారాలంటే, రైతు జీవితాల్లో వెలుగు నింపాలంటే నీళ్లు కావాలి, నీళు ఉపయోగాన్ని మెరుగుపరచాలి అది ఒక డ్రిప్ ద్వారానే సాధ్యమని చెప్పి ఆరోజు కమిటీలో మమ్మల్ని కూడా పంపించి మొట్టమొదటిసారి భారతదేశంలో, ఆంధ్రప్రదేశ్ లో ఇజ్రాయిల్ డ్రిప్ టెక్నాలజీని పరిచయం చేసింది ఆయనేనని, 30 సంవత్సరాల ముందు చూపు కలిగినటువంటి వ్యక్తి చంద్రబాబే అన్నారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లలో ఒక్క ఎకరాకు కూడా డ్రిప్ ఇవ్వలేదని, గతంలో 800 కోట్ల రూపాయలతో మెగా డ్రిప్ ఇరిగేషన్ మంజూరు చేసిన పనులు చేపట్టలేదని, నిర్లక్ష్యం చేశారన్నారు. ప్రస్తుతం భారతదేశంలో డ్రిప్పు వినియోగంలో అనంతపురం జిల్లా రెండవ స్థానంలో ఉన్నామన్నారు. ఇందుకు జిల్లా కలెక్టర్ ని, అధికారులను అభినందిస్తున్నామన్నారు. అనంతపురం జిల్లాపై రాష్ట్ర ముఖ్యమంత్రికి అపరిమితమైన ప్రేమ ఉందని, గొల్లపల్లి రిజర్వాయర్ ని నిర్మించి, కియా పరిశ్రమని తీసుకువచ్చారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తన పుట్టినరోజు సందర్భంగా గొల్లపల్లి రిజర్వాయర్ కు శంకుస్థాపన చేశారని, మళ్లీ సంవత్సరంలో పుట్టినరోజునాడు హెచ్ఎన్ఎస్ఎస్ పనులకు జీవో ఇచ్చారని గుర్తు చేశారు. 2014- 19లో హెచ్ఎన్ఎస్ఎస్ పనులకు పనులను 35 శాతం పూర్తి చేయడం జరిగిందని, ఎన్నికలకు ముందు ఉరవకొండలో జగన్మోహన్ రెడ్డి జలదీక్ష పెట్టి ఎన్నికల్లో గెలిస్తే హెచ్ఎన్ఎస్ఎస్ కాలవ పనులను మూడు నెలల్లో పూర్తి చేస్తానని చెప్పి ఐదేళ్లయిన గంపమన్ను కూడా తీయలేదని, పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన పది నెలల్లోనే తిరిగి హెచ్ఎన్ఎస్ఎస్ వెడల్పు పనులను చేపట్టిందన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలవ రాక ముందు ఉన్న భూమి విలువ 5 లక్షలు ఉంటే ప్రస్తుతం 25 లక్షల ధర పలుకుతుందన్నారు. కౌలు కూడా 60,000 ఇస్తున్నారని, ఇది జిల్లా రైతుల తలరాతను మార్చిందన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ పనులు, హెచ్ఎల్సి లైనింగ్, బిటిపి కాలువ, కియా పరిశ్రమ ఏర్పాటు చంద్రబాబు వల్లనే సాధ్యమైందన్నారు. అలా అన్నం పెట్టే వాడే దేవుడిగా చంద్రబాబు నిలిచారన్నారు. కరువును అధిగమించే నమ్మకాన్ని కలిగించింది చంద్రబాబు ఇచ్చిన నీటి వల్లనే సాధ్యమైందని పేర్కొన్నారు. పోలవరం - బనకచర్ల ద్వారా నీటిని తీసుకువచ్చి హెచ్ఎన్ఎస్ఎస్ కు నీటిని ఇవ్వనున్నామన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, కూటమి సర్కారు డబుల్ ఇంజన్ సర్కారుగా ముందుకెళ్తోందన్నారు.గతంలో స్వర్గీయ ఎన్టీఆర్ హెచ్ఎన్ఎస్ఎస్, లిఫ్ట్ ఇరిగేషన్ ను ఆలోచనను చేయగా దానిని ఆచరణలో తీసుకొచ్చింది చంద్రబాబు అన్నారు. ఆ తర్వాత వైయస్సార్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి ముందుకు తీసుకెళ్లారన్నారు. అనంతరం ఆరు పంపులను ఏర్పాటు చేసింది, దానిని 12 పంపులకు పని చేసేలా చేసేది తమ ప్రభుత్వమే అన్నారు.గతంలో నిలిచిపోయిన 33, 34, 36 ప్యాకేజీలను హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ పనులు పూర్తయ్యాక వాటిని కూడా పూర్తి చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. 40,000 ఎకరాలకు ఉపయోగపడే ఆగిపోయిన మెగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టును తిరిగి ప్రారంభించాలని కోరారు. ఉరవకొండకు టెక్స్టైల్ పార్క్ ను మంజూరు చేయాలని కోరారు. ఆగిపోయిన ఆమిద్యాల, కొట్టాలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను చేపట్టాలని, రామసాగరం బ్రిడ్జిని మంజూరు చేయాలని కోరారు. రైతుల జీవితాల్లో వెలుగులు నింపేలా పనిచేస్తున్న, చాయపురం గ్రామానికి విచ్చేసి, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులను పరిశీలించి, ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## నేడు ధర్మవరంలో మంత్రి సత్య కుమార్ యాదవ్ పర్యటన.




ధర్మవరం రూరల్ : శనివారం ధర్మవరంలో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వస్తున్నట్లు బీజేపీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6-30గంటల నుంచి 8గంటల వరకు నిర్వహించే మడుగు తేరులో పాల్గొంటారు. 10గంటలకు నుంచి 2గంటల వరకు ఎన్డీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. 3గంటలకు దుర్గమ్మ సర్కిల్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించి సాయంత్రం 5గంటలకు రతోత్సవంలో పాల్గొంటారు. ఆదివారం ఉదయం 10-30గంటలకు బత్తలపల్లిలో త్రాగునీటి సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. 11-30గంటలకు మల్లేనిపల్లిలోని మున్సిపల్ వాటర్ పంప్ హౌస్ ను సందర్శించారు. 12-30గంటలకు కేశవనగర్ లో అయ్యప్పస్వామి ఆలయాన్ని సందర్శిస్తారు. 1గంటకు ఇందిరమ్మకాలనీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపన చేస్తారు. 3-45 గంటలకు పోతుకుంటలో ఆర్వో ప్లాంట్ ప్రారంబించి అలాగే కొత్తగా నిర్మించనున్న పార్కు కోసం ఏర్పాటుచేసిన భూమి పూజ చేయనున్నారు. ఈ కార్యక్రమాల అనంతరం తిరిగి విజయవాడకు బయలుదేరి వెళ్తారు.

## దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో ప్రాణాలర్పించిన అమర వీరుడు మురళీ నాయక్

### జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్




పుట్టపర్తి, : సరిహద్దుల్లో మురళీ నాయిక్ ప్రదర్శించిన ధైర్య సాహసాలు దేశానికే కాక రాష్ట్ర ప్రజలందరికీ స్ఫూర్తిదాయకం అని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని వీరజవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్‌ఓ విజయసారథి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణలో భాగంగా జరిగిన పోరాటంలో రాష్ట్రానికి చెందిన వీరజవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందారు. ఆయన ఆత్మకు శాంతి మురళీ నాయిక్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారుదేశం కోసం తన ప్రాణాలను అర్పించిన యువ జవాను మురళీ నాయక్ పేరు చరిత్రపుటల్లో చిరస్మరణీయమైనదిగా నిలిచిపోతుంది. దేశ రక్షణలో ఆయన చూపిన ధైర్యసాహసాలు, పోరాట పటిమకు యావత్ దేశం గర్విస్తోంది తెలిపారు. కొంత సమయం మౌనం పాటించారు

## ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

## జిల్లా ప్రజలకు భరోసానిచ్చింది

హంద్రీనీవా జలాలు త్వరలో అన్ని ప్రాంతాలకు అందుతాయి

సీఎం చంద్రబాబు పర్యటనపై ఎమ్మెల్యే దగ్గుపాటి స్పందన



అనంతపురం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా పర్యటన జిల్లా ప్రజలకు ఎంతో భరోసానిచ్చిందని అనంంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఉరవకొండ నియోజకవర్గం ఛాయాపురంలో హంద్రీనీవా సుజల స్రవంతి పనులకు ముఖ్యమంత్రి వచ్చిన నేపథ్యంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించడం ఆ తర్వాత హంద్రీనీవా విషయంలో జిల్లా రైతాంగానికి ఒక భరోసానిచ్చారన్నారు. త్వరలోనే హంద్రీనీవా జలాలు అన్ని ప్రాంతాలకు అందుతాయన్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం నుంచి గోదావరి జలాలను మరింత ఎక్కువగా తీసుకునేందుకు బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేయాలని ఒక గొప్ప ఆలోచన చేశారన్నారు. వచ్చే నాలుగేళ్లలో ఆ ప్రాజెక్టు పూర్తి చేస్తారన్న నమ్మకం ఉందన్నారు. ఆ ప్రాజెక్టు పూర్తి చేస్తే రాయలసీమ ప్రాంతానికి ఇక సాగు, తాగునీటికి కొరత ఉండదన్నారు. అలాగే పేదరిక నిర్మూలన కోసం పీ4 తీసుకొచ్చారని ఇది కచ్చితంగా ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపుతుందన్నారు. అంతే కాకుండా జిల్లాకు అనేక వరాలు ఇచ్చారని ఇది ఎన్నో ప్రాంతాలకు ఉపయోగపడుతుందన్నారు. సూపర్ సిక్స్ లో కీలకంగా అమ్మకు వందనం, అన్నదాత సుఖీభవా పథకాలు త్వరలోనే ఇస్తామని చెప్పడం ప్రజల్లో సంతోషాన్ని నింపిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

## తీర ప్రాంత భద్రత మరింత పటిష్ట పరచండి

### జిల్లా ఎస్పీ శ్రీ ఆర్. గంగాధరరావు, ఐపిఎస్.




విజయవాడ : జమ్మూ కాశ్మీర్ పరిధిలోని పహల్గాం నందు ఇటీవల జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో ఎక్కడ శాంతిభద్రతలకు విఘాతం వాటిల్లకుండా,ప్రజాజీవనానికి ఆటంకం కలగకుండా ఉండేందుకు గౌరవనీయ రాష్ట్ర డి.జి.పి శ్రీ హరీష్ కుమార్ గుప్తా ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. భూభాగాల ద్వారానే కాకుండా జలమార్గం ద్వారా శత్రువులు ఎవరు జిల్లాలోకి ప్రవేశింపకుండా సముద్రతీరం వెంబడి భద్రతా చర్యలను మరింత పటిష్టం చేశారు.అందులో భాగంగా ఈరోజు జిల్లా ఎస్పీ శ్రీ ఆర్. గంగాధరరావు, ఐపీఎస్.గిలకలదిండి సముద్ర తీర ప్రాంతాన్ని సందర్శించి, గిలకలదిండి న్యూ ఫిషింగ్ హార్బర్ నుండి పడవ ద్వారా మెరైన్ పోలీసులతో కలిసి మొగ వరకు వెళ్లి అక్కడి రక్షణా పరిస్థితులను పరిశీలించారు.అనంతరం మెరైన్ పోలీస్ స్టేషన్ పరిశీలించి, అక్కడ ఎన్ని బోట్ లు ఉన్నది, వాటి పనితీరు, ఎంతమంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నది ఎస్సై బోస్ ని అడిగి తెలుసుకున్నారు.ఎస్పీ మాట్లాడుతూ..ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన నేపథ్యంలో భారత భూభాగంలోనికి శత్రువులు చొచ్చుకురాగలిగే ప్రదేశాలన్నిటిలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.కృష్ణాజిల్లా పరిధిలో సముద్రతీర ప్రాంతాలైన గిలకలదిండి,వర్లగొంది తిప్ప, పోలాటితిప్ప పరిసర ప్రాంతాల్లో నిరంతరం డ్రోన్ కెమెరాలతో ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నామన్నారు.అనుమానిత వ్యక్తులు యొక్క కదలికలు గుర్తిస్తే వారిని ఎదుర్కొనేందుకు వీలుగా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.సముద్ర తీర ప్రాంతాల్లో ఉన్న గ్రామాలను పోలీసు అధికారులు తరచు విజిట్ చేస్తూ, నిఘ వ్యవస్థను, సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని తెలిపారు

# సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయండి

ముఖ్యమంత్రి కోరిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

సత్య సాయి విమానాశ్రయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఘన స్వాగతం పలికిన మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,

సత్యసాయి విమానాశ్రయంలో నియోజవర్గ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన

పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,

ఎమ్మెల్యే వినతిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి



పుట్టపర్తి : పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 100 వ జయంతోత్సవాల సందర్భంగా అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా విన్నవించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం ఛాయాపురం పంచాయతీలో హంద్రీనీవా సుజల స్రవంతి పనుల పరిశీలన, కాలువ వెడల్పు ప్రారంభోత్సవ కార్యక్రమానికి శుక్రవారం సత్యసాయి విమానాశ్రయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు కు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు పుష్ప గుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి శాలువాతో సన్మానించారు .ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు పుట్టపర్తి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర సిఎం కు వినతి పత్రాన్ని సమర్పించారు. సత్యసాయి 100వ జయంతోత్సవాల సందర్భంగా పలు అభివృద్ధి పనులకు సుమారు రూ. 120 కోట్లు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. నియోజకవర్గంలోని రోడ్ల మరమ్మత్తుల కోసం అమ్మడు మండలం మమదాబాద్ క్రాస్ నుంచి బాలసముద్రం సి జి ప్రాజెక్ట్ వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతినిందని వీటికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇది రాష్ట్ర ప్రధాన రహదారి అని ఈ రహదారి నిర్మాణం పూర్తి అవుతే ఇటు చెన్నై తిరుపతి అన్నమయ్య జిల్లా కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం చెన్నరాయ స్వామి గుడి ప్రాజెక్టు పర్యాటకులు తోపాటు కియా కార్ల పరిశ్రమ కు, సత్య సాయి పుట్టపర్తి జిల్లాకు ఇది ప్రధాన మార్గం కాబట్టి ఈ రహదారికి నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా 2018లో టిడిపి ప్రభుత్వ హాయంలో కొత్త చెరువు మండల కేంద్రంలో రూ 2 కోట్లతో మంజూరైన ఇండోర్ స్టేడియం అర్ధాంతరంగా ఆగిపోయిందని వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు.నియోజకవర్గంలోని ఎస్టీ కాలనీల్లోని 81 పనులకు సుమారు రూ.5.కోట్ల 50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని సిఎం ను కోరారు. అంతే కాకుండా నియోజకవర్గంలోని ఎస్సీ కాలనీలో 135 సిసి రోడ్ల నిర్మాణానికి రూ.8 కోట్ల 10 లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో చాలా చోట్ల రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయని వాటి మరమంతుల కోసం 14 కోట్ల 30 లక్షలు నిధులు కేటాయించాలని విన్నవించారు.నియోజకవర్గంలోని ఓడి చెరువు ఆమడగూరు నల్లమడ మండలాలకు శాశ్వతంగా త్రాగునీరు అందించేందుకు గత టిడిపి ప్రభుత్వంలో 2018 19 లో మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చెరువుతో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా మూడు త్రాగునీటి పథకాలకు సంబంధించి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ప్రత్యేకంగా విన్నవించారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా నల్లమాడ మండలానికి రూ.2కోట్ల 70 లక్షలు,ఓడి చెరువు మండలానికి రూ.4కోట్ల 45 లక్షలు ,ఆమడ గూరు మండలానికి రూ.3కోట్ల 50 లక్షలు త్రాగునీటి పథకానికి పూజలు కేటాయించాలని కోరారు. అమడ గూరు మండలం తుమ్మల సింగిల్ రోడ్డును డబుల్ రోడ్ గా మార్చేందుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధురారెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను ప్రత్యేకంగా కోరారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శికి ఎమ్మెల్యే అందించిన ప్రత్యేక వినతి పత్రాన్ని అందజేశారు.

# గణనీయ లాభార్జన దిశగా అప్కో, లేపాక్షి

## చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా



విజయవాడ,: విజయవాడలోని ఆప్కో కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (చేనేత జౌళి ) ఆర్‌పి సిసోడియా అధ్యక్షతన ఆప్కో , లేపాక్షి సంస్థల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రెండు సంస్థల ప్రస్తుత పనితీరు, అభివృద్ధి అవకాశాలపై సమగ్రంగా చర్చించారు. మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ సంస్థల కార్యకలాపాల ప్రస్తుత స్థితిగతులు, భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ ఆప్కో, లేపాక్షి సంస్థలు నష్టాల నుంచి లాభదాయక మార్గంలోకి వెళ్లేలా సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. అన్ని ఉత్పత్తులను ఒకే షోరూఫ్‌లో అందుబాటులో ఉంచే విధంగా షోరూం సమాఖ్య పద్ధతిలో అభివృద్ధి చేయాలని సూచించారు. తద్వారా బ్రాండ్ గుర్తింపు పెరగడమే కాక, వినియోగదారులకు సమగ్ర కొనుగోలు అనుభూతి కలుగుతుందని పేర్కొన్నారు.మార్కెటింగ్ ఆధునీకరణ క్రమంలో, ప్రత్యేక మొబైల్ యాప్ అభివృద్ధి చేయడం, వాట్సాప్ ద్వారా మార్కెటింగ్ చేయడం వంటి డిజిటల్ పద్ధతులపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ మార్గాల్లో యూత్, నూతన వినియోగదారులను చేరుకోవచ్చని అభిప్రాయపడ్డారు. ఇతర ఆదాయ మార్గాల అన్వేషణలో భాగంగా షోరూంల్లో ప్రైవేట్ ప్రకటనల కోసం స్థలాన్ని అద్దెకు ఇచ్చి అదనపు ఆదాయం పొందేలా చేయాలని సూచించారు. అలాగే వినియోగంలో లేని స్థిరాస్తులను గుర్తించి వాణిజ్యపరంగా వినియోగించాలని ఆదేశించారు.మొత్తం ఆర్థిక కార్యకలాపాలకూ ఒకే బ్యాంక్ భాగస్వామిని ఎంపిక చేయాలని, ఆ బ్యాంక్ ద్వారా సీఎస్ ఆర్ నిధులు, తక్కువ వడ్డీ రేట్లు, ఉచిత సాఫ్ట్‌వేర్ వంటి సేవలు పొందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే ఖాతాల నిర్వహణలో ద్వంద్వ ప్రవేశ పద్ధతిని అమలు చేయాలని సూచించారు. అమ్మకాల బలోపేతం కోసం ఉత్పత్తులపై విభిన్న మార్జిన్లు, డైనమిక్ ధరలు, ప్రత్యేక తగ్గింపులు వంటి ప్రణాళికలు అమలు చేయాలని, మార్కెట్ డిమాండ్‌ను బట్టి వాటిని క్రమంగా మారుస్తూ సాగాలన్నారు. విక్రయ సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు, పనితీరు ఆధారిత శిక్షా విధానం అమలు చేయాలన్నారు.ఉత్పత్తుల విభిన్నత, బ్రాండింగ్, ఇమేజ్ బిల్డింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, కొత్త ఉత్పత్తులను అభివృద్ధి చేసి ఆధునిక మార్కెట్‌కు అనుగుణంగా మలచాలని సూచించారు. రవాణా ఖర్చులు తొలగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్థానిక నిల్వ ద్వారా విక్రయ కేంద్రాలకు నేరుగా సరఫరా చేసే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. అలాగే డోర్ డెలివరీ సేవలను కూడా ప్రారంభించి వినియోగదారులకు సౌకర్యాన్ని అందించాలన్నారు.విదేశీ విపణిలో ప్రవేశానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని, ముఖ్యంగా అమెరికాలో నివసిస్తున్న భారతీయులకు లక్ష్యంగా ఉత్పత్తుల ఎగుమతి చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అంతర్గత విభాగాల పునర్నిర్మాణం ద్వారా సమర్థవంతమైన పరిపాలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అంతేగాక, దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులకు అందుబాటులో ఉండే విమానాశ్రయాలు మరియు మహానగరాల్లో బ్రాండెడ్ షోరూములు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.“సబ్సిడీలపై ఆధారపడే వ్యవస్థ నుండి స్వయం సాధికారిత వైపు మారాలి. ఏపికో, లేపాక్షి సంస్థల వద్ద సంపద, సాంప్రదాయం, సామర్థ్యం అన్నీ ఉన్నాయి. వాటిని ఆధునిక టూల్స్, మార్కెట్ అనుసంధానంతో ప్రబలంగా తీర్చిదిద్దాల్సిన సమయం ఇది. నష్టాలను అధిగమించి లాభాల బాటలో పయనించాలి,” అని ఆర్ పి సిసోడియా స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఏపికో జీఎంలు నాగేశ్వరరావు, రాజారావు మరియు లేపాక్షి సీనియర్ మేనేజర్ వెంకటేశ్వరరావు పాల్గొని తమ స్థాయి పరిశీలనలు, సలహాలు వేశారు.

## పేదపిల్లలకి సరస్వతి నిలయంగా వీఆర్ హైస్కూల్

### మంత్రి పొంగూరు నారాయణ



నెల్లూరు : పేద విద్యార్థులకు సరస్వతీ నిలయంగా విఆర్ హైస్కూల్ ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు.శుక్రవారం సాయంత్రం వీఆర్ హైస్కూల్ ఆధునికీకరణ పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.త్వరితగతిన పనులు చేపట్టాలంటే అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్సిసి ఆధ్వర్యంలో పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. ఏడాదికి వెయ్యి మంది విద్యార్థులు చొప్పున ఐదేళ్ల కు 5000 మంది పేద విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. 6 నుంచి 10వ తరగతి వరకు స్కూల్ సమీప ప్రాంతాలలో ఉన్న పిల్లలకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేస్తామని.. మిగిలిన పిల్లలకు ఉచితంగా ట్రాన్స్పోర్ట్ సౌకర్యం కల్పిస్తామన్నారు.పౌష్టికాహారాన్ని కూడా ఉచితంగా అందిస్తామని కార్పొరేట్ తలదన్నే రీతిలో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. భారతదేశంలోనే మోడల్ స్కూల్ గా వీఆర్‌ని నిలబెట్టడమే తన లక్ష్యమని మంత్రి నారాయణ తన ఉద్దేశాన్ని స్పష్టం చేశారు. విఆర్ హైస్కూల్లో చదివే పిల్లల కుటుంబాలను %జూ%4 కింద అభివృద్ధి చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదగా త్వరలో విఆర్ హైస్కూల్ను ప్రారంభిస్తామని అయన మీడియాకు తెలిపారు.ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, నగర అధ్యక్షులు మామిడాల మధు,45వ డివిజన్ ప్రెసిడెంట్ సుజన్,వైస్ ప్రెసిడెంట్ చిరంజీవి,జనరల్ సెక్రటరీ కృష్ణారావు,యూనిట్ ఇంచార్జి మహేష్,బూత్ కన్వీనర్ లత ,అనిల్ టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మావోయిస్టులు చర్చలతో జనజీవన స్రవంతిలో కలిసిపోండి

శ్రీదర్ కుటుంబాన్ని ఆదుకుంటాం...

చర్చల ద్వారా సమస్యలు హు పరిష్కరించుకోవాలి - మంత్రి పొన్నం ప్రభాకర్




కామారెడ్డి : ములుగు జిల్లా వాజేడు ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందు పాతరకు విధి నిర్వహణలో మరణించిన గ్రేహౌండ్స్ పోలీసు వడ్ల శ్రీధర్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వపరంగా ఆదుకుంటామని రాష్ట్ర రవాణా, బి.సి.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండల కేంద్రానికి చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ వడ్ల శ్రీధర్ అంత్యక్రియల్లో పాల్గొనడానికి శుక్రవారం నాడు పాల్వంచకు వచ్చిన మంత్రి మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వడ్ల శ్రీధర్ కుటుంబానికి అండగా నిలుస్తామని తెలిపారు. చర్చల ద్వారా సమస్యలు పరిస్కరించుకోవాలని, మావోయిస్టులు హింస మార్గాన్ని విడనాడాలని అన్నారు. మరణించిన శ్రీధర్ కుటుంబానికి 2.17 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం ప్రభుత్వం నుండి అందజేస్తామని తెలిపారు. తొలుత శ్రీధర్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ సురేష్ షెట్కర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి శాసన సభ్యులు మదన్ మోహన్ రావు, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్, ఏసీబీ చైతన్య రెడ్డి, ప్రభుత్వ అధికారులు, డిసిసి అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, తదితర కాంగ్రెస్ నాయకులు లు పార్థివ దేహం పై పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం.పోలీసు గౌరవ వందనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రేహ్యాండ్ కమాండర్ ఆపరేషన్ రాఘవెందర్ రెడ్డి, ఓఎస్డీ దయానంద్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీ శంకరయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, అదనపు కలెక్టర్ రెవిన్యూ వి.విక్టర్, ఆర్డీఓ వీణ, పోలీసు,స్థానిక ఎస్సై అనిల్,రెవిన్యూ, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కంచి పీఠానికి నవ శకం




### ఇష్టప్రాప్త్యనిష్ట పరిహారయోః
### అలౌకికముపాయం యో వేదయతి స వేదః...

మంచిని పెంపొందించడానికి, చెడును తొలగించడానికి అలౌకికమైన ఉపాయాన్ని తెలియజేసేది వేదం. వేదాలు భగవత్ప్రాప్తికి సోపానాలైన కర్మలనే కాకుండా... లౌకిక జీవితానికి తోడ్పడే సదాచారమనే ధర్మాన్ని కూడా బోధిస్తున్నాయి. అసలు వేదమంతా ధర్మాన్ని మాత్రమే ఉపదేశిస్తోందంటూ 'వేదోఖిలో ?ధర్మమూలమ్' అని ఋషులు నిర్ణయం చేశారు. అటువంటి వేద జ్ఞానం భారతదేశ సంస్కృతిని, సంప్రదాయాన్ని ప్రభావితం చేసింది. ఈ జాతి ఖ్యాతిని ఇనుమడింపజేసింది. అందుకనే భారతదేశం 'వేదభూమి'గా, 'యోగభూమి'గా, 'కర్మభూమి'గా పిలుపులు అందుకుంటోంది.

## మోక్షపురి... కాంచీపురి

ఈ యుగంలో దేశం నలుమూలలకూ సంచారం చేసి తన ఉపదేశాల ద్వారా, రచనల ద్వారా ధర్మాన్ని వ్యాప్తిచేసిన జగద్గురువు ఆది శంకరులు. జగత్తు ఉన్నన్ని రోజులు ఆయన బోధలు వ్యవహారంలో ఉంటాయి. ఆయన అపురూప సృష్టి... మఠాల స్థాపన. దక్షిణంలో శృంగేరి శారదాపీఠం, తూర్పున జగన్నాథ పూరీలో గోవర్ధన మఠం, పశ్చిమంలో సముద్ర తీరాన ద్వారకలో కాళికా మఠం, ఉత్తరాన బదరీనాథ్ సమీపాన జ్యోషిమఠ్ ఏర్పాటు చేశారు. ఆది శంకరులు తన అవతార సమాప్తి సమయాన... కాంచీపురంలో కామకోఠి పీఠాన్ని నెలకొల్పి, ఆ క్షేత్రంలోనే శివైక్యం చెందారని తెలుస్తున్నది. కాంచీపురి మోక్షపురిగా వెలసింది. కంచి శివ క్షేత్రమూ, విష్ణు క్షేత్రమూ కూడా. కామాక్షీ విగ్రహం బిందు స్థానంగా అనేక ఇతర దేవాలయాలను కూడా ఆది శంకరులు నిర్మింపజేశారు. ఈ మఠాల నిర్వహణ నియమాలన్నీ శ్రీ శంకరులు చెప్పగా సుధన్వుడు రాసుకొని 'మహానుశాసనం' అనే పేరుతో గ్రం?థం తయారు చేశాడు. ఆసక్తి రేకెత్తించే మరొక అంశం మనకు కాచీపురంలోని వరదరాజస్వామి వారి దేవాలయంలో దర్శనమిస్తోంది. 'కుడియాంతన్‌దళం' అనే గ్రామానికి 'శంకరాచార్యపురం', అలాగే 'సురుట్టిల్' అని పేర్లు ఉన్నట్టు అక్కడి శాసనాల అధ్యయనం వెల్లడయిన విషయాన్ని 1919లో ప్రచురితమైన ఒక నివేదిక పేర్కొంది. అలాగే క్రీస్తుశకం 1507 నాటి శ్రీవీరనరసింహదేవ కాలానిదైనరాగి రేకులోని వివరాల ప్రకారం... 'కుడియాంతండలం' అనే ప్రదేశాన్ని అప్పటి పీఠాధిపతి శ్రీ మహదేవ సరస్వతికి ఆనాటి విజయనగర ప్రభువు బహూకరించినట్టు తెలుస్తున్నది. ఆ గ్రామం... సురుట్టిల్‌కు పశ్చిమ దిక్కులో ఉంది. ఇంత ప్రాచీనత ఉన్న ఈ మఠ కార్యక్రమాలు ఇప్పుడు మన దేశంలోనే కాదు... అన్ని ప్రపంచ దేశాలకు విస్తరించాయి. ధార్మిక సేవలు నిర్వహిస్తూ, భక్తులకు మార్గ దర్శనం చేస్తున్నాయి.

## సత్యనారాయణ క్షేత్రం నుంచి సత్యవ్రత క్షేత్రానికి

కాగా... ఈ ఏడాది ఏప్రిల్ 30న, శ్రీ ఆది శంకరుల 2534వ జయంతిని పురస్కరించుకొని... దుడ్డు సత్య వెంకట సూర్య సుబ్రహ్మణ్య గణేశ్ ద్రావిడ్‌కు సన్యాస దీక్షను ప్రస్తుత కంచి పీఠాధిపతి అనుగ్రహిస్తున్నట్టు పీఠం శ్రీకార్యం (కార్యనిర్వహణా?ధికారి) గత నెల 25న ప్రకటించారు. వేదాధ్యయనం, శాస్త్ర పరిచయంలో శిష్య స్వామి అసమాన ప్రతిభ గురించి కూడా ఆయన ఆ ప్రకటనలో వెల్లడించారు. దీక్షా ప్రదానం రోజున చేసిన ఏర్పాట్లు అందరినీ మంత్రముగ్ధుల్ని చేశాయి. దీనికోసం ఎంపిక చేసిన ముహూర్తం అద్వితీయం. గురువు సమక్షంలో... శిష్యస్వామి ఎలాంటి జంకు లేకుండా, పంచభూతాల సాక్షిగా "ఓం సన్యస్తం మయ" అని ప్రకటన చేయగానే... భక్తుల ఆనందాతిశయం మిన్నంటింది. బ్రహ్మచర్యం నుంచి సన్యాస దీక్షకు సిద్ధమైన ఆ బాల 'పెరియవ' (స్వామి) వదనంలో శంకరుల దీక్షను దర్శించినవారికి... ఉత్తమానంద స్థితి అక్కడే సిద్ధించింది. ఈ సందర్భంగా ఒక ముఖ్యమైన విషయాన్ని ప్రస్తావించాలి. వరాలకు వ్రతాలకు సంబంధం ఉంది. అన్నవరంలో శ్రీసత్యనారాయణ వ్రతం చేస్తే వరాలు లభిస్తాయని పేర్కొంటూ, సత్యవ్రతం పాటించకపోతే వచ్చే కష్టాల గురించి వ్రత కథ చెబుతోంది. అలాగే ముక్తికి, సత్యవ్రతానికి ఉన్న విడదీయరాని సంబం??ధాన్ని 'ఛాందగ్యోపనిషత్తు' వివరించింది. కాంచీపురిలో సత్యవ్రతేశ్వరుడి ఆలయం ఉంది. ఆ ఊరికి 'సత్యవ్రత క్షేత్రం' అనే పేరు ఉంది. శ్రీ కంచి కామకోటి మఠం బిరుదావళిలో... సత్యవ్రత నామాన్ని 'కాంచి దివ్య క్షేత్ర' అని చెప్పడం జరిగింది. మహా సామ్రాజ్యాన్ని ఇచ్చినా కంచి క్షేత్ర వాసులు సత్యాన్ని విడనాడరని నాయనార్లు కీర్తించారు. అన్నవరం సత్యనారాయణ క్షేత్రం నుంచి సత్యవ్రత క్షేత్రమైన కంచికి వచ్చి సన్యాసం స్వీకరించిన శిష్య స్వామి నామం ముందు 'సత్యం' అని చేర్చడం ఎంతో సమంజసంగా ఉంది. అంతేకాదు... 'కచటపాది విధానం'లో 'సత్య' అనే పదం 71ని సూచిస్తుంది. శ్రీశిష్య స్వాములు కంచి కామకోటి పీఠాన్ని 71వ అధిపతిగా అధిష్ఠించబోతున్నారు. 'నడిచే దైవం'గా జగత్ ప్రసిద్ధి చెందిన శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారు... ప్రస్తుత స్వామివారికి 'శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి' అని నామకరణం చేశారు. వారి సత్యవ్రతం సర్వజన విదితం. ఆయన నామధేయానికే 'సత్యం' అనే విశేషణాన్ని అలంకరించి 'శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి'గా ... శిష్య స్వామికి ప్రస్తుత పీఠాధిపతి నామకరణం చేయడం ముదావహం.

## ఆద్యంతం నేత్రపర్వం

ఈ దీక్షా స్వీకారోత్సవం జరిగిన ప్రదేశ విశిష్టతను క్లుప్తంగా తెలుసుకుందాం. అంబికకు 'లలితా త్రిశతి'లో 'కామకోటి నిలయ' అనే పేరు ఉంది. ఇక్కడ ఆ తల్లి... గురురూపిణి, బ్రహ్మవిద్యా స్వరూపిణి. ఆమె ఆకాశరూపంలో వ్యాప్తి చెంది ఉంది. ఆమె 'ఈషణాత్రయా'న్ని (ధనేషణ, పుత్రేషణ, లోకేషణ) హరింపజేస్తుంది. శిష్య స్వాములకు అద్వైత ప్రతిపాదకాలైన మహా వాక్యాల ఉపదేశం ఆ దేవాలయంలోని పంచగంగ సరస్సు తీరంలో జరిగింది. కంచి కామకోటి పీఠంలో నాలుగు మహావాక్యాలను బోధించడం ఒక విశిష్టత. గురుశిష్యుల కలయిక సమయంలో... పక్షులు తమ కిలకిలారవంతో... ఆ రూపంలో విహరిస్తున్న దేవతలుగా కనిపించడం అపూర్వ సాక్ష్యం. అలాగే శిష్యుని శిరస్సుపై సాలగ్రామాన్ని గురుస్వామి ఉంచి అభిషేకించినప్పుడు... అన్నవరంలో కుంభవృష్టి కురవడాన్ని యాదృచ్ఛికంగా భావించలేం. శిష్య స్వామి సన్యాస దీక్ష కార్యక్రమం సందర్భంగా... కనీసం 10 వేల మంది ఆ సరస్సు దగ్గర ఆశీనులయ్యారు. కాంచీపుర వీధుల నిండా భక్తజన సందోహం కనిపించింది. శ్రీ శంకర విజయేంద్ర సరస్వతికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రార్థనలు అందజేసి, ఈ దీక్షా కార్యక్రమం మహత్తును కొనియాడారు. శ్రీ స్వామివారిని గుజరాత్ రాష్ట్ర పర్యటనకు ఆహ్వానించారు. అనేకమంది ప్రముఖులు హాజరైన ఈ వేడుకకు... తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి భక్తునిగా రావడం విశేషం. "బాసర అమ్మవారికి అమూల్యమైన సేవలు అందించిన శిష్య స్వామి... పీఠాన్ని అధిష్ఠించడం తెలంగాణ ప్రజలందరికీ సంతోషదాయకం, గర్వకారణం" అని తన ఆనందాన్ని వ్యక్తపరచిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధన్యులు.

# ఆడ పులులు సంకల్పం

కొద్ది రోజుల కిందట... అడవిలో తప్పిపోయిన నిర్మల్ జిల్లా కప్పనపల్లి మహిళా కూలీలను వెతికి పట్టుకువచ్చింది 'టీమ్ శివంగి'. చిమ్మచీకటిలో... దట్టమైన అరణ్యంలో... కూంబింగ్ నిర్వహించిన ఆ కమాండో బృందం అంతటా ప్రశంసలు అందుకుంది. ఇరవై మంది మహిళా కానిస్టేబుళ్లతో ఏర్పాటైన 'టీమ్ శివంగి'... నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల మానస పుత్రిక. పోలీసు వ్యవస్థలో మహిళలను శివంగుల్లా తీర్చిదిద్దడానికి... మగవారికి దీటుగా నిలబెట్టడానికి... తీసుకువచ్చిన ఈ 'టీమ్' విశేషాలు 'నవ్య' పాఠకుల కోసం. "మహిళా పోలీసులు ఎందులోనూ తక్కువకాదు. అవకాశం కల్పిస్తే మగ పోలీసులతో సమానంగా సేవలు అందించగలరు. అది నిరూపించడానికే 'టీమ్ శివంగి' ఫోర్స్‌ను ఏర్పాటు చేశాను. ఇప్పటికే జిల్లాలో మహిళా పోలీసులకు అనేక కీలక బాధ్యతలు అప్పగించాం. వారిలో దాగివున్న ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తున్నాం. అంతేకాదు... వారిలో మనోధైర్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ నేపథ్యంలోనే దేశంలో ఎక్కడా లేని విధంగా 'టీమ్ శివంగి' పేరుతో కమాండో బృందాన్ని ఏర్పాటు చేశాం. ఈ బృందం సభ్యులు నిర్మల్ జిల్లా కప్పనపల్లి గ్రామంలోని దట్టమైన అడవుల్లో తప్పిపోయిన నలుగురు మహిళా కూలీలను వెతికి తేవడం అందరూ చూశారు. ఎంతో సాహసంతో రాత్రింబవళ్లూ కూంబింగ్ చేసి వారిని సురక్షితంగా ఇళ్లకు చేర్చారు"... అంటారు నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల. రాబోయే రోజుల్లో ఈ కమాండోసకు ఆమె మరిన్ని కీలక బాధ్యతలు అప్పగించబోతున్నట్టు ఆమె చెప్పారు. ప్రయోగాత్మకంగా జానకి చేపట్టిన అనేక ప్రాజెక్టుల్లో 'టీమ్ శివంగి' ఒకటి. మహిళా సమస్యల పరిష్కారానికి, సైబర్ నేరాల అదుపునకు శాఖలోని చురుకైన మహిళా కానిస్టేబుళ్లను గుర్తించి, పురుష పోలీసులతో సమానంగా బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఇప్పటికే పెట్రోలింగ్, వెహికిల్ చెకింగ్ వంటి క్లిష్టమైన పనులను వారికి కేటాయిస్తున్నారు. 'కేజీబీవీ'ల్లో చదువుతున్న విద్యార్థినులకు అండగా 'పోలీసు అక్క' పేరిట చేపట్టిన కార్యక్రమానికి అంతటా ప్రశంసలు అందుతున్నాయి. ఇలా ఎన్నో. ఈ క్రమంలోనే 'టీమ్ శివంగి' రూపుదాల్చింది.

## ఎందులోనూ తక్కువ కాదు...

జిల్లా పోలీసు శాఖలోని 20 మంది మహిళా కానిస్టేబుళ్లతో ఏర్పాటైన 'టీమ్ శివంగి'కి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుతున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా వీరందరూ 45 రోజులపాటు హైదరాబాద్‌లో కమాండోస్ శిక్షణ తీసుకున్నారు. శివంగి అంటే ఆడ పులి. మహిళలను అంత శౌర్యవంతులుగా తయారుచేయడమే ఈ 'టీమ్' ఏర్పాటు లక్ష్యం. జాతీయ స్థాయిలో ఎన్ఎస్‌జీ, రాష్ట్ర స్థాయిలో గ్రేహౌండ్స్ దళాలకు దీటుగా 'శివంగి' కమాండోస్ అన్నింటా తర్ఫీదు పొందారు. శారీరక దారుఢ్యం, పరుగు పందేలు, వెర్టికల్ రోప్ క్లైంబింగ్, పోరాట నైపుణ్యాలు, పేలుడు




పదార్థాల నిర్వహణలో శిక్షణ, ఆధునిక ఆయుధాల వినియోగం, వెపన్ హ్యాండ్లింగ్, ఫీల్డ్ సిగ్నల్స్, మ్యాప్ రీడింగ్, మ్యాప్ లేకుండా నేవిగేషన్, శత్రువుల కదలికలు, అడవిలో సంకేతాలను చదవడం, నిఘా పద్ధతులు, ఆకస్మిక దాడి, ఎదురుదాడి కసరత్తులు, రహస్య స్థావరాలపై దాడులు చేయడం వంటి అంశాలతో కూడిన కఠినమైన శిక్షణ కార్యక్రమంతో వీళ్లు రాటుదేలారు.

## సాహసోపేతంగా...


ఆ మధ్య నిర్మల్ జిల్లాలోని మామడ మండలం కప్పనపల్లి గ్రామానికి చెందిన నలుగురు తునికాకు మహిళ కూలీలు దట్టమైన అడవుల్లో తప్పిపోయారు. గ్రామస్తుల నుంచి ఫిర్యాదు అందుకున్న ఎస్పీ జానకీ షర్మిల... వెంటనే 'టీమ్ శివంగి' కమాండోలను రంగంలోకి దింపారు. ఎస్పీ నేతృత్వంలోని ఈ టీమ్... దట్టమైన అడవిలో రాత్రంతా కూంబింగ్ నిర్వహించింది. ఎంతో ధైర్యసాహసాలతో అడవిని వడపోసి... తప్పిపోయిన నలుగురు మహిళా కూలీలనూ సురక్షితంగా తీసుకువచ్చింది. తమ సత్తా ఏమిటో ప్రపంచానికి చాటిచెప్పింది. పురుష కమాండోసకు దీటుగా... దట్టమైన అడవిలో, చిమ్మ చీకటిని లెక్క చేయకుండా కూంబింగ్ నిర్వహించిన తీరు ప్రశంసలు అందుకుంది.

**కొండూరి రవీందర్, నిర్మల్**

ఇప్పటికే జిల్లాలో మహిళా పోలీసులకు అనేక కీలక బాధ్యతలు అప్పగించాం. వారిలో దాగివున్న ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తున్నాం. అంతేకాదు... వారిలో మనోధైర్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ నేపథ్యంలోనే దేశంలో ఎక్కడా లేని విధంగా 'టీమ్ శివంగి' పేరుతో కమాండో బృందాన్ని ఏర్పాటు చేశాం.

# పుష్కర సరస్వతి సమాచారం

నదులను దేవతలుగా భావించి, పూజించే సంస్కృతి మనది. మన జీవన అవసరాలను తీర్చే నదులకు కృతజ్ఞతలు తెలుపుకొనే సంప్రదాయాన్ని పుష్కరాల రూపంలో పూర్వులు నిర్దేశించారు. తదనుగుణంగా ఒక్కొక్క రాశిలో బృహస్పతి ప్రవేశించినప్పుడు... ఒక్కొక్క నదికి పుష్కరాలు జరుగుతాయి. పన్నెండు ప్రధాన నదులకు... పన్నెండేళ్ళకు ఒక్కోసారి పుష్కరాలు వస్తాయి. ఆ పుష్కర నదుల్లో సరస్వతి ఒకటి. మిగిలిన నదుల్లా కాకుండా అంతర్వాహినిగా ప్రవహించడం ఈ నది ప్రత్యేకత. ఋగ్వేదంలో, పురాణాల్లో సరస్వతీ నది ప్రస్తావన ప్రముఖంగా ఉంది. పవిత్రమైన సప్త నదుల్లోనూ సరస్వతికి విశిష్ట స్థానం ఉంది. అందుకే, స్నానం చేసినప్పుడు... గంగే చ యమునే చైవ గోదావరీ సరస్వతీ... నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు... అంటూ ఈ నదులను తలచుకోవడం పుణ్యప్రదమని చెప్పారు పెద్దలు. బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించినప్పుడు సరస్వతీ నదికి పుష్కరాలు వస్తాయి. ఈ ఏడాది మే 15 నుంచి 26వ తేదీ వరకూ పన్నెండు రోజుల పాటు సరస్వతీ నదికి పుష్కరాలు జరగబోతున్నాయి. ఎక్కడ?: సరస్వతీ నది పుట్టిన చోటుగా పరిగణించే ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని బదరీనాథ్ సమీపంలో ఉన్న మానా గ్రామంలో పుష్కర స్నానాల కోసం ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సరస్వతీ నది... అలకనంద నదికి ఉపనది. కేశవ ప్రయాగ దగ్గర అలకనందలో కలుస్తుందంటారు. అలాగే సరస్వతీ నది అంతర్వాహినిగా... ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో, గుజరాత్‌లోని సోమనాథలోని త్రివేణీ సంగమాల్లో, రాజస్థాన్‌లోని పుష్కర్‌లో కలుస్తుందనే విశ్వాసం ఉంది. ఆ ప్రాంతాల్లో కూడా పుష్కరాలను నిర్వహిస్తున్నారు.



## కాళేశ్వరంలో ప్రతిష్ఠాత్మకంగా...


తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం... సరస్వతీ నది పుష్కరాలకు సిద్ధమవుతోంది. గోదావరి, ప్రాణహిత నదులతో సరస్వతి కలిసే త్రివేణీ సంగమంలో పుష్కర స్నానాల కోసం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 15 నుంచి 26 వరకు జరిగే పుష్కరాల్లో భాగంగా... శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో నిత్యం వివిధ హోమాలను నిర్వహిస్తారు. అలాగే ప్రధాన ఘాట్ వద్ద నదీ హారతి కార్యక్రమం ఉంటుంది. శ్రీ మాధవానంద సరస్వతి, శ్రీ పరిపూర్ణానంద స్వామి, శ్రీ సచ్చిదానంద సరస్వతి, శ్రీ విద్యాశంకర భారతి, ఆచార్య సంవిదానంద సరస్వతి మహరాజ్, శ్రీ జగద్గురు విద్యారణ్య భారతి, శ్రీ యోగానంద సరస్వతి తదితర ఆధ్యాత్మిక ప్రముఖులు ఈ పుష్కరాలకు హాజరై ప్రార్థనలు చేస్తారు, అనుగ్రహభాషణలు చేసి, భక్తులకు ఆశీస్సులు అందజేస్తారు. పుష్కరాల కోసం తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడలతో సహా పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు శ్రీ మహా సరస్వతి అమ్మవారి ఆలయం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంతో పాటు సమీప ఆలయాల సందర్శించుకోవచ్చు.

### ఈ నూనె వాడితే..
# గుండెకు చాలా మంచిది



శరీరంలో కొలెస్ట్రాల్ తగ్గించడంలో.. రెండు రకాల కొవ్వులు ఉన్నాయి. అవి.. ఆరోగ్యకర, అనారోగ్యకరమైన కొవ్వులు. వీటిలో చెడు కొవ్వులు.. శరీరానికి హాని చేస్తాయి. చెడు కొలెస్ట్రాల్ శరీరంలో అధికంగా చేరి.. మనిషిని అనారోగ్యానికి గురి చేస్తుంది. చెడు కొలెస్ట్రాల్ వల్ల కాలేయం, గుండెకు సంబంధించిన జబ్బులతోపాటు ఊబకాయం తదితర సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయి. ఒకవేళ శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ఉందని తెలిస్తే.. ఈ కింది చిట్కాలు ఫాలో అయితే చాలు. వాటిని తగ్గించుకోవచ్చు. అవి ఏటంటే.. శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో ఐదు రకాల నూనెలు సహాయపడుతాయి. శరీరంలోని కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయపడే నూనెలతో మీ గుండెను ఆరోగ్యంగా పదిలంగా ఉంచుకోవచ్చు. నువ్వుల నూనె: ఈ నూనెలో పొగ శాతం అధికంగా ఉంటుంది. ఇందులో కొలెస్ట్రాల్ స్థాయి తక్కువగా ఉంటుంది. ప్రతి టేబుల్ స్పూన్‌లో 5 గ్రాముల కంటే ఎక్కువ మోనోశాచురేటెడ్ కొవ్వుతోపాటు 2 గ్రాముల కొవ్వు ఉంటుంది. ఈ నువ్వుల నూనె.. కూరలు చేయడానికి లేకుంటే సలాడ్‌లో తయారీలో ఉపయోగించవచ్చు. కానీ నువ్వుల నూనెలో కొద్ది పాటి వగరు ఉంటుంది. దీని కారణంగా వంటల్లో వినియోగించడానికి పలువురు సందేహిస్తారు. వేరుశెనగ నూనె: ఈ నూనెలో చాలా పోషకాలుంటాయి. మార్కెట్‌లో ఈ నూనె ధర అధికంగా ఉంటుంది. అలాగే ఈ నూనెలో కొలెస్ట్రాల్ స్థాయిలు సైతం స్వల్పంగా ఉంటాయి. అందువల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అంతేకాదు క్యాన్సర్ వ్యాధిని నిరోధించడంలో సైతం సహాయ పడుతుంది.ఈ నూనె వినియోగంతో గుండె పనితీరును మెరుగు పరచుకోవచ్చు. నాడీ వ్యవస్థ మెరుగుపరచడానికి.. రోగనిరోధక శక్తిని బలోపేతం చేయటానికి..రక్తపోటును తగ్గించటానికి.. చర్మాన్ని రక్షించడంలో వేరు శనగ నూనె కీలక పాత్ర పోషిస్తుంది. ఆలివ్ ఆయిల్: ఆలివ్ ఆయిల్‌లో కొలెస్ట్రాల్ ఉండదు. దీనిని ఎక్కువగా సలాడ్‌లు లేదా పాస్తాలో ఉపయోగిస్తారు. ఆలివ్ ఆయిల్‌లో ఒలియోకాంతల్ అనే పదార్థం ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌తోపాటు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. ఈ నూనె రక్తంలో కొలెస్ట్రాల్, చెడు కొలెస్ట్రాల్ ట్రైగ్లిజరైడ్స్ స్థాయిని తగ్గిస్తుంది. అలాగే ఆలివ్ ఆయిల్‌లో ఉండే గుండె-ఆరోగ్యకరమైన కొవ్వులు మంచి కొలెస్ట్రాల్ స్థాయిని మెరుగుపరుస్తుంది. చియా సీడ్ ఆయిల్: ఆల్ఫా-లినోలెనిక్ యాసిడ్, ఇది గుండె ఆరోగ్యకరమైన ఒమేగా-3 కొవ్వు ఆమ్లాల ఉత్పత్తికి దోహదం చేస్తుంది. చియా విత్తనాలు ఫైబర్, ప్రోటీన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లను అందిస్తుంది. బంగారు రంగులో ఉండే నూనెను చియా అంటారు. ఇది తక్కువ ఫ్రైయింగ్, పాస్తా, సలాడ్‌ల తయారీలో వినియోగిస్తే మంచిది. ఇది తక్కువ రుచిని కలిగి ఉంటుంది. వీటిలో ఫైబర్ స్వల్పంగా ఉంటుంది. కొలెస్ట్రాల్, బ్లడ్ షుగర్‌తోపాటు రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే ఇతర ఆరోగ్య ప్రయోజనాలను ప్రోత్సహించడంలో దోహదపడుతోంది. అవోకాడో ఆయిల్: అవోకాడో నూనెలో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు పుష్కలంగా ఉంటాయి, ముఖ్యంగా ఒలేయిక్ యాసిడ్, ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది కొవ్వులు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది, రక్తపోటును తగ్గించడంతోపాటు గుండె జబ్బుల నుంచి రక్షిస్తుంది. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్‌లను కలిగి ఉంటుంది. అవకాడో ఆయిల్ శరీరం సహజంగా తయారు చేయలేని లుటిన్ వంటి ఆరోగ్యకరమైన యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటుంది. కాబట్టి అవోకాడో ఆయిల్‌తో సహా కంటి ఆరోగ్యాన్ని పెంపొందించే లుటిన్‌ని పొందవచ్చు.

# సలహా గర్భాశయంలో గడ్డలుంటే?



డాక్టర్! నా వయసు 30 ఏళ్లు. పెళ్లై ఐదేళ్లయినా పిల్లలు కలగడం లేదు. వైద్య పరీక్షల్లో ఫైబ్రాయిడ్లు ఉన్నాయని తేలింది. పిల్లలు కలగకపోవడానికి ఫైబ్రాయిడ్లే కారణమా? వీటిని తొలగించుకునే మార్గం లేదా?

**- ఓ సోదరి, విశాఖపట్నం.**

పునరుత్పత్తి వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషించే గర్భాశయంలో ఫైబ్రాయిడ్లు అనే గడ్డలు కొందరు మహిళల్లో తయారవుతూ ఉంటాయి. ఇవి రకరకాల పరిమాణాల్లో ఉంటాయి. ఒకటి నుంచి రెండు సెంటీమీటర్ల కంటే చిన్న ఫైబ్రాయిడ్లను వైద్య చికిత్స సహాయంతో తగ్గించుకోవలసి ఉంటుంది. ఫైబ్రాయిడ్స్ ఉన్న మహిళల్లో నెలసరి స్రావంలో రక్తపు గడ్డలు కనిపించడం, నొప్పి లాంటి లక్షణాలు ఉంటాయి. ఒకవేళ ఫైబ్రాయిడ్స్ చాలా పెద్దవిగా ఉంటే, గర్భసంచి పక్కన ఉండే మూత్రాశయం మీద ఒత్తిడి పడడం మూలంగా మూత్రసంబంధ సమస్యలు (తరచూ మూత్రవిసర్జన చేయవలసి రావడం, మూత్రవిసర్జన పూర్తిగా జరగకపోవడం) మొదలవుతాయి. అలాగే కడుపులో నొప్పి, కడుపు ఉబ్బరం, కొన్నిసార్లు జీర్ణ సమస్యలు కూడా తలెత్తే అవకాశాలుంటాయి. కొన్ని రకాల ఫైబ్రాయిడ్లు గర్భసంచి లోపలి పొరల్లో ఏర్పడతాయి. వీటి వల్ల గర్భస్రావం జరిగిపోవడం, గర్భం దాల్చలేకపోవడం లాంటి సమస్యలు తలెత్తుతాయి. కొందర్లో ఫైబ్రాయిడ్లు ఉన్నప్పటికీ ఎటువంటి లక్షణాలూ కనిపించకపోవచ్చు. ఇలాంటప్పుడు ఆరు నెలలు లేదా ఏడాదికోసారి అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకుంటూ ఫైబ్రాయిడ్ల పరిమాణాన్ని కనిపెడుతూ ఉండాలి. అలాగే కొందరు మహిళల్లో పెద్ద సైజు ఫైబ్రాయిడ్లు ఉంటాయి. ఇతరత్రా వైద్య చికిత్సలు ఫలితాన్నివ్వవు. కాబట్టి సర్జరీ ద్వారా మాత్రమే వాటికి చికిత్స చేయవలసి ఉంటుంది. ఫైబ్రాయిడ్‌ను మాత్రమే తొలగించే మయోమెక్టమీ లేదా ఫైబ్రాయిడ్స్‌తో పాటు, గర్భసంచిని కూడా తొలగించే హిస్ట్రక్టమీ సర్జరీలను ఎంచుకోవలసి ఉంటుంది. అయితే ఎవరికి ఏ సర్జరీ అవసరం అనేది వారి వారి వయసు, ఫైబ్రాయిడ్ మూలంగా తలెత్తే సమస్యల మీద ఆధారపడి ఉంటుంది. యువతుల్లో ఫైబ్రాయిడ్ల వల్ల గర్భధారణ సమస్యలున్నా, నెలసరి సమస్యలున్నా ఫైబ్రాయిడ్ గడ్డను మాత్రమే తొలగించే మయోమెక్టమీ సర్జరీ అవసరం అవుతుంది. అలా కాకుండా పిల్లలు కలిగి, 40 నుంచి 45 ఏళ్లు దాటి, ఫైబ్రాయిడ్ పరిమాణం వేగంగా పెరుగుతున్న పరిస్థితి ఉంటే, ఫైబ్రాయిడ్‌తో పాటు గర్భసంచిని కూడా తొలగించవలసి ఉంటుంది. ఇలా ఫైబ్రాయిడ్ సైజును బట్టి, వయసును బట్టి, బాధిస్తున్న సమస్యలను బట్టి సర్జరీ అవసరాన్ని వైద్యులు అంచనా వేస్తారు.

# వంటింటి పదార్థాలతో "హెల్దీ లివర్"-

: శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాలలో కాలేయం ఒకటి. రక్తాన్ని శుభ్రపరచడం, విష పదార్థాలను విచ్ఛిన్నం చేయడంతో పాటు జీర్ణక్రియ సక్రమంగా జరగడానికి దోహదపడుతుంది. కానీ చాలా మంది గుండె, కిడ్నీల పనితీరు బాగుండాలని అనేక జాగ్రత్తలు తీసుకుంటారు కానీ, కాలేయం గురించి పెద్దగా పట్టించుకోరు. కాలేయం ఆరోగ్యం గురించి జాగ్రత్తలు తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. కొన్ని ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని, మరికొన్ని వాటి జోలికి పోవద్దని సూచిస్తున్నారు. మరి అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం! పసుపు : పసుపు అనేది భారతీయ వంటల్లో సాధారణంగా ఉపయోగించేది. ఇందులో ఉన్న కర్కుమిన్ అనేది కాలేయాన్ని రక్షించడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. కాలేయంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి కర్కుమిన్ దోహదపడుతుందని %చీఫ్‌ఱశీఖఱశ్రీ ాఱఎత్ఱతీఎ శీట వీవసఱఎఱఅవ% అధ్యయనంలో పేర్కొంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు అనేవి కాలేయ పనితీరును మెరుగుపరుస్తాయని నిపుణులు పేర్కొన్నారు. ఇది జీర్ణక్రియ మెరుగుపరచడంతో పాటు కాలేయంలో ఉన్న విషపదార్థాలను తొలగించడంలో సహాయపడతాయని తెలిపారు. కూరల్లో, టీ లేదా వెచ్చని పాలలో చిటికెడు పసుపు వేసుకోవడం వల్ల కాలేయం ఆరోగ్యంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఉసిరి

ఉసిరి : ఆయుర్వేదంలో ఉసిరికి ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు కాలేయ కణాలను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయని నిపుణలు చెబుతున్నారు. ఆమ్లా అనేది కాలేయంలో ఉన్న విష పదార్థాలను తొలగించడం వల్ల మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని తెలిపారు. వీటిని క్రమం తప్పకుండా తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు కాలేయ పనితీరుపై ప్రయోజనకరమైన ప్రభావం ఉంటుందని పేర్కొంది.

వెల్లుల్లిజి

వెల్లుల్లి : ఇది చూడడానికి చిన్నగా ఉండవచ్చు, కానీ దీని వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇది కాలేయ ఎంజైమ్?లను పెంచడంతో పాటు ఆక్సీకరణ ఒత్తిడిని ఎదుర్కోవడానికి సహాయపడుతుందని తెలిపారు. అంతేకాకుండా కాలేయంలో ఉన్న విషపదార్థాలను

Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers ,H.NO. 24-91/72,73,74 IDA Uppal, Uppal Mandal,Medchal Malkajgiri District,Telangana, Published at,H.NO.1-5-631/276,Abedkar Colony,Old Alwal Village,Alwal Mandal,Medchal Malkajgiri District,Telangana,cell 6305539214,Editor GILAKARA SRIDHAR,RNI NO,TEL TEL/2016/71618. gmail: maroudayam20@gmail.com